# వ్యాసమంజరి



యా కుందేందు తుషార హార ధవళా యా శుభ్రవస్త్రాన్వితా
యా వీణావరదండ మండితకరా యాశ్వేత పద్మాసనా!
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైః సదావందితా
సామాంపాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా.

## దసరా శుభాకాంక్షలతో ....



మా వద్ద అన్ని రకముల పంచెలు, చాపులు, 9 × 5, 10 × 6 రెక్కచాపులు, కండువాలు, అంగవస్త్రములు, ధావళీలు, శాలువాలు, ప్యూర్ & ఆర్ట్ పట్టు పంచెలు, పట్టు షర్టింగ్ క్లాత్‌లు, తువ్వాళ్ళు, దుప్పట్లు, లుంగీలు, డోర్ కర్టెన్లు, 6, 7 గజముల నేత చీరలు, వివాహ, ఉపనయనములకు, యజ్ఞయాగాదులకు కావలసిన అన్ని రకముల చేనేత, మిల్లు వస్త్రములు హోల్‌సేల్ ధరలకు లభించును.

# *Chenkumartex*

**HANDLOOM FABRICS**

## SURYA TEX

(Tamilnadu Handlooms)
27-17-48, Rowfin Chitfunds Building,
Peddibhotla Vari Street, Governorpet
VIJAYAWADA - 520 002
Ph : Shop : 0866-2579185
Ph. Resi : 0866-2538111

**ప్రొ.కాశీభొట్ల వేంకట శివసూర్యం**

వేదో౽ ఖిలో ధర్మమూలమ్

# వేదపరిషత్

**పట్టాభిపురం, గుంటూరు -6.స్థాపితం : 1974, రి.నెం.221/1974**

## ముందుమాట

"వేదో౽ ఖిలో ధర్మమూలమ్" – సమస్త ధర్మములకు మూలము వేదమే. అట్టి వేద పరిరక్షణకు నడుంబిగించిన వేదపరిషత్ తన వార్షిక నివేదికతో పాటు భారతీయ సంస్కృతి – ధార్మిక వైభవ విశేషాలు వర్ణించే వ్యాసాలను ఆహ్వానించింది. మా విజ్ఞప్తిని మన్నించి వ్యాసావళి అందించిన వ్యాసకర్తలకు వేదపరిషత్ సభక్తికంగా నమస్సులర్పిస్తూ, వారి సహకారము కొనసాగాలని ఆకాంక్షిస్తోంది.

శ్రీ శృంగేరి జగద్గురువు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాముల వారి అనుగ్రహ సందేశము, పాఠకులలో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని నింపింది. మానవునికి ధర్మము తెలిసినా, ధర్మవిరుద్ధంగా ప్రవర్తించటానికి కారణం అరిషడ్వర్గాలను జయించలేకకోవటమే. ఇందుకు దృష్టాంతముగా స్వామివారు, వారి అనుగ్రహ సందేశములో భారతంలో, గీతలో, శంకర విజయంలో పేర్కొన్న పలుశ్లోకాలను ఉటంకించారు. మనిషికి నిజమైన ఆనందము కలగాలంటే ప్రవర్తించవలసిన తీరును గూర్చి స్వామివారు తెలిపిన దృష్టాంతములు స్ఫూర్తి దాయకములు, విశ్వకళ్యాణ కారకములు – శృంగేరి జగద్గురువుల "అనుగ్రహ సందేశము" మానవాళికి సుఖశాంతులను ఒసంగగలదని విశ్వసిస్తూ, స్వామివారికి సాష్టాంగ దండ ప్రమాణమాలు ఆచరిస్తోంది వేదపరిషత్.

శ్రీ అక్కిపెద్ది వారు "విదురనీతులు" అనే వ్యాసాన్ని సమర్పించారు. ఈ వ్యాసంలో మహాభారతము ఆర్ష వాఙ్మయానికి ప్రబల ప్రమాణమని పేర్కొంటూ, విదురనీతులను వారు తెలిపినారు. శమ, దమాది గుణ సంపత్తి సన్మార్గులలో గోచరమని, మదము, దమము అనే పదాలను శబ్ద చమత్కారముతో, దుర్జన, సజ్జనులలో చొప్పించిన తీరు పాఠకులను చైతన్యపరుస్తుంది. మానవుడు శాంతముగా, ఆనందమయుడిగా, జీవన్ముక్తుడిగా ఉండటానికి పరబ్రహ్మస్థితికి చేరాలని, సత్యము ఒక్కటి వుంటే సంసార సాగరాన్ని దాటవచ్చని, మనస్సు నిర్మలముగా ఉంటే వాక్కు కర్మలు మనలో వైభవము ప్రకాశిస్తాయని వివరిస్తూ, విదురుడు తెల్పిన నీతులు, ధార్మిక విషయాలు మానవాళి మనుగడకు హేతభూతమని ముగించారు. చక్కని వ్యాసాన్ని సమర్పించి, పవిత్ర జీవనానికి మార్గదర్శనము చేసిన శ్రీ అక్కిపెద్దివారికి అంజలి ఘటిస్తోంది వేదపరిషత్.

ముత్యాలవంటి ప్రకాశవంతమైన 55 సూక్తులను తమ వ్యాసంలో పొందుపరిచారు. "మధురవక్త" డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి గారు. ఈ సూక్తులన్నీ రామాయణ, భారత భాగవతాలలో, ఉపనిషత్తులలో

నీతిశాస్త్రములలో ఉటంకించినవి. వీటిని సమాజానికి ఎరుకపరచి జాగృతము చేయాలని, మనము కూడ ఆచరిస్తే, బాధ్యత నెరవేర్చిన వారమవుతామని వారు ముగింపు పలికినారు. చక్కని సూక్తులను అందించి “వ్యాసమంజరి”ని సుసంపన్నం చేసిన డాక్టర్ పోలేపెద్ది వారికి వందన శతము లర్పిస్తున్నది వేదపరిషత్.

“భగవద్గీత నాయకత్వ లక్షణాలు” అనే వ్యాసాన్ని డా. యస్. వి. యస్. యల్. ఫణికామేశ్వరి గారు సమర్పించారు. ఈ వ్యాసములో శ్రీమతి కామేశ్వరి గారు భక్తి యోగములో చెప్పిన ఏడు శ్లోకాలను తీసుకొని చక్కగా వివరించారు. మానవుడు సద్గుణాలను అలవాటు చేసుకొని గీతాకారుడు చెప్పిన మార్గంలో నడుచుకొని అడుగులు వేయాలని ఆకాంక్షించారు. సరళశైలిలో భగవద్గీతలోని నాయకత్వ లక్షణాలను వ్యాసరూపంలో అందించిన శ్రీమతి కామేశ్వరి గారికి అభినందన మందారాలు.

భారతీయ సంస్కృతి (ప్రశ్నోత్తరములు) వ్యాసాన్ని సమర్పించిన డాక్టర్ నిష్ఠలవారు, వేదములు, శాస్త్రములు, పురాణములు, ఉపనిషత్తులు గురించి వివిధ భాష్యకారులను, రచయితులను ఈ వ్యాసంలో పరిచయము చేసినారు. వారి ప్రశ్నోత్తరములు పాఠకులను ఆలోచింపజేస్తాయని భావిస్తూ, వ్యాసాన్ని సమర్పించిన నిష్ఠల వారికి కృతజ్ఞతలు.

ఆదిశంకరులకి అంజలి శతము నర్పిస్తూ కవితాభారతి రాయప్రోలు వారు, శంకరుని వైభవ విశేషాలు శోభాయమానంగా వర్ణించారు. ఆదిశంకరులకి అంజలి శతము నర్పించిన రాయప్రోలు వారికి వేదపరిషత్ వందనశతము నర్పిస్తోంది.

అధర్వణవేద వైశిష్ట్యాన్ని వివరిస్తూ డాక్టర్ చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ గారు ఆయుర్వేద శాస్త్రాన్ని పాఠకులకు పరిచయం చేసినారు. వేదమంత్రాలతో పాటు వస్తుగుణ దీపిక గ్రంథములో పేర్కొన్న పలు విషయాలను వీరు పరిశోధనాత్మకంగా వ్యాసంలో పొందుపరిచారు. ఆయుర్వేద వైద్య శాస్త్ర రహస్యాలు, ఓషధులు గురించి పాఠకులకు వివరంగా తెలిపిన చిఱ్ఱావూరి వారికి నమస్సుమాంజలి.

‘నమామి ఆదిశంకరమ్’ వ్యాసాన్ని అందించిన డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యకవి గారు శంకరుల అద్వైతాన్ని చక్కగా ఆవిష్కరించారు. ఆదిశంకరులకు సీసపద్యంలో నతులు సమర్పించిన పాతూరి వారికి సన్నుతులు సమర్పిస్తున్నాము.

“శ్రీ మద్భాగవత సప్తాహ మాహాత్మ్యము” వ్యాసాన్ని సమర్పించిన, శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు శ్రీకృష్ణ పరమాత్మ భాగవత గ్రంథరూపములో దర్శనమిస్తున్నాడని, సంసారసాగరము నుండి విముక్తి పొందుటకు స్వామిని శరణువేడవలెనని చెప్పినారు. భాగవత ప్రవచనకారులను సుఖస్వరూపముగా భావించి, కీర్తించి, భాగవత సప్తాహయజ్ఞమును నిర్వహించవలసిన విధానాన్ని వివరించారు. భాగవత మాహాత్మ్యము తొలుత వినాలని, స్త్రీలకు సహితము సప్తాహ యజ్ఞమును చేయుటకు అర్హత ఉన్నట్లు పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధ,

ఉపవాస విధులు పాటించి, శ్రీ కృష్ణపరమాత్మ అనుగ్రహాన్ని పొందాలని పేర్కొంటూ ముగించారు. పాఠకులలో భాగవత భక్తిబీజాలు నాటిన, శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారికి నమస్సుమనస్సులు.

"పౌరాణిక సాహితీ సౌరభము" వ్యాసాన్ని సమర్పించిన శ్రీ ముష్టి కృష్ణమోహనశర్మ అవధాని గారు, రామాయణ, భారత, భాగవతాలలో పేర్కొన్న మానవతా విలువలు, మానవ సంబంధాలు, ప్రేమాభిమానాలు గురించి సోపపత్తికముగా తెలిపినారు. అందమైన ఈ వ్యాసం పాఠకులకు కనువిందు చేస్తుందని భావిస్తూ, వారికి అభినందనలు.

"వేదసంరక్షణ" వ్యాసాన్ని సమర్పించిన డాక్టర్ ముళ్ళపూడి సత్యనారాయణశాస్త్రి గారు వేదాన్ని నిర్వచించి, వేదంలో పేర్కొన్న అనేకానేక విషయాలను, ఈ వ్యాసంలో విశదీకరించారు. రాజు కర్తవ్యము, ప్రజా సంక్షేమము. వేదపరిరక్షణ బ్రాహ్మణుల విధి. వేద సంరక్షకులైన, తపస్సంపన్నులైన బ్రాహ్మణులను రక్షిస్తానని, శ్రీరామచంద్రుడు సీతతో పేర్కొన్న విషయము, వేదాధిక్యాన్ని ప్రకటించినట్లే. లోకకళ్యాణ కారకమైన దేవాలయాలను పరిరక్షించాలని, వాటి ఆస్తులు కాపాడటం ప్రజాప్రతినిధుల కర్తవ్యంగా పేర్కొన్నారు. సందేశభరితమైన వ్యాసాన్ని సమర్పించిన శ్రీ ముళ్ళపూడి వారికి అనేకానేక నమస్కారాలు.

డాక్టర్ కె.గిరిజాలక్ష్మీ గారు, పరశురామలింగమూర్తి కవిగారు రచించిన "సీతారామాంజనేయ సంవాదం" కావ్యంలో నిక్షిప్తమై ఉన్న పరబ్రహ్మతత్వాన్ని విపులంగా వివరించారు. ఇందులో పూర్వకవులను – కవినుతించాడు. అహింసా, సత్యం, బ్రహ్మచర్యం వంటి విషయాలు, యోగాసన లక్షణాలు తెల్పినారు. సంజీవని వంటి సీతారామాంజనేయ సంవాద" వేదాంత గ్రంథము జిజ్ఞాసులకు స్ఫూర్తి కలిగిస్తుందని ముగించారు. గ్రంథాన్ని పలుకోణాలలో ఆవిష్కరించి, పరిచయాన్ని చేసిన డాక్టర్ గిరిజాకుమారి గారికి ధన్యవాదాలు.

శ్రీ సోమాశి వారు 'జయశబ్దార్థాన్ని' పురాణాల వైశిష్ట్యాన్ని విశదీకరించి వ్యాసప్రార్థనతో ముగించారు. వేదపరిషత్ ఆకాంక్ష మేరకు పురాణ పరిచయము చేసిన పౌరాణికులు శ్రీ సోమాశి బాలగంగాధరశర్మ గారికి వందన చందనాలు.

వేదపరిషత్ స్వర్ణోత్సవాల సందర్భంగా పద్యాలతో శుభాకాంక్షలందించిన బ్రహ్మశ్రీ రామడుగు వేంకటేశ్వరశర్మ గారికి మరియు బ్రహ్మశ్రీ అక్కిపెద్ది రామసూర్యనారాయణ గారికి ప్రణామాలు.

ఈ వ్యాసాలలోని భావజాలము వ్యాసకర్తలదే.

**వేదపరిషత్**



## శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాములవారి

# అనుగ్రహ సందేశము

### మన జీవితం ఎప్పుడు ఆనందదాయకమవుతుంది?

పుణ్యపాపాలు క్రమంగా సత్కర్మల మరియు దుష్కర్మల ఫలితమని చాలామందికి మంచి అవగాహనే ఉంది. మంచి – చెడుల మధ్య తేడాను గ్రహించగలిగినా ఆశ్చర్యకరంగా మానవుడు పాపపు కర్మలలోనే నిమగ్నుడవుతాడు.

ఒకసారి దుర్యోధనుని ఇలా ప్రశ్నించారు – “మీరు రారాజు. శాస్త్రాలను చదివారు. ధర్మమంటే ఏమిటో తెలుసు. అయినా మీరు ఇలా ఎందుకు ప్రవర్తిస్తారు?” అందుకు దుర్యోధనుడు – **జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః జానామ్యధర్మం న చ మే నివృత్తిః...** “ధర్మమంటే ఏమిటో నాకు తెలుసు. అయినా నా మనస్సు దాని వైపు మొగ్గడం లేదు. అధర్మమూ నాకు తెలుసు. కాని నా మనస్సు పాపకర్మలనాచరించడానికే ఇష్టపడుతోంది” అని సమాధానమివ్వడం ఆశ్చర్యం. శ్రీకృష్ణభగవానుని మాటలను వింటున్న అర్జునుడు “దేవా! నీవు బోధించే విషయం తెలుస్తున్నా, మనిషి ప్రవర్తన చూస్తే వింతగా అనిపిస్తోంది” అంటూ –

**అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥** –

“మనిషికి తాను ఏమి చేస్తున్నాడో తెలిసి చేసినా... ఎవరి బలవంతం మీదనో చేస్తున్నట్లు పాపపు పనులనే చేస్తుంటాడు. దానికి కారణమేమిటి?” ప్రశ్నిస్తాడు.

దానికి శ్రీకృష్ణ భగవానుని సమాధానం –

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥**

“కామం, క్రోధం అనే శత్రువులు రజోగుణం వలన ఉద్భవిస్తున్నవి. అవి మహాపాపిష్ఠమైనవి. అవే మనిషిని బలవంతంగా పాపానికి ప్రేరేపిస్తాయి.”

పై అభిప్రాయం మనందరికీ సామాన్యంగా తెలిసినదే. అయితే మళ్ళీ మళ్ళీ మనం దానిని గురించి చర్చించాలి. ఎందుకంటే మనం దానిని ఆచరణలోకి తీసుకురాలేకపోతున్నాం కదా. కామం, క్రోధం అనేవి ప్రతి మనిషికి బద్ధ శత్రువులు. మనిషికి మొదట ఇష్టం లేకపోయినా పాపకార్యాలు చేసేటట్లు ఈ రెండూ బలవంతపరుస్తాయి. కామక్రోధాలను అదుపులో ఉంచుకున్నట్లయితే పాపం

చేయాలనిపించదు.

ఒక వస్తువును తీవ్రంగా కోరుకోవడం కామమైతే, ఆ వస్తువు లభించకపోతే లేదా దానిని కోల్పోతే క్రోధం వస్తుంది –

**"క్రుద్ధో హన్యాద్గురూనపి...** క్రోధంతో ఉన్నవాడు ఏమైనా చేస్తాడు." చివరికి తన గురువుగారిని కూడా హింసించడానికి వెనకాడడు. శ్రీకృష్ణభగవానుడు కామక్రోధాలను తొలగించుకోవలసిన అవసరం గురించి వివరించాడు. కామక్రోధాల బంధువులే లోభ, మోహ, మద, మాత్సర్యాలు.

కామం తన బంధువర్గంతో ఒక వ్యక్తిలో స్థిరపడితే అతను పూర్తిగా నాశనమవుతాడు. కామాన్ని, దాని కారణంగా ఉద్భవించే ఇతర శత్రువులతో సహా సమూలంగా తొలగించడానికి మార్గమేమిటి? మన శాస్త్రాలు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాయి.

'మాధవీయ శంకర విజయం' లోని అయిదవ సర్గలో శ్రీ శంకరభగవత్పాదులవారి బాల్యం వంద శ్లోకాలలో వర్ణించబడింది. వారి రూపం ఎలా ఉన్నదో, వారి ప్రవర్తన ఎలా ఉండేదో, వారు ఎంతటి నిజాయితీపరులో వివరిస్తూ వారు అరిషడ్వర్గాలైన కామక్రోధమోహ లోభ మద మాత్సర్యాలను జయించారని, ఎలా జయించిందీ కూడా చెప్పారు. మనకు కూడా వాటిని జయించాలని ఉంటుంది కానీ, మార్గమే తెలియదు. ఆ మార్గాన్ని బోధిస్తే, కొందరైనా ప్రయత్నించి కామక్రోధాదుల నుండి ముక్తిని పొందవచ్చు. కొంతమంది ఉపన్యాసాలు విన్నా, తమ మామూలు దారిలోనే పోతుంటారు. మనం ఆ వర్గంలో చేరకూడదు.

కోరికను జయించడమెలా? భౌతికమైన వస్తువుల పట్ల నిర్లక్ష్యాన్ని పెంచుకోవాలి. "భౌతికమైన వస్తువులు ఆనందదాయకం కానప్పుడు అవి మనకెందుకు? వాటి వలన ప్రయోజనం లేదు" అనే ఆలోచనను పెంచుకోవాలి. ఒక వస్తువు ఆకర్షణీయంగా, అందంగా ఉన్నదనుకున్నప్పుడే మనం దానిని కోరుకుంటాం. మనం చూసిన వస్తువుల గురించి మన కళ్ళే మనకు తెలియజెప్పు తున్నాయి. చక్షురింద్రియ స్వభావం అది. మనం చాలా వస్తువులను చూస్తున్నా, అన్నిటినీ మనం కోరుకోము. ఆనందాన్ని, సంతోషాన్ని అందించగలవని అనుకున్న వాటినే కోరుకుంటాం. ఒకవేళ అన్ని వస్తువులు పనికి రానివే అని ఎవరైనా భావిస్తే, అతను కోరుకోవడానికి ఇంకేమి ఉంటుంది? అందువలన కామాన్ని జయించాలంటే... భౌతిక మైన వస్తువులు ఆకర్షణీయమూ, ఆనందదాయికమూ కావనే ఆలోచనను పెంచుకోవాలి.

**అసారమేవ సంసారం దృష్ట్వా సారదిదృక్షయా ।**
**ప్రవ్రజన్త్యకృతోద్వాహాః పరం వైరాగ్యమాశ్రితాః ॥**

శంకరులు సన్న్యాసాన్ని ఎందుకు స్వీకరించారు? "అసారమేవ సంసారం దృష్ట్వా" – ఇదీ కారణం.

ఏ వస్తువునైనా అనుభవిస్తే ఈ ప్రపంచంలో మనకు ఏమి దక్కుతుంది. అన్ని వస్తువులు అందంగా కనబడతాయి కానీ, వాటి స్వభావాన్ని విశ్లేషించి చూస్తే వానిలో సారమేమీ కనబడదు. అంతే కాదు... వాటిని మనం సంపాదించేవరకే వాటి అందం, ఆ తరువాత వాటిలో ఎటువంటి ఆకర్షణా ఉండదు. నిర్లక్ష్యం కనుక నిరంతరం ఉంటే ఏ వస్తువునూ పొందడానికి ప్రయత్నం చేయవలసిన పని ఉండదు. కోరికలను జయించడానికి ఇటువంటి మనఃస్థితి అవసరం.

క్రోధాన్ని జయించడానికి మనం తితిక్షను సంపాదించుకోవాలి. అయితే తితిక్ష అంటే ఏమిటి?

**సహనం సర్వదుఃఖానామప్రతీకారపూర్వకమ్ ।**
**చిన్తావిలాపరహితం సా తితిక్షా నిగద్యతే ॥**

ఎంతటి బాధనైనా సంతోషంగా భరించడమే తితిక్ష. 'శంకర విజయం'లో శ్రీ శంకరుల జీవితంలోని ఓర్పు పరిధిని వివరించారు. ఉగ్రభైరవుడు శ్రీ శంకరులను కలిసి ఇలా ప్రార్థించాడు – "స్వామీ! నేను భైరవారాధకుడిని. ఒక చక్రవర్తినో లేదా ఒక మహామేధావి అయిన సన్న్యాసినో తనకు బలి ఇస్తే, నేను కోరిన వరాన్ని ప్రసాదిస్తానని భైరవుడు అనుగ్రహించాడు. ఒక చక్రవర్తిని బలి ఇవ్వడానికి ప్రయత్నించడమంటే, నా ప్రాణమే పోగొట్టుకోవడం. అందువలన నేను దానిని సాధించలేను. మీరు సర్వజ్ఞ మూర్తియైన యతులని ప్రజలు చెప్పుకోవడం నేను విన్నాను. మీ దేహంపై మీకు వ్యామోహం లేదనీ, మీరు చాలా గొప్ప వేదాంతి అనీ నాకు తెలుసు. ఈ శరీరం ఎప్పుడో ఒకప్పుడు నశించేదే–

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి**
**నరోఽపరాణి । తథా శరీరాణి .................... ॥**

"ఓ వ్యక్తి పాత వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను ధరించినట్లే ఆత్మ జీర్ణమైన దేహాన్ని వదలి నూతన దేహాన్ని స్వీకరిస్తుందని మీరు బోధిస్తారు కదా! అందువలన నశ్వరమైన ఈ దేహంతో ఏమి సాధిస్తారు? మీ శిరస్సు లభిస్తే నాకు గొప్ప లాభం కలుగుతుంది. కాబట్టి దానిని పొందడానికి నాకు అనుమతిస్తారా?"

అటువంటి కోరికతో ఎవరైనా మనల్ని సమీపిస్తే, వెంటనే మనం రక్షణకై చాలామంది రక్షక భటులను మన చుట్టూ పెట్టుకుంటాం. శ్రీశంకరుల సమాధానం మాత్రం విశిష్టంగా ఉన్నది. తనను మరునాడు కలవమని భైరవునికి సూచించి, "నా శిష్యులు చుట్టుప్రక్కల ఉన్నప్పుడు రావద్దు. వాళ్ళు నీ పనిని పూర్తి చేసుకోనివ్వరు. మధ్యాహ్న స్నానానికై వాళ్లు బయలుదేరినప్పుడు నేను తరువాత వస్తానని ఆగిపోయి వంటరిగా ఉంటాను. అపుడు నీవు వచ్చి నీ పనిని పూర్తి చేసుకో" అని అన్నారు.

ఆయన చెప్పినట్లు మరొకరు చెప్పడం మనం ఊహించగలమా?

మరునాటి మధ్యాహ్నం శిష్యులు స్నానానికై వెళ్ళారు. శిష్యులతో శ్రీ శంకరభగవత్పాదులు ఉగ్రభైరవుని రాక గురించి ఏమీ చెప్పలేదు. వానికి సహాయం చేయాలని ఆయన ఉద్దేశం. ఉగ్రభైరవుడు వచ్చే సమయానికి ఆయన ఆనందంతో సమాధిలో నిమగ్నులైపోయారు. శ్రీ శంకరులను చూసిన ఉగ్రభైరవునికి చాలా సంతోషమయింది. తన కోరికను తీర్చుకోవడానికై కత్తిని చేత పట్టుకున్నాడు. అయితే ఈశ్వరేచ్ఛ మరోవిధంగా ఉన్నది. ఉగ్రభైరవుని ఆశయం పూర్తి కాలేదు. అనుకోకుండా శ్రీనరసింహస్వామి ఆవహించిన పద్మపాదాచార్యులు అక్కడకు వచ్చి ఉగ్రభైరవుని మీద పడి గోళ్ళతో చీల్చి సంహరించారు. శ్రీ నరసింహస్వామి చేసిన గర్జనకు శ్రీశంకరులు సమాధి నుండి బయటకు వచ్చారు.

ఒక స్తంభం నుండి గర్జనతో భయంకర రూపంతో వెలువడి హిరణ్యకశిపుని సంహరించిన శ్రీనరసింహస్వామి వర్ణన శ్రీమద్భాగవతం సప్తమస్కంధంలో ఉన్నది. హతుడైన ఉ గ్రభైరవుని దేహాన్ని ఒక వైపు, ఉగ్రనరసింహరూపుడైన పద్మపాదుని మరో వైపు చూచిన శ్రీ శంకరులు శ్రీ నరసింహస్వామిని స్తుతించి, శాంతపరిచారు. "నేను సమాధిలో ఉన్నాను. నేను అనుమతించినట్లుగా ఉగ్రభైరవుడు నా శిరస్సును ఈశ్వరేచ్ఛ కానందున ఉగ్రభైరవుడు తన లక్ష్యాన్ని సాధించలేకపోయా"డని పద్మపాదులు సమాధానం చెప్పారు.

అంతటి సహనం ఇంకెవరు ప్రదర్శించగలరు? మనమందరం అటువంటి ఓర్మిని అలవరచుకోవాలి. క్రోధాన్ని జయించడానికి సహనమొక్కటే మనకు తోడ్పడుతుంది. ఒక సంఘటనను పరిశీలిద్దాం. మా పరమేష్ఠి గురువైన శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహభారతీమహాస్వాముల వారి హయాంలో ఇది జరిగింది. శ్రీవారు విడిది చేసిన చోట ప్రభుత్వ అడవుల శాఖకు చెందిన అధికారి ఒకరు ఆయనను కలుసుకోవడానికి వచ్చాడు. క్షేమసమాచారాలు అడిగి భక్తులను పంపించడం శ్రీవారికి అలవాటు లేదు. ఆ అధికారికి పరమసత్యాన్ని తెలుసుకోవాలనే ఆలోచన ఉన్నదో, లేదో గ్రహించడానికై శ్రీవారు ఇలా ప్రశ్నించారు – "మీకెప్పుడైనా కోపం వస్తుందా?" అని. అప్పుడప్పుడు సహనాన్ని కోల్పోతానని అధికారి చెప్పాడు.

**ఆచార్యపాదులు:** మీకు కోపం వస్తే ఏమి చేస్తారు?

**అధికారి:** నా క్రింద పని చేసేవారిపై ఆ కోపాన్ని ప్రదర్శిస్తాను.

**ఆచార్యపాదులు:** అప్పుడు అతను ఏమి చేస్తాడు?

**అధికారి:** అతను తన క్రింద పనిచేసే వారిపై తన కోపాన్ని ప్రదర్శిస్తాడు.

**ఆచార్యపాదులు :** ఒక మనిషి క్రోధం ఎందరిని ఇబ్బందిపెడుతోందో చూశారా?

అధికారి తన తప్పును అంగీకరించి, తాను ఏమి చేస్తే బాగుంటుందో వివరించమని ప్రార్థించాడు.

ఆచార్యపాదులు ఇలా బదులిచ్చారు. "మూడు రకాల మనుష్యులున్నారు. కొందరు తమకు కోపం రావచ్చని ముందే గ్రహిస్తారు. మరికొందరు వచ్చే కోపాన్ని ముందు పసిగట్టలేరు కానీ, కోపం వచ్చిన తరువాత తమకు కోపం వచ్చిందని గ్రహించగలరు. ఇంకొందరు తమ కోపాన్ని చాలా ఆలస్యంగా, అంతా అయిపోయిన తర్వాత, నష్టం జరిగిన తరువాత గుర్తిస్తారు. ఈ ముగ్గురిలో నీవు ఏ వర్గానికి చెందుతావు?"

అధికారి తాను మొదటి వర్గానికి చెందననీ, రెండవ వర్గానికి చెందుతానని చెప్పగా ఆచార్యపాదులు మొదటి వర్గంలో చేరడానికి ప్రయత్నించమనీ, కోపం వస్తోందనుకున్నప్పుడు, "కోపం తెచ్చుకోవడం ఎంతవరకు సమంజసం?" అని ఆలోచించి కోపాన్ని ఆపుకోవాలనీ చెప్పారు. ఆ అధికారి జగద్గురువులకు సాష్టాంగ ప్రణామ మొనరించి సెలవు తీసుకొని వెళ్లాడు. ఆయన తన వసతి చేరుకునేటప్పటికి మధ్యాహ్నమయింది. అందువలన విపరీతంగా ఆకలి వేయసాగింది. అయితే దురదృష్టం కొద్దీ ఆయన వంటవాడు రెండు రొట్టెలను మాత్రమే చేశాడు. అది తెలియగానే ఆయనకు కోపం వచ్చి సహనం కోల్పోయి వంటవానిపై కేకలు వేయబోయాడు. అయితే ఆచార్యపాదుల సలహా జ్ఞాపకానికి వచ్చింది. వెంటనే వంటవానిని పిలిచి రెండు రొట్టెలు మాత్రమే తయారుచేయడానికి కారణమడిగాడు. 'ఇంట్లో పిండి లేదనీ, పిండి తీసుకురావడానికి వెళ్లిన నౌకరు ఇంకా రాలేదనీ, కాని అధికారి ఆకలిని కొంచెమైనా తగ్గించవచ్చని తాను ఇంట్లో ఉన్న పిండిని ఉపయోగించి రెండు రొట్టెలు తయారుచేశానన్నాడు. వంటవాడు తానేమీ తినలేదు. వస్తువులు వచ్చిన తరువాత రొట్టెలు తయారుచేసుకుని తినాలి. అధికారి తన వంటవానిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. అమాయకుడైన తన వంటవానిపై అనవసరంగా కోపం తెచ్చుకోకుండా జగద్గురువుల సలహా తనను కాపాడిందని సంతోషించాడు.

కోపం వికృతంగా తలెత్తకుండా మనం జాగ్రత్త పడాలి. పరిస్థితులను విశ్లేషించి, కారణం తెలుసుకుంటే కోపానికి అవకాశముండదు. అటువంటి విశ్లేషణ తరువాత ఎవరైనా దోషిగా మనం భావిస్తే, పరిమితంగా అతనిని మనం శిక్షించవచ్చు. ఈ సందర్భంలో ఆపస్తంబుడు చెప్పిన విషయాలను జ్ఞాపకం చేసుకుందాం.

గురుకులంలో తప్పు చేసిన విద్యార్థికి శిక్ష ఏమిటి? తన సూత్రాలలో ఆపస్తంబ మహర్షి ఇలా చెప్పారు –

**"అపరాధేషు చైనం సతతముపాలభేత ।"**

తన భాష్యంలో పై సూత్రంపై హరదత్తుడు ఇలా స్పష్టీకరించాడు – **"ఇదం అయుక్తం త్వయా కృతం ఇతి వక్తవ్యమ్...** నీవు చేసింది తప్పు. అలా చేయకూడదు" అని విద్యార్థికి చెప్పాలి. అతను చేసిన తప్పు అతనికి తెలియాలి.

తరువాత సూత్రంలో తప్పు చేసిన విద్యార్థికి ఇవ్వవలసిన శిక్ష గురించి చెప్పబడింది – **"అదర్శనముపవాసః ఉదకోపస్పర్శనమ్...** విద్యార్థి ఒక రోజు ఉపవాసముండేటట్లు చూడాలి. లేకపోతే ఉపాధ్యాయునికి ముఖం చూపించకూడద"ని విద్యార్థికి చెప్పాలి. హరదత్తుడు సూత్రంలోని **'ఉదకోపస్పర్శనమ్'** అనే మాటలను వివరిస్తూ, **"శీతోదకేన స్నపనమ్"** అని చెప్పాడు. ఆ రోజు స్నానం చేయడానికి విద్యార్థికి వేడి నీళ్లు ఇవ్వకూడదు.

పూర్వకాలంలో ప్రతి రోజు స్నానం చేయడానికి విద్యార్థులకు వేడినీళ్లు ఇచ్చేవారని ఈ వ్యాఖ్యానం వలన మనకు తెలుస్తోంది. అందువలన తాము తప్పు చేసిన రోజున తమకు వేడి నీళ్లు ఇవ్వరని విద్యార్థులకు తెలుసు. అటువంటి తక్కువ శిక్షను శిష్యులకు సూచించారంటే ఆపస్తంబునకు శిష్యుల పట్ల ఎంత ప్రేమో. శిష్యులను కొట్టడం ఆయనకు సుతరామూ ఇష్టం లేదు. చాలా పెద్ద తప్పుకు కూడా "నీ ముఖం నాకు చూపించవద్దు. వెళ్ళిపో" అనే మాటలే పెద్దశిక్ష. కాని శిష్యుడు తన ముఖాన్ని ఉపాధ్యాయునకు మరునాడు చూపించవచ్చు.

శ్రీమఠ సిబ్బంది పెద్ద తప్పు చేసినా మా ఆచార్యపాదులు(శ్రీమహాసన్నిధానం వారు) "ఇక్కడి నుండి పో" అనే వారు కానీ, పది నిమిషాలలో ఆ వ్యక్తిని పిలిచి "అలా చేయడం భావ్యమేనా? అందుకనే మేము అలా మాట్లాడవలసి వచ్చింది. మా మాటలను ఇంకో విధంగా తీసుకోవద్దు" అనేవారు. మహర్షుల అడుగుజాడలనే ఆచార్యపాదులు అనుసరించేవారు. అసలు ఏమి జరిగిందో తెలుసుకోకుండా ఎవరినీ శిక్షించకూడదు. శిక్ష కూడ చేసిన తప్పుకు తగినట్లుగా ఉండాలి.

**అదణ్డ్యాన్దణ్డయన్రాజా దణ్డ్యాంశ్చైవాప్యదణ్డయన్ ।**
**అయశో మహదాప్నోతి నరకం చాధిగచ్ఛతి ॥**

"శిక్షకు తగని వారిని శిక్షించిన రాజు పాపం చేసినవాడవుతాడు. నరకానికి పోతాడు". దోషిని శిక్షించకపోయినా పరవాలేదు. అమాయకుడైన నిర్దోషిని శిక్షించడం పాపకారణమవుతుంది. అంతేకాదు... వ్యక్తి జీవనాధారాన్ని శిక్ష నాశనం చేయకూడదు.

దానికి సంబంధించిన ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. మఠ ఉద్యోగి ఒకరు ఒకసారి క్షమించరాని తప్పు చేశాడు. మఠంలోని వారందరూ అతనిని ఉద్యోగం నుండి తీసివేయమని సలహా ఇచ్చారు. కాని ఆచార్యపాదులు అతనితో ఇలా అన్నారు... "ఇప్పటి నీ పని నీకు కష్టంగా ఉండవచ్చు. ఇక మీదట నీవు ఇంకో పనిని చేయి." అప్పుడు అక్కడ ఉన్న కొందరు ఆచార్యపాదులు

అతనికి మరో పని అప్ప చెప్పే బదులు, పూర్తిగా బర్తరఫ్ చేస్తే బాగుంటుందని భావించారు. ఆచార్యపాదులు వారితో ఇలా అన్నారు – "అతనిని మఠం నుండి బయటకు పంపడం కష్టమేమీ కాదు. అతని కుటుంబసభ్యులు అతని సంపాదనపైనే ఆధారపడ్డారు. అతనికి ఉద్యోగం పోతే వాళ్ల గతేం కాను. మన నిర్ణయం కారణంగా అతని పిల్లలు ఆకలితో మాడకూడదు. అందుకనే అతనికి మరో పనిని అప్పగించాం." అప్పుడు అందరికీ ఆచార్యపాదుల వంటి దయాహృదయులు మరొకరుండరని తెలిసింది.

తప్పు చేయడం మానవ సహజం. మనం అధికార హెూదాలో ఉన్నప్పుడు, మన క్రింద పని చేసేవాడు తప్పు చేస్తే, మనం అతనిని క్షమించి మరల అటువంటి తప్పు చేయకుండా మార్గదర్శనం చేయాలి. మనకు అధికారం ఉన్నది కదా అని పెద్దశిక్ష వేయకూడదు. మనపై అధికారులు మనల్ని కూడా అలాగే శిక్షిస్తే మన గతి ఏమిటి?

**కతిపయ పురస్వామ్యే పుంసాం క ఏష మదజ్వరః ।**

"సామ్రాజ్యాలను నిర్మించిన వ్యక్తులు చాలామంది ఉన్నారు. కాని వాళ్లు ఇప్పుడు లేరు. తమ రాజ్యాలను తృణప్రాయంగా దానం చేసిన మహానుభావులూ చాలామంది ఉన్నారు. వాళ్ళు కూడ కాలగర్భంలో కలిసిపోయారు. పది గ్రామాలకు అధిపతి అని గర్వంతో విఱ్ఱవీగే వారి గురించి ఏమి చెప్పగలం?" అని భర్తృహరి విచారించాడు. అలాగే మన అధికారానికి కూడా హద్దులున్నాయి. కాబట్టి మన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, అన్యాయంగా ఇతరులను శిక్షిస్తే మనకేమైనా మంచి జరుగుతుందా? కనీసం సాధారణమైన సంతోషం లభిస్తుందా? ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని మనం విశాల హృదయంతో ప్రవర్తించాలి. తమ జీవితంలో శ్రీ శంకరభగవత్పాదులు ప్రదర్శించిన సహనాన్ని మనం అలవరచుకోవడానికి ప్రయత్నిస్తూ క్రోధాన్ని జయించాలి. అదే అందుకు మార్గం.

## లోభాన్ని జయించడమెలా?

సంపదలకు అధిష్ఠాత్రి అయిన లక్ష్మీదేవి స్థిరంగా ఒక చోట ఉండదు. ఈరోజు లక్షాధికారి అయిన వ్యక్తి రేపు భిక్షాపాత్రను పట్టుకు తిరగవచ్చు. లోభాన్ని అదుపులో ఉంచుకోవడానికై చాలా ధనాన్ని కూడబెట్టి మనం ఏమి సాధించబోతున్నామని ఆలోచించాలి.

లోభి కంటె గొప్పదాత ఉండదని వ్యంగ్యంగా చెప్తారు. దానంగా ఏమీ ఇవ్వని వానిని గొప్పదాత అని ఎలా చెప్తున్నామని మీరు ఆశ్చర్యపోవచ్చు. దానశీలి అయిన వ్యక్తి తన చేతులతో ధనాన్ని దానం చేస్తాడు. లోభి తన చేతులతో స్పర్శించకుండానే తన మరణం తరువాత ఇతరులు తన ధనాన్ని అనుభవించడానికి వీలు కల్పిస్తాడు. లోభము వలన ఎటువంటి ప్రయోజనాన్ని పొందలేరు. అర్హత కలిగిన వారికి పంచిపెట్టినందువలన దాత సంపద పెరుగుతుంది. లేకపోతే

పెరుగుదల ఉండదు.

నీలకంఠ దీక్షితులు ఇలా వ్రాశారు. **"ఆస్తిక్యం చేద్దన మఖిలమప్యర్థిసాత్కర్తుమర్హమ్....** మీరు ఆస్తికులైతే పాత్రులైన వారికి దానం చేయండి. నాస్తికులైతే ధనాన్ని కనీసం అనుభవించండి." తన సంపదను తానూ అనుభవించక, ఇంకొకరికి దానమూ చేయకపోతే అతనిని ఆస్తికుడనాలా? నాస్తికుడనాలా?

**"నిభృతం తర్కయామో న విద్మః"**

అతను ఆస్తికుడూ కాదు, నాస్తికుడూ కాదు.

"సంపద అస్థిరంగా ఉంటుంది. మన దగ్గర సంపద ఉంటే, దానిని పాత్రత కలిగిన వారికి పంచిపెడదాం. అలా చేసి పుణ్యాన్ని సంపాదించుకుందాం." అటువంటి నమ్మకం లోభాన్ని నిర్మూలించడానికి మనకు తోడ్పడుతుంది.

**మాత్సర్యాన్ని వదిలించుకోవడమెలా?** అన్నది ఆలోచిద్దాం. ఉదాహరణకు ఒక వ్యక్తి తన స్థాయిని పెంచుకుని, ఇతరులకు సహాయపడి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు అనుకోండి. కొంతమంది దానిని సహించలేరు. అతనిని మెచ్చుకోవడానికి బదులు అతను అవినీతి కుంభకోణంలో ఇరుక్కున్నాడనీ, ఆ విషయాన్ని విచారించాలనీ ప్రభుత్వానికి మహజరు సమర్పించుకుంటారు. అసూయాపరుల మనస్తత్వం అలాగే ఉంటుంది. అసూయా స్వభావాన్ని మార్చుకోవాలంటే మనం ఉన్నదానితో తృప్తిపడడం నేర్చుకోవాలి. మన కంటే చిన్నవాడు పైకెదిగితే మనం సంతోషించాలి. అతను మనకు నమస్కరిస్తే మనం ఆశీర్వదించాలి కానీ, లోలోపల మండి పోకూడదు.

మరి **ఇప్పుడు మదం గురించి ఆలోచిద్దాం.** మనకు తెలిసినది, నేర్చుకున్నది చాలా తక్కువ. అయినా మనం గౌతముడో, జైమినియో, వ్యాసుడో, సనకుడో అనుకుంటాం. మన గర్వాన్ని తొలగించుకోవడానికి ఒక మార్గముంది... మన కంటే పెద్దవారు, జ్ఞానం కలిగినవారు చాలామంది ఉన్నారనే భావనను మనం పెంచుకుంటే మనకు గర్వం రాదు. దురదృష్టం కొద్దీ అటువంటి ఆలోచన మనకు కలుగదు. కొంచెం నేర్చుకున్నా మన గర్వానికి హద్దులుండవు. ఇతరులకు జ్ఞానం లేదని విమర్శిస్తుంటాం. గొప్ప విద్వాంసునితోగాని, అజ్ఞానితోగాని మాట్లాడడం చాలా తేలిక. తెలిసీతెలియని వారితో మాట్లాడడం చాలా కష్టం. అన్నీ తెలిసినవాడు తన వివేకాన్ని ఉపయోగించి ఎవరైనా చక్కటి సలహాలనిస్తే తప్పక స్వీకరిస్తాడు. ఏమీ జ్ఞానం లేనివాడు కూడా ఇతరుల నుండి మంచి సలహాలను స్వీకరిస్తాడు. సగం తెలుసుకున్నవాడే వాగుతాడు. అటువంటి వారితో వ్యవహరించడం కష్టమని భర్తృహరి అభిప్రాయం.

"మనకంటే విద్యావంతులు చాలా మంది ఉన్నారు. వారి జ్ఞానంతో పోల్చి చూస్తే మనకు తెలిసినది అత్యల్పం" అనే ఆలోచన మాత్రమే మన గర్వాన్ని తొలగిస్తుంది.

మనం ఇంతవరకు చర్చించిన పద్ధతుల ననుసరించి అరిషడ్వర్గాన్ని శ్రీ శంకర భగవత్పాదులు జయించినట్లు 'శంకరవిజయం'లో చెప్పబడింది. వాటిని చూసి మనం శ్రీశంకరులను అనుకరించాలి. అంతేకాని 'శ్రీశంకరులు కామాన్ని జయించారని మనకు జయించడానికి వీలు అవుతుందా?' అని పెదవి విరచడానికి కాదు. శ్రీశంకరుల వలె మనం కూడా అరిషడ్వర్గాన్ని నిర్మూలిస్తే శాశ్వతానందాన్ని పొందవచ్చు. లేకపోతే మన చదువు, సంపద, అధికారం అంతా వృథా. అందుకనే

**దద్యాన్నావసరం కించిత్కామాదీనాం మనాగపి ।**

**ఆసుప్తేరామృతేః కాలం నయేద్వేదాన్తచిన్తయా ॥** అని అన్నారు.

కామాదులకు కొంచెం కూడ అవకాశమివ్వని వాడు, రాత్రింబవళ్లు మరణం వరకు వేదాంతతత్త్వంపై చింతనతో గడిపేవాడు చాలా అదృష్టవంతుడు. కోరికలనెడి దుర్మార్గులకు ఆశ్రయమిచ్చే వారి జీవితాలు వృథా అని శాస్త్రాలు చెబుతున్నాయి.

కామాదులు మనలో ఉన్నందుననే మనం సుఖశాంతులతో జీవించలేక పోతున్నామని చెప్పుకుంటూ ఉంటాం. పైన చెప్పిన మార్గాల నవలంబించి మనం శాశ్వతంగా శాంతియుత జీవనాన్ని పొందగలం.

**తేషాం శాన్తిశ్శాశ్వతీ నేతరేషామ్...** అందరూ బాల్య, యౌవన, వార్ధక్యముల నుండి ప్రయాణించక తప్పదు. బాల్యమును ఆటలలో గడిపితే, యౌవనమును భౌతిక జీవనాన్ని అనుభవించడంలో వృథా చేస్తాం.

**వృద్ధస్తావచ్చినాసక్తః...**వృద్ధులు ఏదో ఒక విషయం గురించి ఆలోచిస్తూ బాధ పడ్తుంటారు.

**పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః** – పరబ్రహ్మ గురించి ఆలోచించడానికి సమయమెక్కడుంది?

పరబ్రహ్మ గురించి కనీసం వృద్ధాప్యంలోనైనా ఆలోచించాలి. బాల్యంలో... యౌవనంలో కుదరదు. కాబట్టి కనీసం వార్ధక్యంలో సాంసారిక బాధ్యతలను పిల్లలకు అప్పచెప్పి, తమ ఆలోచనలను పరబ్రహ్మపై కేంద్రీకరించాలి.

ఇక్ష్వాకు వంశ చక్రవర్తుల గురించి కాళిదాసు ఇలా వ్రాశాడు.

**అథ స విషయవ్యావృత్తాత్మా యథావిధి సూనవే ।**

**నృపతికకుదం దత్త్వా యూనే సితాతపవారణమ్ ॥**

**మునిజన తరుచ్ఛాయాం దేవ్యా తయా సహ శిశ్రియే...** దిలీపుడు యావత్ పృథివికి చక్రవర్తి. సముద్రాలు అతని సామ్రాజ్య సరిహద్దులు. తన కుమారుడైన రఘువుకు ఇరవై సంవత్సరాల

వయస్సు వచ్చి, సామ్రాజ్యాన్ని పరిపాలించే శక్తిసామర్థ్యాలు లభించాయని భావించగానే దిలీపుడు అతనికి పాలనాబాధ్యతలను అప్పగించి తాను భార్యతో వనానికి వెళ్ళిపోయాడు. అలా ఎందుకు చేశాడు? కాళిదాసు దానికి సమాధానం చెప్పాడు.

**గలితవయసామిక్ష్వాకూణామిదం హి కులవ్రతమ్...** వృద్ధులైన ఇక్ష్వాకువంశ చక్రవర్తులు పరంపరానుగతంగా చేసుకుంటున్న నిర్ణయమది. దిలీపుడు తన పూర్వీకులు ఏర్పరచిన సంప్రదాయాన్నే పాటించాడు.

అటువంటి నిర్ణయం ఇక్ష్వాకు చక్రవర్తులకు గాని, మనకు కాదు అనుకోవద్దు. మనం కూడా అటువంటి నిర్ణయం తీసుకోవచ్చు. వృద్ధుల ఆందోళనలకు అంతే ఉండదు. ఒకరోజు తన మనుమనికి వివాహం కాలేదని ముసలాయనకు చింత.

ఆ తరువాత క్రొత్తగా పెళ్లి అయిన మనమడికి పిల్లలు కలుగలేదని చింత. ఒకవేళ ఆడపిల్ల పుడితే వానికి మగపిల్లలు కలుగలేదనే చింత. మగవాడు పుడితే వానికి మాటలు రాలేదనో, మాటలు వస్తే ఎక్కువగా మాట్లాడుతున్నాడనో బెంగ.

మా ఆచార్యపాదుల దగ్గరకు ఒకసారి కొందరు వచ్చి తమ పిల్లవాడు అతిగా మాట్లాడుతున్నాడని, వాడు తక్కువగా మాట్లాడేటట్లు ఆశీర్వదించమని కోరుకున్నారు. అలా మానసిక వ్యథలకు తావిస్తూ పోతే సమస్యలకు ముగింపు ఎప్పుడు?

తమ వృద్ధాప్యంలో తమ మనోవ్యథలకు ముగింపు పలకదలచుకున్న వారు ముందునుండే తగిన చర్యలు తీసుకోవాలి. కుమారుడు బాధ్యతలను స్వీకరించ గలిగినప్పుడు, తండ్రి నెమ్మదిగా ఆధ్యాత్మిక విషయాల వైపు దృష్టి మళ్లించాలి. ఇది శాస్త్రాల దృక్పథం.

మనం నెలకు పది లక్షల రూపాయలు సంపాదించినా లేదా పది రూపాయలు మాత్రమే సంపాదించినా... మనం తినేది పిడికెడన్నమే. అయితే మన జీవితమంతా ధనాన్ని కూడబెట్టడానికే వెచ్చిస్తున్నాం. ధనసంపాదన ప్రయత్నాలను పరిమితం చేసుకుని పరబ్రహ్మ గురించి ఆలోచించడానికి కొంత సమయాన్ని కేటాయిస్తే చాలా మంచిది. మన జీవితం ఆనందదాయక మవుతుంది. అలా కాకపోతే ఆనందం కోసం మనం చేసే ప్రయత్నాలు ఎండమావుల నుండి నీటిని తోడే ప్రయత్నాల వంటివి. అందువలన వృద్ధాప్యంలో నైనా ప్రాపంచిక విషయ లంపటాన్ని వదులుకుని ఆనందం పొందుదాం.

# విదుర నీతులు

**అక్కిపెద్ది రామసూర్యనారాయణ,**
తణుకు, పశ్చిమగోదావరి జిల్లా
చరవాణి : 92901 91161

మహాభారతేతిహాసంలో వ్యాసమహర్షి ధర్మార్థ కామమోక్షములు అనే నాలుగు పురుషార్థాలను సాధించడానికి అవసరమయ్యే విజ్ఞానం అంతా చక్కగా ఇమిడ్చారు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం ఇందులో సముచితంగా చోటు చేసుకొన్నందువల్ల, ఈ గ్రంథం పంచమ వేదంగా ప్రశస్తి పొందింది. ఆర్ష వాఙ్మయానికి అంతటికి ప్రమాణం అయి ఉండటం మహాభారతం ప్రత్యేకత. "ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని - ఆధ్యాత్మ విదులు వేదాంతమనియు, నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని" అని అందరు కొనియాడుతుండగా వ్యాసమహర్షి భారత గ్రంథాన్ని వ్రాసారని ఉగ్రశ్రవసుడు - శౌనకాది మునులకు చెప్పడం జరిగింది.

ఈ మహా భారతంలో అనేక ధర్మ శాస్త్ర విషయాలు ప్రస్తావించబడ్డాయి. వాటిలో విదురనీతులు ఒకటి. ఇవి విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పినవి. సంజయుడు రాయబారిగా పాండవుల వద్దకు వెళ్ళివచ్చి ధృతరాష్ట్రునితో మరునాడు విశేషాలు చెప్పగలనని వెళ్ళిపోతాడు. రాత్రి ధృతరాష్ట్రునకు నిద్రపట్టక విదురుని పిలిపించి కొన్ని మంచి విషయాలు చెప్పమని అడుగుతాడు. అప్పుడు విదురుడు ధృతరాష్ట్రుని దుఃఖోపశమనానికి కొన్ని మంచి విషయాలను చెప్పాడు. వాటిలో నాలుగైదు అంశాలను ప్రస్తావించుకొందాం. మనలోమనం చూసుకొని అంతరంగ వికాసం సాధించుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. ఈ నీతులు పవిత్రమైన జీవనానికి మార్గదర్శనం చేయడానికి సామర్థ్యం కలిగి ఉన్నాయి.

**"విద్యామదో ధనమద స్తృతీయోభిజనోమదః ।**
**ఏతే మదావవిప్తానాం ఏత ఏవ సతాం దయాః ॥"**

విద్య, ధనం, ఉత్తమ వంశం దుర్మార్గులకు మదాన్ని కలుగజేస్తాయి. అవే సన్మార్గులకు శమదమాది గుణ సంపత్తిని పెంపొందింపజేస్తాయి. ఇందులో ఒక శబ్ద చమత్కారం ఉంది. మదంలో అక్షరాలు తిరగబడితే దమం అవుతుంది. దుర్జనుల విషయంలో ఉన్న మదం సజ్జనుల విషయంలో దమాన్ని కలుగజేసేదిగా ఉంటుంది.

**"ఏక స్స్వాదు న భుఞ్జీత ఏకశ్చార్థాన్ న చింతయేత్ ।**
**ఏకో నగచ్ఛేదధ్వానం నైకస్సుప్తేషు జాగృయేత్ ॥"**

ఇది కొన్ని చక్కటి అంశాలను ప్రబోధించే శ్లోకం "ఏక స్స్వాదు న భుఞ్జీత" అనేది ఒక నానుడిగా ప్రసిద్ధికెక్కినది. మధుర పదార్థాలను ఒక్కరు తినకూడదు. అందరికి పంచి తినాలి. అలాగే కార్యాలోచన ఒక్కరే చేయరాదు. ఎవ్వరిని నమ్మక తన దారిలో తాను ఒంటరిగా వ్యూహాన్ని తీర్చుదిద్దుకొంటే చివరకు అది మనోవేదన కలిగిస్తుందని హెచ్చరించాడు. నిర్జనమైన మార్గంలో ఒక్కరే ప్రయాణం చేయకూడదు. అందరూ నిద్రిస్తున్నప్పుడు ఒక్కరే మెలకువగా ఉండకూడదు.

**"ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీం శ్చతుర్భిర్వశీ కురు ।**
**పఞ్చ జిత్వా విదిత్వాషట్ సప్తహిత్వా సుఖీభవ ॥**

ఒకటి అంటే సత్త్వం. రెండు రజస్తమస్సులు – సత్త్వ గుణానికి రజస్తమస్సులను నిశ్చలత్వంతో చేర్చి శుద్ధ సత్వమును సాధించాలి. త్రి అంటే ధన– దార –పుత్రేషణలు అనే మూడింటిని, ధ్యాన – ధారణ– యోగ– సమాధులు అనే నాల్గింటితో మిక్కిలి వశపడేటట్లు చేసుకోవాలి. శ్రోత్రము – త్వక్కు – చక్షువు – జిహ్వ– ఘ్రాణం అనే అయిదు ఇంద్రియాలను జయించాలి. యజన – యాజన – అధ్యయన – అధ్యాపన – దాన – ప్రతిగ్రహాలనే ఆరు స్మార్త కర్మలను తెలిసి ఉండాలి. పంచభూతాలు – బుద్ధి – అహంకారం – అనే ఏడింటిని సప్తావరణాలను విడిచి పరబ్రహ్మ స్థితిలో వర్తించేవాడు సుఖంగా ఉంటాడు. ఎప్పుడూ శాంతంగా, ఆనందమయుడుగా, జీవన్ముక్తుడుగా మెలగుతాడు.

**"ఏవమేవాద్వితీయం తద్యద్రాజన్నావ బుధ్యసే ।**
**సత్యం స్వర్గస్య సోపానం పారావారస్య నైరివ ॥**

ఈ శ్లోకంలో సత్యం గొప్పతనం చెప్పబడింది. అది సత్యం ఒక్కటి ఉంటే సముద్రాన్ని ఓడతో దాటినట్లు – సంసార సాగరాన్ని సునాయాసంగా దాటవచ్చునని చెప్పడం జరిగింది. అంతేకాక స్వర్గసాధనకు అది కారణమని పేర్కొనడం విశేషం. సత్యం ఇహపరాలను సిద్ధింప చేస్తుంది.

**"ద్వే కర్మణా నరః కుర్వన్నస్మిన్ లోకే విరోచతే ।**
**అబ్రువన్ పరుషం కిఞ్చ దసతో నార్థయం స్తథా ॥"**

పరుష వాక్కులు పలకక పోవడం, పాపపు పనులు చేయక పోవడం ఈ రెండింటిచేతా లోకంలో పురుషుడు ఉత్తముడుగా కీర్తి ప్రతిష్ఠలు పొందుతున్నాడు. పరుషాలాడడం వాగ్దోషం. పాపపు పనులు చేయడం చేష్టాదోషం. ఆ రెండు చేయనివాడు ఉత్తముడు. మనస్సులోని ఆలోచనలను అనుసరించి మాట – చేష్ట ఉంటాయి. అంటే మనస్సు నిర్మలంగా ఉంటే వాక్కు, కర్మలు కూడా జగద్ధితంగా ప్రకాశిస్తాయి. త్రికరణశుద్ధితో మానవులు ప్రవర్తించాలని ఈ శ్లోకం ప్రబోధిస్తోంది.

ఇలా ఎన్నో నీతులను, ధార్మిక విషయాలను విదురుడు చెప్పడం జరిగింది. ఇందులోని మానవీయ ధర్మాలను ప్రజలందరూ అనుసరించి సుఖశాంతులు పొందుదురు గాక.

స్వస్తి



# సూక్తి మౌక్తికాలు

– 'మధురవక్త'

**డా. పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి**

ఎం.ఎ;ఎం.ఫిల్,పి.హెచ్.డి.

స్వర్ణపతక గ్రహీత

ప్రశాంత ఆంధ్రోపన్యాకులు, నరసరావుపేట

చరవాణి : 8978525456

1. 'ఇతరులు నీ పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తే నీవు బాధపడతావో నీవు ఇతరుల పట్ల ఆ విధంగా ప్రవర్తించవద్దు. సమస్త శాస్త్రాల సారమూ, ధర్మాల నన్నింటినీ మించిన పరమ ధర్మమూ ఇదే!' అన్నాడు భీష్ముడు ధర్మరాజుతో. ఈ సూక్తి పంచమవేదమైన 'మహాభారతం'లోని శాంతిపర్వం లోనిది.

2. అపరిమితమైన అకారణ కోపం, ఎదుటి వ్యక్తి కొంచెం పొగడగానే అతిగా పొంగిపోవటం, అహంకారం, ఏ విషయంలోనైనా ఎంత ఎక్కువగా లభించినా తృప్తి లేకపోవటం, దురభిమానం, ఏ పనీ చేయకుండా ఊరకే కూర్చోవటం– ఇవి దుర్మార్గుల లక్షణాలు అంటున్నది 'మహాభారతం' లోని విదురనీతి.

3. చెప్పకూడని సమయంలో చెప్పకూడని మాటను చెప్పట మెంత తప్పో చెప్పవలసిన సమయంలో చెప్పవలసిన మాటను చెప్పకపోవట మంతే తప్పు అన్నారు మన విజ్ఞులు.

4. ధనాన్ని ధర్మమార్గంలోనే సంపాదించాలి. ఎంత ఎక్కువ సంపాదించటాని కవకాశ మున్నదో అంత ఎక్కువ సంపాదించాలి. ఆ వచ్చిన దానితో తృప్తిపడాలి. ఆనందంగా జీవించాలి. ఆ విధంగా తృప్తిపడనివాడిని సప్తద్వీ పాల కధిపతిని చేసినప్పటికీ తృప్తిచెందదు. ఆ తత్త్వం మంచిది కాదన్నది 'భాగవతం'.

5. దుర్జను డెంత గొప్ప విద్యావంతు డైనప్పటికీ, ఇంకా ఎన్ని విధాలుగా అధికుడైనప్పటికీ వాడి దగ్గరకైనా వెళ్ల వద్దు. విలువైన జాతిరత్నం పడగ మీద ఉన్నప్పటికీ పాము భయంకరమైనదే కదా! అన్నారు మన సూక్తికారులు.

6. దుర్మార్గు డెప్పుడూ మన కిష్టమైన మాటలనే చెప్తుంటాడు. ఐనప్పటికీ వాడి మాటలను నమ్మవద్దు. ఎందుకంటే వాడి నాలుక మీద తేనె ఉంటుంది. మనసులో మాత్రం విషముంటుంది. ఇది అనుభవజ్ఞుల మాట.

7. దుర్మార్గుడు బొగ్గు లాంటి వాడు. వాడితో ఏ విధమైన పరిచయమూ మంచిది కాదు. బొగ్గును బొగ్గుగా ఉన్నప్పుడు పట్టుకొంటే చేతికి మసి అవుతుంది. అది నిప్పుగా ఉన్నప్పుడు పట్టుకొంటే కాలుతుంది.

8. మధుర పదార్థాన్ని ఒక్కడే భుజించ కూడదు. నిర్జన ప్రదేశంలో ఒంటరిగా నడువ కూడదు. ముఖ్యమైన విషయమై ఒక్కడే నిర్ణయం తీసుకో కూడదు. రాత్రిపూట అందరూ నిద్రపోతూ ఉండగా ఒక్కడు మేలుకొని ఉండకూడ దని 'మహాభారతం'లోని విదురనీతి చెప్తున్నది.

9. ఎక్కడైతే స్త్రీలకు గౌరవం లభిస్తుందో అక్కడ దేవత లందరూ ఆనంద నృత్యం చేస్తూ ఉంటారు. స్త్రీలకు మర్యాద లభించని చోట ఎవరు ఏ పనిని తలపెట్టినప్పటికీ అది విఫలమే అవుతుంది అన్నాడు స్మృతికర్త మనువు.

10. సాధారణమైన వృక్షా లనేకమున్న వనం చక్కగా పుష్పించిన, సుగంధాన్ని విరజిమ్ముతున్న ఒకే ఒక్క వృక్షం వలన అందగించినట్లుగానే సకల సద్గుణ సంపన్నుడైన ఒకే ఒక్క కుమారుడి వలన అతడి వంశం మొత్తమూ గౌరవభాజన మవుతుంది అన్నారు మన పెద్దవారు.

11. కంఠస్థం కాకుండానూ, ఆలోచిస్తే గుర్తుకు రాకుండానూ కేవలం పుస్తకాలలో మాత్రమే ఉన్న మన విద్య, మన చేతిలో లేకుండా ఇతరుల వద్ద ఉన్న మన ధనం– ఈ రెండూ మన కవసర మైనప్పుడు మన కుపయోగపడవు. అది చదువూ కాదు, ఇది డబ్బూ కాదన్నారు మన అనుభవజ్ఞులు.

12. ఒక ఉద్యోగి తన యజమాని తన కప్పగించిన పనిని సమర్థతతో నిర్వర్తించినట్లయితే ఆ యజమాని ఆ పని విలువ తెలిసిన, సహృదయులైన ఇతర ఉద్యోగులను సమావేశపరచి ఆ సభలో అతడిని గొప్పగా ప్రస్తుతించాలి. తగిన రీతిలో సన్మానించాలి. అటువంటి యజమాని మాత్రమే తన సంస్థను చక్కగా పరిపాలించగలడు. ఇది 'మహాభారతం'లో నారదుడు ధర్మరాజుకు చెప్పిన విషయం.

13. మన ఇంట్లో తలపెట్టిన శుభకార్యం పది మంది సహకారంతోనే చక్కగా నెరవేరిం దనుకోండి. ఆ పది మంది ఇళ్లలో జరిగే కార్యక్రమాలకు సహకరించే పది మందిలో మనం కూడా ఒకళ్లం కావాలి. పరస్పర సహకార మంటే ఇదే!

14. మన ఉద్యోగంలో, మన రంగంలో మనం చాలా దూరానికీ, లోతుకీ వెళ్లాలి. ఎంత లోతు కంటే... మన రంగంలో మనమే ఉన్నతులంగా ఉండాలి. మనలను మించినవా రుండగూడదు. మంచి పట్టుదలతో కృషి చేసి, సన్మా ర్గంలో ప్రయాణించి మన మా స్థాయి కెదగాలి. 'సమానానా ముత్తమ శ్లోకో అస్తు'గా ఎదగాలి. 'నీదు మార్గాన నీ యంత నేత లేడు' అని సరసుల చేత అనిపించుకోవాలి. ఇదే మన ప్రధాన లక్ష్యం కావాలి.

15. మనం అందరి పట్ల అన్నివేళలా మంచిగానే ఉందాం. 'దాని వలన ప్రయోజన మేమిటి?"

అని ప్రశ్న. 'మన జీవితంలో ఏ విషయంలో నైనా సరే! ఏది జరిగినప్పటికీ అది మన మంచికే జరుగుతుంది. నిజం! ఆ జరిగిన దాని వలన మనకు జరిగిన మంచి ఏమిటో ఈ రోజు మనకు తెలియదు. తర్వాతి కాలంలో తప్పకుండా తెలుస్తుంది. మంచితనాని కున్న శక్తి ఇది' అని సమాధానం.

16. మంచి మిత్రుడు తన మిత్రుడిని పాపపు పనుల వైపు వెళ్లనివ్వడు. అతడి చేత మంచి పనులను మాత్రమే చేయిస్తాడు. అతడి రహస్యాలను రహస్యంగానే ఉంచుతాడు. అతడిలోని సుగుణాలను పెంపొందింప జేస్తాడు. అతడాపదలో ఉన్నట్లయితే అతడిని విడిచివెళ్లడు. అతడు పేదరికంలో ఉన్నట్లయితే అవసరమైన సాహాయ్యం చేస్తాడు. మంచి మిత్రుడు ఇట్లా ఉంటాడు అన్నాడు నీతిశతకకర్త భర్తృహరి.

17. మంచినీటి కొలను ప్రక్కనే కూర్చొని దాహంతో బాధపడటం, మంచి పండ్లచెట్టు క్రిందనే కూర్చొని ఆకలితో బాధపడటం తెలివితక్కువ. ఏ కొన్నింటి నాచరించినప్పటికీ జీవితం ధన్యమయ్యే సూక్తిప్రపంచంలో ఉండి కూడా ఆనందమయమైన జీవితాన్ని గడపలేకపోవటం దురదృష్టం. మనం సూక్తులను చదువుదాం. విందాం. వీలున్నంతవరకాచరిద్దాం. ఆనందమయమైన జీవితాన్ని అనుభవిద్దాం.

18. మూడు చేపల కథ తెలుసును కదా! ఏ సమయంలో నైనా సరే! ఏ విషయంలో నైనా సరే! మనం మొదటి చేప లాగానే ఉండాలి. రెండవ చేప లాగా ఉండకూడదు. మూడవ చేప లాగా అస్స లుండకూడదు.

19. ఒక మంచి సూక్తిని విన్నప్పుడు, ఒక మధురమైన పాటను విన్న పుడు, తన భార్య ఒక విలాసచేష్టను ప్రదర్శించినప్పుడు మనిషి వాటి కను గుణంగా స్పందించాలి. ఒకవేళ ఆ విధంగా స్పందించలే దనుకోండి. అతడు సర్వసంగపరిత్యాగి, భవబంధ విముక్తుడైన మహాత్ముడై ఉంటాడు. లేదా పశుతుల్యుడైన పరమ మూర్ఖుడై ఉంటా డన్నారు మన అనుభవజ్ఞులు.

20. ఇతరుల కున్న ధనాన్ని, విద్యను, తేజస్సును, గౌరవాన్ని చూసి లోలోపల ఏడ్చే, అసూయపడే వ్యక్తి ఏ విధమైన వ్యాధి లేకుండానే కృశించి పోతుంటా డని 'మహాభారతం' లోని విదురనీతి చెప్తున్నది.

21. పెద్దగా చదువుకోని భక్తుడు 'విష్ణాయ నమః' అంటూ విష్ణుమూర్తికి భక్తితో నమస్కరిస్తాడు. అది తప్పు. 'విష్ణవే నమః' అనేది ఒప్పు. చక్కగా చదువుకొన్న పండితుడు 'విష్ణవే నమః' అంటూ నమస్కరిస్తాడు. భగవంతుడు ఆ ఇద్దరినీ సమానంగానే అనుగ్రహిస్తాడు. ఎందుకంటే అతడికి మన పాండిత్యం కాదు; భక్తి మాత్రమే ప్రధానం కనుక అన్నది మన సనాతన ధర్మశాస్త్రం. కాబట్టి మన మందరం మంచి భక్తులుగానే ఉందాం.

22. పొరపాటుననైనా పరుష వచనాలను పలుకకుండా ఉండటం, ఎటు వంటి పరిస్థితిలోనైనా పాపపు పనులు చేయకుండా ఉండటం ప్రధానంగా ఈ రెండింటి వలన మానవు డుత్తము డనిపించుకొంటా డని 'మహాభారతం' లోని విదురనీతి చెప్తున్నది.

23. మనం దేవాలయాలకు వెళుతుంటాం కదా! దీనికి సంబంధించి మనం చేయవలసిన పనులు ఐదు. అవి 1.ప్రవేశం, 2.ప్రదక్షిణం, 3. ప్రణతి (నమస్కారం), 4. ప్రణుతి (దేవతాస్తుతి), 5.ప్రసాదం. వీటిని ప్రపంచక మంటారు. వీటిని భక్తిశ్రద్ధలతో పద్ధతి ననుసరించి పాటించినట్లయితే పరమ ప్రయోజన ముంటుంది.

24. ఏ సమయంలో నైనా మన కెదురుగా సమస్త దేవతలు, కుడివైపున మన పితృదేవతలు, వెనుకవైపున ఋషీశ్వరు లందరూ ఉంటారు. కనుక మనం పుక్కిలించిన నీళ్లను మన కెడమవైపున మాత్రమే ఉమ్మివేయా లని మన ధర్మశాస్త్రం చెప్పింది.

25. మన కిష్టమైన మాటలు చెప్పేవాళ్లు ఎంతమందైనా దొరుకుతారు. కానీ మన కిష్టం కాకపోయినప్పటికీ, కష్టాన్ని కలిగించే వైనప్పటికీ మంచి మాటలను, మేలు కలిగించే మాటలను చెప్పేవాళ్లు దొరకరు. ఒకవేళ అటువంటివారు తటస్థపడితే మాత్రం వారి సలహాలను పెడచెవిని పెట్ట వద్దంటున్నది 'శ్రీమద్రామాయణం'.

26. తమోగుణ సంపన్నులు, పరమ మూర్ఖులు, సంసారసాగర పతితులైనవారికి ధర్మం మొత్తమూ అధర్మంగానే కనిపిస్తూ ఉంటుందని మన ధర్మ మర్మజ్ఞు లన్నారు.

27. సరియైన సమయంలో జీతా అందకపోయినట్లయితే ఉద్యోగులు చాలా బాధపడతారు. ఆ బాధ దేవేంద్రుడు లాంటి యజమాని కైనా అపరి మితమైన హానిని కలిగిస్తుంది అంటున్నది 'మహాభారతం'.

28. తన వద్ద పని చేస్తున్న ఉద్యోగి ఎప్పుడు ఏ తప్పు చేస్తాడా? అనీ, అతడి నెప్పుడు ఏ విధంగా దండిద్దామా? అనీ అనుక్షణమూ ఆలోచిస్తూ, అతడు చేసే ప్రతి పనిలోనూ తప్పులను మాత్రమే వెదుకుతూ ఉండే అధికారి వద్ద ఉద్యోగం చేయటం పాము పడగ నీడలో కప్ప నివసించటం లాగా ప్ర మాదకరమైన విషయ మంటున్నది 'సుమతీశతకం'.

29. శరీరంలో గ్రుచ్చుకొన్న ముళ్లు మొదలైన వాటి నే విధంగా నైనా బయటకు తీయవచ్చును. కానీ ఇతరుల శరీరాలలో నాటిన అపనిందలు, పరుషవచనాలు మొదలైన మాటల ములుకులను మాత్ర మెంతగా ప్రయ త్నించియైనా తొలగించలేము. ఇది 'మహాభారతం'లోని విదురనీతి.

30. 'తేజస్వినావధీత మస్తు!' అంటున్నది ఉపనిషత్తు. మన మొక విద్యను నేర్చుకొన్నా మనుకోండి. ఆ విజ్ఞానాన్ని వృథా కాన్వికూడదు. సాధన చేయాలి. దాని నాచరణ లోనికి తేవాలి.

సత్ఫలితాలను సాధించాలి. అప్పుడు మాత్రమే మన విద్య సార్థక మౌతుంది. గురుఋణం తీరుతుంది కూడా. ఆ ప్రయత్నం చేద్దాం. 'మన విద్య ప్రకాశవంత మగును గాక! విశ్వవ్యాప్త మగును గాక!'.

31. ఏ పనియైనా మనం ప్రయత్నించి చేస్తే జరుగుతుంది కానీ కేవలం మనస్సులో అనుకొంటే నెరవేరదు. సింహం మృగరాజే ఐనప్పటికీ జూలు విదిలించి లేచి గుహ నుండి బయటకు వచ్చి వేటాడితే ఆహారం దొరుకు తుంది కానీ పడుకొని నోరు తెరిచినంత మాత్రాన ఏ జంతువూ స్వయంగా దాని నోటిలోని కాహారంగా వెళ్లదు కదా! ఇది మన ప్రాస్తావిక సూక్తి.

32. ఉత్తములకు కోపం వస్తే ఒక్క క్షణకాలం మాత్రమే ఉంటుంది. మధ్యములకు కోపం వస్తే రెండు గడియలు– అంటే నలభై ఎనిమిది నిమిషా లుంటుంది. అధములకు కోపం వస్తే ఒక్క రోజు ఉంటుంది. నీచుడికి కోపం వస్తే యావజ్జీవితమూ ఉంటుంది. ఆ నీచకోపం పనికి రా దన్నారు మన నీతికోవిదులు.

33. 1.వస్త్రం, 2. వపుస్సు, 3. వాక్కు, 4. విద్య, 5. వినయం– ఇది వకార పంచకం. అంటే ఐదు వకారాలు. వీటి వలన మనిషికి సమాజంలో మంచి గౌరవం లభిస్తుం దన్నారు విజ్ఞులు. వపుస్సు అంటే ఎల్లప్పుడూ మంచి ఆ లోచనలు చేస్తూ ఆనందంగా ఉండటం వలన ముఖానికి వచ్చే తేజస్సు, మంచి కళ.

34. ఏ కుటుంబాని కైనా సుగుణగణ పూజితుడైన కుమారుడు ఒక్కడు చాలును. మూర్ఖులు వందల మంది అనవసరం. రాత్రి వేళ ఉన్న ప్రగాఢ మైన చీకటిని పోగొట్టటానికి చంద్రుడు ఒక్కడు చాలును. కోట్ల కొలది నక్షత్రాలతో పని లేదు కదా! ఇది నీతిశాస్త్ర వచనం.

35. 1.పరస్త్రీవ్యామోహం, 2.జూదం, 3. మద్యపానం, 4.వేట, 5.పరుషంగా మాట్లాడటం, 6. చేసిన తప్పుకు మించిన శిక్షను వేయటం, 7. ధనాన్ని అనవసరంగా ఖర్చుచేయటం – వీటిని సప్తవ్యసనా లంటారు. మనుష్యులు వీటికి దూరంగా ఉండాలని విదురుడు ధృతరాష్ట్రుడితో అన్నాడు. ఈ సూక్తి 'మహాభారతం'లోని విదురనీతి లోనిది.

36. నూతన యౌవనగర్వం, అపరిమితమైన ధనం, అదుపు లేని అధికారం, అంతు లేని అజ్ఞానం– మానవుడు సర్వనాశనం కావటానికి వీటిలో ఒక్కటి చాలును. అటువంటప్పుడు ఒక్కడికే ఈ నాలుగు లక్షణాలూ ఉన్న ట్లయితే ఇక వాడి సంగతి చెప్పే దేమున్నది? ఇది 'పంచతంత్ర' సూక్తి.

37. శ్రేయస్సు అంటే మనకు మేలును కలిగించేది. ప్రేయస్సు అంటే మన కిష్టమైనది. మన కెదురుగా శ్రేయస్సు, ప్రేయస్సు రెండూ ఉన్నట్లయితే మనం శ్రేయస్సునే కోరుకోవాలి. ప్రేయస్సును కాదు. అదే విజ్ఞుల లక్షణ మంటున్నది 'కఠోపనిషత్తు'.

38. ఆచారం మన సొంత ఇంట్లో మనకు పూర్తిగా సమకూరుతుంది. మన ఊరిలోనే ఉన్న

ఇతరుల ఇంటికి వెళ్లినట్లయితే అక్కడ అందులో సగమే దొరుకుతుంది. పట్టణాలలో నైతే పావుభాగమే ఉంటుంది. ప్రయాణాలలో ఎంత మాత్రమూ అవకాశ ముండదు. మనం సమయానుకూలం గా సర్దుకొనిపోతూ ఉండాలి. ఇది మన లోకజ్ఞుల మాట.

39. పరమ ప్రయోజనకరమైన ఒక విషయాన్ని గురించి బోధించవలసిందిగా ఒక మహాత్ముడి నర్థించిన జిజ్ఞాసువు దానిని వింటేనే సంతోషిస్తాడు. కానీ దానికి బదులుగా అవతలి వ్యక్తి ఎన్ని ధన కనక వస్తు వాహనాల నిస్తానన్నప్పటికీ అంగీకరించడు. జ్ఞానార్థిని లౌకిక సంపదలు సంతృప్తి పరచలేవు. ఇది 'కఠోపనిషత్తు' లోని సూక్తి.

40. లాలించటం వలన చాలా దోషాలున్నై. దండించటం వలన చాలా ప్రయోజనాలున్నై. కనుక కుమారుడినైనా, శిష్యుడినైనా 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న సూక్తి ననుసరించి సముచితమైన రీతిలో దండించటమే మంచిది. లాలించటం మంచిదికాదన్నారు మన శ్రేయోభిలాషులు.

41. పూలమాలను కట్టే వ్యక్తి పూల నెంత సున్నితంగా కోస్తాడో, తుమ్మెద పూలలోని తేనె నెంత సున్నితంగా తీసుకొని త్రాగుతుందో గమనించండి. రాజైనవాడు తన ప్రజల నుండి పన్నుల నంత సున్నితంగానూ, వారి కెంత మాత్రమూ బాధ కలగని విధంగానూ సేకరించాలి. అంతేకానీ వారిని నానా విధాలుగా హింసించి కాదు. బొగ్గుల కోసం పచ్చని చెట్టును కూల్చి కాల్చి వేయ కూడదు కదా! ఇది 'మహాభారతం'లోని విదురనీతి.

42. అతిథులు, అభ్యాగతులు భగవత్ స్వరూపులు. ఇంటి యజమాని వారిని గౌరవించినట్లయితే వారు సంతుష్టులవుతారు. ఆ ఇంటికి సమస్త శుభాలనూ అనుగ్రహిస్తారు. వారి నవమానించినట్లయితే కుపితులవుతారు. ఆ ఇంటి యజమాని అంత వరకూ సంపాదించుకొని ఉన్న పుణ్యరాశి మొత్తాన్నీ తమ వెంట తీసుకొని వెళతారు. కనుక అతిథి, అభ్యాగతులను యథాశక్తి గౌరవించండి అంటున్నది 'కఠోపనిషత్తు'.

43. ఎక్కడైతే విద్యాధికులు, జ్ఞానాధికులు కేవలం ధనాధికులకు లోబడి ఉంటారో అక్కడ అభివృద్ధి, సత్కీర్తి, సంపద స్థిరంగా ఉండవు. ఇది లోకజ్ఞు లైన మన పూర్వికులు మన సమాజానికి చెప్పిన హితవు.

44. మంచి ధనుర్విద్యా నైపుణ్యం కలిగిన ధానుష్కుడు వదలిన ఒక బాణ మొక్కడిని చంపుతుంది. లేదూ గురి తప్పి నిరుపయోగ మవుతుంది. కానీ మంచి లౌక్యం తెలిసిన రాజనీతిజ్ఞుడి తెలివి, అతడు పన్నిన పథకం శత్రురాజునూ, అతడి రాజ్యాన్నీ సర్వనాశనం చేసి తీరుతై. కనుక అటు వంటి మేధావులతోనూ, వారి అండ కలవారితోనూ వైరం పెట్టుకోవద్దు. ఇది 'మహాభారతం'లో విదురుడు ధృతరాష్ట్రుడికి చెప్పిన నీతి.

45. తన కంటె బలవంతుడితో వైరం పెట్టుకొన్న బలహీనుడు, ఏ విధంగా నైనా సరే ధనాన్ని పోగొట్టుకొన్నవాడు, దొంగతనం చేయటానికి వెళ్లాలనుకొన్నవాడు, కామంతో అతలాకుతల మవుతున్నవాడు– ఈ నలుగురు నిద్ర పట్టక లోపల లోపల కుమిలిపోతుంటారు. ఆ పరిస్థితి నెవ్వరూ తెచ్చుకోకూడదన్నాడు విదురుడు ధృతరాష్ట్రుడితో 'మహాభారతం'లో.

46. మనం చేసిన ఏ కొద్దిపాటి పుణ్యమైనా వృథాగా పోదు. మనకు సత్ఫలితాన్నే ఇచ్చి తీరుతుంది. నమ్మండి! మన ఇంటికి కోడలుగా వచ్చిన అమ్మాయిని మనం ప్రేమగా చూచుకొన్నట్లయితే ఆ పుణ్యం వలన మరొక ఇంటికి కోడలుగా వెళ్లిన మన కుమార్తె ఆ ఇంట్లో కచ్చితంగా సుఖపడు తుంది.

47. ప్రతిరోజూ యథాశక్తి శ్రద్ధాభక్తులతో అన్నివిధాలుగానూ అర్హుడైన వ్యక్తికి దానం చేయటం, ప్రశాంతంగా కూర్చొని ఒక సద్గ్రంథంలో కొంత భాగాన్ని చదువుకోవటం, పరోపకారం లాంటి ఒక సత్కార్యాన్ని చేయటం– ఈ మూడింటి వలన మన జీవితంలో ప్రతిరోజూ సార్థక మవుతుంది. ఇది వేదవిదులైన మన సంప్రదాయజ్ఞుల సూచన.

48. తన వద్ద పని చేస్తున్న ఉద్యోగుల పట్ల ఏ అధికారి యొక్క ఆగ్రహమూ, అనుగ్రహమూ రెండూ నిరుపయోగాలుగా ఉంటాయో ఆ అధికారిని అతడి అనుకూలురూ, ప్రతికూలురూ ఎవ్వరూ ఎంత మాత్రమూ లక్ష్య పెట్టరన్నారు మన నీతిశతకకర్తలు.

49. రాజుకు ప్రజలు శరీరం లాంటి వాళ్లు. ప్రజలకు రాజు ఆత్మలాంటి వాడు. కనుక రాజు ప్రజలను రక్షిస్తూ ఉండాలి. ప్రజలు రాజును గౌరవిస్తూ ఉండాలి. అటువంటి రాజు, ప్రజలు ఉన్న దేశం సకల సౌభాగ్యాలతో విరాజిల్లుతూ ఉంటుందన్నారు భీష్మాచార్యులవారు ధర్మరాజుతో. ఇది 'మహాభారత'నీతి.

50. సహనం లేని వ్యక్తి చేసిన ధ్యానఫలితం, జాగ్రత్త లేని వ్యక్తి సంపాదించిన సంపద, ధర్మమార్గంలో నడవని రాజు అధికారం– ఇవి పగిలిపోయిన కుండలోని నీళ్ల లాగా ఎక్కువ కాలం నిలవవన్నాడు శమీక మహర్షి తమ కుమారుడైన శృంగితో. ఇది 'మహాభారతం'లోని నీతి.

51.సజ్జనులు సంతోషంతో ఇచ్చిన ధనం, కానుకలు సమస్త శుభాలనిస్తాయి. కానీ వారి నేడిపించి, హింసించి, అక్రమంగానూ, బలవంతంగానూ తీసుకొన్న ధనం మాత్రం తీసుకొన్నవాడినీ, అతడి వంశాన్నీ సర్వనాశనం చేస్తుంది. కనుక అటువంటి అకృత్యాలకు పాల్పడవద్దు సుమా! ఇది లోకహితంకరులైన మన ఋషీశ్వరులు చేసిన హెచ్చరిక.

52. మనం మన సమాజంలో మనకంటే ముందుగా నివసించిన విజ్ఞుల, మహాత్ముల జీవితచరిత్రలను వినాలి. సజ్జనులతో సహవాసం చేస్తూ ధర్మా ధర్మాలను గురించి తెలుసుకోవాలి.

ఆ తెలుసుకొన్న ధర్మాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించాలి. ఆ విధంగా ఆచరించినవాడే అందరికీ ఆదర్శప్రాయు డవుతాడని 'మహాభారతం'లో యయాతి మహారాజు తమ కుమారుడైన పూరుడికి చెప్పాడు.

53. దుర్మార్గుల వద్ద ఉన్న విద్య వారితరులతో అనవసరపు వివాదాలు పెట్టుకోవటాని కుపయోగపడుతుంది. వారి వద్ద ఉన్న ధనం వారి కపరిమితమైన అహంకారాన్ని కలిగిస్తుంది. వారి బలమితరులను హింసించ టానికి పనికి వస్తుంది. కానీ– సజ్జనులు తమ విద్య నితరులకు జ్ఞానోపదేశం చేయటానికీ, తమ ధనాన్ని పాత్రులకు దానం చేయటానికీ, బలాన్ని ఆపదలో ఉన్నవారిని రక్షించటానికి మాత్రమే ఉపయోగిస్తారు. ఇది సామాజికస్పృహ సమగ్రంగా కలిగిన మన సూక్తికారుల మాట.

54. 1.ఇతరుల అభివృద్ధిని చూసి అసూయ చెందేవాడు, 2.ప్రతి పదార్థాన్నీ చూచి అసహ్యించుకొనేవాడు, 3. సంతోషమెంత మాత్రమూ లేని వాడు, 4.చీటికి మాటికి కోపపడేవాడు, 5. ప్రతి చిన్న విషయాన్ని గురించి సందేహిస్తూ ఉండేవాడు, 6. ఇతరుల సంపదతోనే తన జీవిత మంతా గడచి పోవాలనుకొనేవాడు– ఈ ఆరుగురికి జీవితాలలో దుఃఖమే తప్ప సౌఖ్య మనేది ఇసుమంతైనా ఉండదన్నాడు శ్రీమాన్ పరవస్తు చిన్నయసూరి తన 'నీతిచంద్రిక'లో.

55. కృతఘ్నులు, నీచులైన వారి కుపకారం చేసినట్లయితే వారు ఆ చేసిన వారికి కానీ, లోకానికి కానీ ఏ విధమైన మేలును చేయకపోగా ప్రయత్నించి కీడునే చేస్తారు. పాముకు పోసినటువంటి పాలు విషంగానే మారుతున్నై కానీ అమృతం లాగా మారటం లేదు కదా! కనుక దుష్టులకు సాహాయ్యం చేయవలసి వచ్చినప్పుడు విజ్ఞతతో వ్యవహరించండి! అన్నారు మన పెద్దవారు.

56. ఒక మంచి విషయాన్ని, ఒక మౌక్తికం– ముత్యం లాంటి సూక్తిని వంద మందికి చెబుదాం. ఎనభై మంది చక్కగా వింటారు. ఏభై మంది మెచ్చుకొంటారు. ఇరవై మంది 'మనమూ ఆచరిస్తే బాగుండు' ననుకొంటారు. పది మంది ఆచరిస్తారు. అదే మనకు సంతోషం. కానీ ఆ పది మందిలో ఒకళ్లం మనమై ఉండాలి. అది మన కనీస మైన బాధ్యత.



# భగవద్గీత - నాయకత్వ లక్షణాలు

**డా.యస్.వి.యస్.యల్.ఫణికామేశ్వరి,**
సంస్కృతోపన్యాసకురాలు,
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల,
సాంబశివపేట, గుంటూరు
చరవాణి : 9491622609

ప్రాచీన సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధమైన గ్రంథం శ్రీమద్భగవద్గీత. అఖండమైన విజ్ఞానాన్ని పురాణాల రూపంలో ప్రపంచానికి అందించిన వేదవ్యాసమహర్షిచే విరచితమైన శ్రీమన్మహాభారతము నందలి భీష్మ పర్వాన్తర్గతమైన -శ్రీమద్భగవద్గీత సాక్షాత్తు శ్రీమన్నారాయణుని చేతనే శ్రీకృష్ణ అవతారములో లోకానికి అందించబడినది. శ్రీ మద్భగవద్గీతను చదివినట్లైతే నాయకుడు అనేవాడు ఎలా ఉండాలి? ఏ లక్షణాలు కలిగి ఉండాలి అనే విషయాలను పూర్తిగా అవగాహన చేసుకునే శక్తి కలుగుతుంది.

భగవద్గీతలో 18 అధ్యాయాలను మూడు భాగాలుగా చేసి 1. కర్మషట్కము, 2. భక్తి షట్కము, 3. జ్ఞాన షట్కము అని నామకరణము చేసినారు. అందులో రెండవ భాగమైన భక్తిషట్కంలో నేర్చుకున్న అంకిత భావ కర్మ ద్వారానే మనిషిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుట జరుగుతుంది. మనస్సు, బుద్ధి రెండింటిని ఎప్పుడైతే కర్మలో నూటికి నూరుపాళ్ళు నెలకొల్పుతామో అప్పుడు మనం చేసే కర్మ అంకిత భావ కర్మ అవుతుంది. భగవద్గీతలో గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు "మయ్యర్పిత మనో బుద్ధిః" (నాకు సమర్పించబడిన మనోబుద్ధులతో) "మామనుస్మర యుధ్య చ (నన్ను స్మరిస్తూ యుద్ధం చేయి), "మయ్యేవ మన ఆధత్స్వమయి బుద్ధిం నివేశయ" (నన్ను మనస్సులో పెట్టుకో, నీ బుద్ధిని నాకు ఇవ్వు) అంటూ అనేక రకాలుగా చెబుతూ మనోబుద్ధులను ఏ విధంగా అంకితభావ కర్మలో నెలకొల్పాలో వివరించాడు. గీతాధ్యయనం వలన మనిషిలో వచ్చే మార్పు ఏమిటంటే అతడు తన మనోబుద్ధులను చక్కగా ఉపయోగించి జీవితంలో సఫలుడౌతాడు.

అంకిత భావ కర్మ ద్వారా మనిషి గుణశీలుడౌతాడు. అతనిలో నాయకత్వలక్షణాలు వృద్ధిచెందుతాయి. అవే అతనికి జీవితంలో ఐశ్వర్యాన్ని, యశస్సును, అసాధారణమైన శక్తి నైతికత్వాన్ని కలిగిస్తాయి. స్వార్థపూరిత కర్మ ద్వారా వ్యక్తి గుణహీనుడైతే అంకితభావకర్మద్వారా గుణ పూర్ణుడౌతాడు. సద్గుణవంతుడు మాత్రమే నాయకుడు కాగలుగుతాడు. దీనికి ప్రహ్లాదుని కథ ఈ విధంగా చెప్పబడినది.

## ప్రహ్లాదుడు - సద్గుణము :

ప్రహ్లాదుడు దానవరాజు, అతడు బ్రాహ్మణులు, గురువులు సేవతో మహాబలవంతుడయ్యాడు. ఇంద్రుడినే ఓడించేటంత బలవంతుడయ్యాడు. అది చూసిన ఇంద్రుడు బ్రాహ్మణుని వేషంలో వచ్చి తనకు ఏదైనా సేవ చేసే అవకాశం ఇవ్వమని ప్రహ్లాదుని అడిగాడు. ప్రహ్లాదుడు ఇచ్చిన సేవను చేస్తూ ఆ బ్రాహ్మణుడు ఎంతో మంచిపేరు తెచ్చుకున్నాడు. అతని సేవకు మెచ్చుకున్న ప్రహ్లాదుడు ఏదైనా వరము కోరుకొమ్మని అడిగాడు. అప్పుడు ఇంద్రుడు తన అసలు రూపం బయట పెట్టి ప్రహ్లాదుని సద్గుణాన్ని తనకు దానమివ్వమని అడిగాడు. ప్రహ్లాదుడు ఇచ్చేశాడు. ఇంద్రుడు దానిని తీసుకొని వెళ్ళిపోయాడు.

అప్పుడు ప్రహ్లాదుని దేహంలో నుండి ఒక తేజోమయ పురుషుడు బయటకు వచ్చి తాను "దివ్యగుణాన్ని" సద్గుణాన్ని అని చెప్పాడు. తానిప్పుడు బ్రాహ్మణునితో పాటుగా వెళ్ళిపోతున్నానని కూడా చెప్పాడు. అది చూసి ప్రహ్లాదుడు ఆశ్చర్యపోయాడు. ఇంతలో మరొక తేజోమయ పురుషుడు ప్రహ్లాదుని శరీరము నుండి బయటకు వచ్చి తాను "ధర్మాన్ని" అని చెప్పాడు. అతడు కూడా ఆకాశమార్గంలో వెళ్ళి ఇంద్రుని చేరుకున్నాడు. అంటే సద్గుణం పోతే ధర్మపరిపాలన కూడా పోతుందన్నమాట. ప్రహ్లాదుడు అది చూసి కంగారు పడ్డాడు. ఇంతలో మరొక దివ్యపురుషుడు ప్రహ్లాదుని శరీరం నుండి బయటకు వచ్చి తాను "సత్యసంధతన"ని చెప్పి ఆకాశ మార్గంలో వెళ్ళిపోయాడు. ధర్మం పోగానే సత్యం పోయింది. తరువాత మరొక పురుషుడు ప్రహ్లాదుని శరీరము నుండి బయటకు వచ్చి తాను "సత్ప్రవర్తన"నని చెప్పి వెళ్ళిపోయాడు. అంటే సత్యంతో పాటే సత్ప్రవర్తన కూడా పోతుంది. తరువాత ఒక అందమైన వనిత ప్రహ్లాదుని శరీరం నుండి బయటకు పోతూ తాను "శక్తిని" అని చెప్పింది. ఆ తరువాత మరియొక అందమైన స్త్రీ ప్రహ్లాదుని శరీరం నుండి బయటకు పోతూ తాను "ఐశ్వర్యాన్ని" అని చెప్పింది. ఈ విధంగా సద్గుణం పోగానే అన్ని వరుసగా. పోతాయి. చివరకు ఐశ్వర్యం కూడా పోతుంది ' ఈ కథ మహాభారతంలో చెప్పబడినది. అందుకే భగవద్గీతలో అంకిత భావ కర్మ ద్వారా కలిగే సద్గుణాలు చక్కగా వర్ణించ బడినవి. అవియే మనిషికి నిజమైన అలంకరణలు.

సద్గుణవంతుడైన వ్యక్తి మాటల ద్వారా గానీ, మనస్సు ద్వారా గానీ, కర్మల ద్వారా గానీ ఎవ్వరికీ ఏ విధమైన హాని చేయడు. అతడు చేసే ప్రతి పనికీ జనులు ఎంతో అభిమానము చూపుతారు. ఇదే సద్గుణవంతుడైన వ్యక్తికి లభించే దివ్యగౌరవము. ఆ సద్గుణము పోగానే అన్నీ ఒక్కొక్కటిగా పోతాయి. ఈ విషయము ప్రపంచంలోని అనేకమంది మనుషులలో మనకు కనిపిస్తూనే ఉంటుంది.

## నాయకత్వలక్షణాలు :

అంకితభావ కర్మద్వారా సద్గుణాలు మనిషిలో కలుగుతాయి. ఆ సద్గుణాలు కలిగిన వ్యక్తులు నిశ్చయంగా విజయపథంలో సాగుతారు. ఇవన్నియు భగవద్గీత లోని పన్నెండవ అధ్యాయంలో 13 వ శ్లోకం నుండి 19వ శ్లోకం వరకు ఇవ్వబడ్డాయి. గీతలోని 12వ అధ్యాయానికి -భక్తియోగమని పేరు. దానినే అంకిత భావ కర్మగా చెప్పుకోవచ్చు.

1) ద్వేషం లేకపోవడం, 2) అందరి పట్ల మైత్రి 3) కరుణ కలిగి ఉండడము, 4) మమత్వము లేకపోవడము, 5) మిథ్యాహంకారము లేకపోవడం, 6) సుఖ దుఃఖాలలో సమభావము కలిగి ఉండడము, 7) క్షమా -గుణము, 8) సర్వదా సంతుష్టి కలిగి ఉండడము, 9) ఆత్మనిగ్రహము కలిగి ఉండడము, 10) భగవంతుని మీదనే మనోబుద్ధులు నిలిపి ఉంచడము, 11) దృఢ -నిశ్చయము కలిగి యుండడము, 12) ఎవ్వరికీ కష్టము కలిగించక పోవడం, 13) ఎవ్వరి చేతను కలతకు గురి కాక పోవడం, 14) ద్వంద్వాలలో సమభావము కలిగి -యుండడము, 15) సాధారణ కలాపాలు చేయకపోవడం 16) పవిత్రునిగా ఉండడము, 17) సమర్థత కలిగియుండడము, 18) ఉదాసీనునిగా నుండడము, 19) అన్ని చింతల నుండి బయటపడి యుండడము, 20) ఏదో ఫలప్రాప్తికి తీవ్రంగా కృషి చేయకపోవడము, 21) ఉప్పొంగడము, దుఃఖించడము లేకపోవడము, 22) శోకించడం, కోరడం చేయక పోవడం, 23) శుభము, అశుభము రెండింటిని త్యాగం చేయడం, 24) శత్రుమిత్రులతో -సమభావము కలిగి యుండడము, 25) మానావమానాలలో శీతోష్ణాలలో, సుఖదుఃఖాలలో, నిందాస్తుతులలో సమబుద్ధి కలిగియుండడము, 26) చెడు సాంగత్యం నుండి దూరంగా ఉండడము, 27) దేని చేతనైనా సంతుష్టి చెందడం 28) ఏ నివాసంలోనైనా సర్దుకుపోవడం, 29) జ్ఞానంలో స్థిరంగా ఉండడము, 30) గీతాచార్యునే పరమ గమ్యముగా చేసికోవడం అనేవి అంకిత భావకర్మలో నెలకొన్న వ్యక్తికి ఉంటాయి. అటువంటి వాడు గీతాచార్యునికి అత్యంత ప్రియమైన వాడు.

## నాయకత్వలక్షణాల వివరణ:-

ద్వేషము లేకపోవడము, అందరిపట్ల మైత్రి, కరుణ కలిగి ఉండడమనే మొదటి మూడు ఉత్తమ లక్షణాలు.. ఉన్నతుల పట్ల ద్వేషము చూపకూడదు, పైగా మైత్రి చేయాలి. సమానులతో తప్పకుండా మైత్రి చేయాలి, ఇక తనకంటే చిన్నవారిపై కరుణ చూపాలి. ఈ విధంగా మానవుడు అందరిలోనూ మన్ననలను పొందుతాడు. అప్పుడు ఉన్నతుల ఆశీస్సులు, సమానుల మైత్రి, చిన్నవారి సహాయం తప్పకుండా లభిస్తాయి.

మమత్వము లేకపోవడం, మిథ్యాహంకారము లేకపోవడం అనేవి లేకపోతే అందరితో మైత్రి చేసే స్వభావమే రాదు. చిన్నవాళ్ళపై కరుణకు బదులు పొగరు చూపించడము జరుగుతుంది. కనుక మానవుడు వీటిని వదిలి పెట్టాలి. సుఖదుఃఖాలలో సమభావము అలవాటు చేసుకోవడం

ఎంతో అవసరము. సర్వదా సంతుష్టి అన్నింటి కన్నా ముఖ్యమైన అంశము. దృఢనిశ్చయము కూడా చాలా ముఖ్యమైనది. జీవిత లక్ష్యాన్ని సాధిస్తాననే దృఢనిశ్చయము మనిషికి తప్పక ఉండాలి. మనో బుద్ధులు భగవంతునికే సమర్పించడం మనిషిలో వినమ్రమైన –భావాన్ని, ధైర్యాన్ని కలిగిస్తాయి. "మయ్యర్పిత మనోబుద్ధిః" అని గీతాచార్యుడు చెప్పాడు కనుక గీతాజ్ఞానాన్ని సమర్పించిన జగద్గురువు శ్రీకృష్ణ భగవానుని పట్ల పూర్తి గౌరవాదరాలతో ఉండాలి. అటువంటి సమర్పణ భావన విజయాలను చేకూరుస్తుంది.

సమర్థతను కలిగి ఉండడము, అన్ని చింతల నుండి విడివడి ఉండడము మనోబుద్ధుల కార్యాలు, సమర్థత బుద్ధి కుశలత మీద ఆధారపడి ఉంటుంది. కాగా అన్ని చింతల నుండి విడివడడము మానసిక స్థైర్యం మీద ఆధారపడి ఉంటుంది. కనుక మనస్సును కేవలము లక్ష్యంతో నింపి వేయాలి. ఇక కాలాన్నంతా పనులతో నింపివేయాలి. ఎప్పుడూ పనులలో నిమగ్నుడై మనస్సును కేంద్రీకరించే పనులను చేయాలి.

చెడు సాంగత్యానికి దూరంగా ఉండాలి. చెడు సాంగత్యమంటే లక్ష్యం నుండి దృష్టి మళ్ళించే సాంగత్యమని అర్థము. అలాంటి దుష్ట సాంగత్యము జీవితంలో మిక్కిలి చేటును కలిగిస్తుంది. కనుక జ్ఞానంలో స్థిరంగా ఉండటము కూడా చాలా ముఖ్యమైనది. ఈ విధమైన లక్షణాలు కలిగిన వాడు మాత్రమే మంచి నాయకుడుగా కాగలుగుతాడు.

కనుక భగవద్గీతతో చెప్పినటు వంటి సద్గుణములను అలవాటు చేసుకుని, ఆ సద్గుణాల ద్వారా మానవుడు మంచి నాయకుడుగా మారగలిగేటువంటి నాయకత్వలక్షణాలను పెంపొందించుకోవాలని ఆశిస్తూ అందరిపైన భగవంతుని పరిపుర్ణ కరుణా కటాక్ష వీక్షణాలు ప్రసరించాలని కోరుకుంటూ శుభమస్తు.

## శ్రీమద్భగవద్గీత

"తనంత తానుగా ఏదీ కోరుకనే, దానంతట అదే లభించిన వస్తువుతో ఎవరైతే ఎల్లప్పుడు తృప్తి పొంది ఉంటారో, ఎవరిలో ఈర్ష్యాభావం ఏ మాత్రం లేకుండా నశిస్తుందో, ఎవరు హర్షశోకాది ద్వంద్వాలకు పూర్తిగా అతీతుడో, ఏది సిద్ధించినా, సిద్ధించకపోయినా, సమభావంతో ఉంటాడో అటువంటి కర్మయోగి కర్మలాచరిస్తున్నా వాటి చేత బంధింపబడకుండానే ఉంటాడు."

# భారతీయ సంస్కృతి (ప్రశ్నోత్తరములు)

"విద్యావారిధి"
**డాక్టర్ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి,**
గుంటూరు
చరవాణి : 99851 01234

ప్ర. **భారతీయసంస్కృతి యొక్క ముఖ్యప్రయోజనము ఏమిటి?**

స. భారతీయసంస్కృతి యొక్క ముఖ్యప్రయోజనము శ్రీ సతీశచంద్రచటర్జీ ఇట్లు తెలిపెను. "The aim as philosophical wisdom is not merely the satisfaction of intellectual curiosity, but mainly the enlightened like led with far sight, fore sight and in sight." తాత్త్విక విజ్ఞానము యొక్క లక్ష్యమేమనగా కుతూహలమును పోగొట్టి సంతృప్తిని కలిగించుటయేగాక దూరదృష్టితో, సూక్ష్మదృష్టితో, అంతర్దృష్టితో తేజోవంతమైన జీవితమును కొనసాగించుట.

ప్ర. **వేదముల శాఖలను తెలుపుము.**

స. ఋగ్వేదమునకు 21 శాఖలు, యజుర్వేదమునకు 109, సామవేదమునకు 1000, అథర్వవేదమునకు 50 శాఖలు గలవు.

ప్ర. **మనుస్మృతికి వ్యాఖ్యానము వ్రాసిన ప్రాచీనుడెవరు?**

స. "మేధాతిథి".

ప్ర. **వేదమహర్షి వేదములను ఎవరికి నేర్పెను?**

స. ఋగ్వేదమును పైలునికి, యజుర్వేదమును వైశంపాయనునికి, సామవేదమును జైమినికి, అథర్వవేదమును సుమంతునికి బోధించెను.

ప్ర. **వ్యాకరణశాస్త్రమున సూత్రములు రచించిన పాణిని గురువు ఎవరు? వారు చేసిన గొప్ప పని ఏమిటి?**

స. పాణిని మహర్షి గురువు ఉపవర్షుడు. వీరు పూర్వమీమాంస, ఉత్తరమీమాంసలలో వృత్తి గ్రంథమును రచించి మహోపకారము చేసిరి.

ప్ర. **వ్యాసమహర్షికి గల మఱియొక నామమేమి?**

స. "అపాంతరతముడు"

ప్ర. **ఇతర నామములేవి?**

స. వ్యాసు, కృష్ణద్వైపాయనుడు, సాత్యవతేయుడు, బాదరాయణుడు (బాదరాయణుడు మఱియొక ఋషియని కొందఱు, ప్రామాణికులు బ్రహ్మసూత్రములు రచించిన వ్యాసుడే

బాదరాయణుడందురు.

**ప్ర. జైమిని మహర్షికంటె ముందు మీమాంసాశాస్త్రములో సందేహములను నివారించిన పెద్దలెవరు?**

స. బాదరాయణుడు, బాదరి, కాముకాయనాచార్యులు.

**ప్ర. ఉపవర్షుడెవరు? అతను ఎవరితో కలసి దేనిని, ఎక్కడ అధ్యయనము చేసెను.**

స. నందవంశమునకు చెందిన ఒక రాజువద్ద ఉపవర్షాచార్యుడు మంత్రిగానుండెను. పాణిని, వ్యాధుడు, కాత్యాయనులతో కలసి ఇంద్రుడు రచించిన వ్యాకరణమును పాటలీపుత్రనగరములో అధ్యయనము చేసెను.

**ప్ర. శబరస్వామి ఎవరు? అతని మొదటిపేరు ఏమి?**

స. శబరస్వామి మీమాంసాశాస్త్రములో మహాభాష్యమును రచించిన మహానుభావుడు ఆతని మొదటిపేరు ఆదిత్యదేవుడు.

**ప్ర. మీమాంసాశాస్త్రము యొక్క గొప్పదనమును ఎవరు చెప్పిరి? ఏమని చెప్పిరి?**

స. భారతీయ మీమాంసాశాస్త్రము యొక్క గొప్పదనమును శ్రీ వివేకానందస్వామి కొనియాడెను. ఈ రీతిగా తెలిపెను.

"Indeed, the daring of the Mimamsa arguments, the fearlessness of it's admissions, and the firmness of it's inferences, approven as the very glory of Hinduism."

మీమాంసాశాస్త్ర వాదములు, సిద్ధాంతముల నిర్భయత, నిర్ణయముల స్థిరత్వము, హిందూమతము యొక్క గొప్పదనమును తెలుపును.

**ప్ర. మహర్షులచే మీమాంసాశాస్త్రము ఎందుకు రచింపబడినదో తెలుపుము.**

స. వేదములలో ముందు, తరువాత చెప్పబడిన విషయములలో అనేక సందేహములు కలుగును. అవి సామాన్యముగా నివారింపబడవు. ఆ సందేహములను పోగొట్టి యజ్ఞయాగాదులలో రహస్యములను, యధార్థములను తెలియజేయుటకు ఈ మీమాంసాశాస్త్రమును ఋషులు అవతరింపజేసిరి.

**ప్ర. పురాణముల ఎన్ని? అవి ఏవి?**

స. పురాణములు 18. అవి 1. బ్రహ్మ 2. పద్మ 3. విష్ణు 4. శివ 5. భాగవత 6. బృహన్నారనీయ 7. మార్కండేయ 8. అగ్ని 9. భవిష్యత్ 10. బ్రహ్మవైవర్త 11. లింగ 12. వరాహ 13. స్కంద 14. వామన 15. కూర్మ 16. మత్స్య 17. గరుడ 18. బ్రహ్మాండ

**ప్ర. ఉపపురాణము లెన్ని? అవి ఏవి?**

స. ఉపపురాణములు 18. అవి – 1. నందికేశ్వర 2. శుక్ర 3. వశిష్ఠ 4. దేవీభాగవత 5. మను 6. వాయు 7. మదనాశ 8. కల్కి 9. శైవ 10. ఆదిత్య 11. ఆది 12. శంభు 13. వశిష్ఠలింగ 14. బృహద్ధర్మ 15. ధర్మ 16. గౌర 17. కణేశ 18. నీల 19. కాళీ 20. దివి

**ప్ర. వీటిని ఎవరు ఎవరికి బోధించిరి?**

స. వ్యాసుడు సూతమహర్షి తండ్రియైన రోమహర్షుణునికి బోధించెను.

**ప్ర. వేదాంతసూత్రములకు భాష్యములను రచించిన కొందఱు మహానుభావులను పేర్కొనుము?**

స. శ్రీ శంకరాచార్యులు, శ్రీ రామానుజాచార్యులు శ్రీ మధ్వాచార్యులు, శ్రీ నింబార్కుడు, శ్రీ వల్లభుడు, శ్రీ బలదేవుడు, శ్రీ అరమిడు, శ్రీ టంకుడు, శ్రీ భర్తృప్రపంచ, శ్రీ భారుచి, శ్రీ కపర్ది, శ్రీ బ్రహ్మనందుదు శ్రీ గుహదేవ, శ్రీ యాదవప్రవాశుడు శ్రీ భాస్కరుడు శ్రీ విజ్ఞానభిక్షువు, శ్రీ నీలకంఠుడు, శ్రీ శ్రీపతి.

**ప్ర. ఇవియన్నియు ఇప్పుడు లభించుచున్నావా?**

స. పై వారిలో శ్రీ అరమిడు నుండు గుహదేవుని వఱకు గల వారి భాష్యములు లభించుటలేదు.

**ప్ర. వీరిలో కొందఱి వేదాంత సిద్ధాంతమును ఒక్క పదములో తెలుపుము.**

స. శ్రీ శంకరాచార్యులు – అద్వైతము, శ్రీ రామానుజాచార్యులు – విశిష్టాద్వైతము, శ్రీ మధ్వాచార్యులు – ద్వైతసిద్ధాంతము, శ్రీ నింబార్కుడు – భేదాభేదవాదము, శ్రీ వల్లభాచార్యులు – శుద్ధాద్వైతము, శ్రీ బలదేవులు – అచిన్త్యద్వైతాద్వైతము.

**ప్ర. ఉపనిషత్తులను గూర్చి చాలా గొప్పగా చెప్పిన పాశ్చాత్య మేధావి ఎవరు? ఏమనెను?**

స. ఉపనిషత్తులను గొప్పగా కీర్తించిన మేధావి, జర్మను తత్త్వవేత్త షోపెన్హార్. అతడిట్లనెను. "In the whole world there is no study so beneficial and so elevating as that of the Upanishads. It has been a solace of my life. It will be the solace of my death." మొత్తము ప్రపంచములో ఉపనిషత్తులవంటి ప్రయోజనకరమైన చదువు ఏదీలేదు. ఇది నా జీవితమునకు శాంతినిచ్చినది. నా మృత్యువునకుగూడ శాంతినిచ్చెను.

**ప్ర. ఉపనిషత్తులు ఎన్ని? ఏ వేదమునకు ఎన్ని గలవు?**

స. ఋగ్వేదమునకు 21 యజుర్వేదమునకు 109, సామవేదమునకు 1000, అధర్వవేదమునకు 50. మొత్తము 1180.

**ప్ర. ప్రస్తుతము లభఇంచుచున్న ఉపనిషత్తులు ఎన్ని?**

స. ప్రస్తుతము 108 లభించుచున్నవి.

**ప్ర. వీటిలో ఎక్కువ ప్రాధాన్యముగలవెన్ని?**

స. వీటిలో 32 ప్రధానములు. వాటిలోను 10 చాలా ముఖ్యము.

**ప్ర. అతిప్రధానమైన దశోపనిషత్తులు, ఇతరములను తెలుపుము.**

స. 1. ఈశ 2. కేన 3. కఠ 4. ప్రశ్న 5. ముండ 6. మాండూక్య 7. తైత్తిరీయ 8. ఐతరేయ 9. ఛాందోగ్య 10. బృహదారణ్యకము. శ్వేతాశ్వతర, కౌషీతరి గూడ గొప్పవి.

**ప్ర. ఉపనిషత్తులకు గల వ్యాఖ్యానములను తెలుపుము.**

స. 10 ఉపనిషత్తులకు మతాచార్యులందఱు భాష్యములను రచించిరి. శ్రీ శంకరాచార్యులవారు కౌషీతరి, శ్వేతాశ్వతరములకు గూడ వ్రాసిరి. 108 కి ఉపనిషద్బ్రహ్మయను యోగి వ్యాఖ్యానము వ్రాసెను. అది అడయారులోని దివ్యజ్ఞాన సమాజమువారు ప్రకటించిరి.

**ప్ర. సాంఖ్యదర్శనముతో ప్రసిద్ధులైన ఋషులు ఎవరు?**

స. కపిలమహర్షి (ఆదిపురుషుడు), ఆసురి, అసుర్యాయణ – అసిత – దేవల – నారద – సనక – సనందనాదులు.

**ప్ర. భేదాభేదవాదమందలి ఋషులెవరు?**

స. ఆశ్మరథ్యుడు – ఔడులోమి – కాశకృత్స్నుడు.

**ప్ర. ఋగ్వేదములో వర్ణింపబడిన ప్రధానదేవతలు ఎవరు?**

స. వరుణ, ఆదిత్య, బృహస్పతి, బ్రహ్మస్పతి, మిత్ర, అగ్ని, అర్యమణుడు, భగ, ఇంద్ర, ద్యులోక, పృథివీ, సింధు, మరుద్గణ, దక్ష, అసిధ్రీ, సామ, అదితి, అశ్వినీదేవతలు, అపాంసపాత, సరస్వతి, ఉష అను దేవతలు వర్ణింపబడిరి.

**ప్ర. తంత్రశాస్త్రము యొక్క గొప్పదనమేమి?**

స. వైదిక కర్మలకు వ్యతిరేకముగాక సర్వులకు ఆదరణీయమైయుండుటయే గొప్పదనము.

**ప్ర. శ్రీ సీతాశక్తి పరిణామములను పేర్కొనుము.**

స. శ్రీ సీతాశక్తి మాయారూపిణి. ఈమె మూడు విధములుగ పరిణమించినది.

1. ఇచ్ఛాశక్తి 2. క్రియాశక్తి 3. సాక్షాచ్ఛక్తి

శ్రీశక్తి – శ్రీభూమిశక్తి – శ్రీనీలాశక్తి

**ప్ర. జగన్మాత విషయములో అల్పజ్ఞానముతో, సంకుచితబుద్ధితో విమర్శించవచ్చునా?**

స. మన అల్పజ్ఞానముతో సృష్టిస్థితిలయములను చేయు దివ్యరూపిణియైన మహాశక్తిని విమర్శింపరాదని నిర్ణయము. ఈ విషయములో అరవిందయోగి మాట శిరోధార్యము. "Be on your guard and do not try to understand and judge the Devine mother by your little earthly mind" - Sri Aravinda Yogi.

**ప్ర. శక్తిపీఠములు ఎన్ని గలవు? అవి యేవి?**

స. శాక్తేయవిధానముననుసరించి 1.విద్యాపీఠము 2.శక్తిపీఠము 3.శైవపీఠము 4.గణేశపీఠము 5.చంద్రపీఠము 6.స్వాయంభువపీఠము 7.చీనాపీఠము 8.బౌద్ధపీఠము 9.వైదికపీఠము అని తొమ్మిదిగలవు.



# ఆదిశంకరునికి అంజలిశతము

కవివతంస, కవితాభారతి,
**రాయప్రోలు జగదీశచంద్రశర్మ**
విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తెనాలి,
చరవాణి : 94410 21209

సీ. కాలడిగ్రామాన కారుణ్యమూర్తియై
అపరశంకరరూపమవనియందు
నార్యాంబశివగురులల్లారుబిడ్డయై.
వైశాఖపంచమిన్ ప్రభవమంది
కారణజన్ముడై కమనీయరూపుడై
ఆర్షధర్మస్థాపనాశయుడుగ
ధర్మదీక్షాదీప్తి ధరణిలో నిలుపంగ
వాదాల షట్ఛాస్త్ర పటిమజూప
తేగీ. గురుని గోవిందదేశికు కోరి, చేరి
నేర్చె, శాస్త్రములవలీల నబ్బురపడ
బాలశంకరుని ప్రతిభ భాగ్యమయ్యె.
భవ్యవైదికధర్మము పండెనయ్య.

సీ. వేదాంతవిజ్ఞాన వీచీవిహారుడై
భాష్యత్రయంబును వరలజేసె
సామాది నలువేద సంరక్షణాబుద్ధి
పీఠంబుల నాల్గు విరియజేసె
ఆబాలగోపాల మందగా సద్భక్తి
మార్గం ధరణిలో మనగజేసె
నద్వైతసిద్ధియే అసలైనబుద్ధిగా
నెలుగెత్తి చాటుచున్ నిలువజేసె

తేగీ. అట్టి యవతారమూర్తియునాదిగురుడు
ధర్మసంస్థాపనాశయ ధార్మికుండు
ద్వైతభావాల తిమిరాల భానుడతడు
అట్టి దివ్యరూపునికి మా.. అంజలితతి.

ఉ. ముప్పదిరెండు వర్షములు పుణ్యపరీమళదేహుడై తగన్
తప్పని రీతిగా నిఖిలధర్మములెంతయు, వైదికంబులై యొప్పగ
బ్రహ్మసూత్రములకుజ్జ్వలభాష్యము, గీత తత్వమున్
చిప్పిలజేసె, లోకమున, శ్రీగురువర్యుడు శంకరార్యుడే.

కం. స్తోత్రంబులు పాడంగను
గాత్రంబులు శుద్ధియగును.. స్తుతిమహితంబుల్
ధాత్రిని మనకందించెను
శ్రోత్రియధర్మంపుమూర్తి.. శుభములొసంగన్.

సీ.మా. ఎవ్వాని జన్మంబు నిలపుణ్యదంబౌను
అట్టి సంయమివర్యుకంజలిస్తు.
నెవ్వాని ధ్యేయంబు నెల్లనొక్కటెదైవ
మట్టి.. యద్వైతికేనంజలింతు
నెవ్వాని స్తోత్రంబు లిలధర్మవాక్యంబు
లాగురుచరణులకంజలిస్తు
నెవ్వాని భాష్యంబులిలసత్య మందించు
అప్పరమాచార్యుకంజలిస్తు
నెవ్వాని వర్చస్సు నినతేజమై వెల్గు
నా బ్రహ్మరూపునికంజలిస్తు.

తేగీ. జగతికారాధ్యదైవమై సాగువాడు
నాల్గువేదాల రక్షించు నాయకుండు.
విశ్వగురువనుపేరున వెలిసినట్టి
యాది శంకరార్యునికేను హారతిడుదు.

# అథర్వవేద వైశిష్ట్యం

డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ

పతంజలి మహర్షి వేదాలలో మొదటి వాక్యాలనుదాహరిస్తూ 'శన్నోదేవీ రభిష్టయే' అని అధర్వవేద మంత్రాన్ని ఉదహరించారు. ఇది ఒక అథర్వవేదశాఖలో మొదటి మంత్రం. ఇలా ఆయన వేదాలలో మొదటి అథర్వవేదాన్ని పేర్కొనడం వారికి అథర్వవేదంపై గల గౌరవాన్ని సూచిస్తుంది.

'యజ్ఞైరథర్వా ప్రథమః' అని అథర్వముని యజ్ఞప్రక్రియ మొదట వెల్లడించారని ఋగ్వేద మంత్రం చెబుతోంది. ఇది అథర్వ మహత్త్వ సూచకమని వ్యాఖ్యాతలు చెప్పారు.

గోపథ బ్రాహ్మణంలో 'ప్రజాపతిర్యజ్ఞ మతన్వత స ఋచైవ హౌత్ర మకరోత్ యజుషాధ్వర్యనమ్. సామ్నోద్గాత్రమ్. అథర్వాఙ్గిరోభిర్బ్రహ్మత్వమ్' అనే వాక్యాలలో ప్రజాపతి ఋక్కులచేత హౌత్రం, యజుస్సులతో ఆధ్వర్యము, సామలచేత ఔద్గాత్రం, అథర్వాఙ్గరసములచేత బ్రహ్మత్వం నిర్వహించారని ఉంది. మూడు వేదాల చేత యజ్ఞాలకు చెందిన సగభాగం సంస్కరింపబడితే, బ్రహ్మ చేత మిగిలిన సగం భాగం సంస్కరింపబడుతుందని అక్కడ చెప్పారు.

ఆ బ్రాహ్మణంలోనే 'ప్రజాపతి స్సోమేన యక్ష్యమాణః వేదాన్ ఉవాచ. కంవోహోతారం వృణీయామ్ కమధ్వర్యుమ్ ? కముద్గాతారమ్? కం బ్రహ్మాణ మితి? త ఊచుః ఋగ్వేద మేవ హోతారం వృణీష్వ యజుర్విద మధ్వర్యుమ్. సామవిద ముద్గాతారమ్ అథర్వాఙ్గరో విదం బ్రహ్మాణామ్ తథా హాస్య యజ్ఞః చతుష్ప్రాత్ప్రత్తి తిష్ఠతి" అని కూడా ఉంది.

ప్రజాపతి ప్రశ్నలకు జవాబుగా వేదాలు ఋగ్వేదం చదివిన వానిని హోతగాను, యజుర్వేద వేత్తను అధ్వర్యునిగా, సామవేద వేత్తను ఉద్గాతగాను, అథర్వాఙ్గరోవిదుని బ్రహ్మగాను వరిస్తే యజ్ఞం నాలుగు పాదాలతో ప్రతిష్ఠితమవుతుందని చెప్పాయని ఆ బ్రాహ్మణంలోనే ఉంది. పై విషయమే ఇక్కడ భంగ్యంతరంలో ప్రజాపతికి వేదాలకు సంభాషణ రూపంలో ఉంది. ఇలా చేయకపోతే కలిగే దోషము కూడా తెలిపారు.

"అథచే న్నైనం విదం బ్రహ్మాణం వృణాతే దక్షిణత ఏవైషాం యజ్ఞోతిరిచ్యత. యథైక పాదో యన్ అనుభయ చక్రోవా రథో వర్తమానో భ్రేషం న్యేతి" ఈ వేద వాక్యాలను ప్రమాణంగా చూపి సాయణాచార్యులవారు అథర్వవేద వేత్త లభిస్తే ఆయనను బ్రహ్మగా వరించాలని చెప్పారు. బ్రహ్మకర్తవ్యాన్ని ప్రతిపాదించడం చేత దీనికి బ్రహ్మ వేదమని పేరు వచ్చింది.

కొందరు త్రయీ అని వేదానికి పేరుంది. మొదట వేదాలు మూడే. తరువాత అథర్వవేదం ఏర్పడిందని వ్రాశారు. ఆ వాక్యం ప్రామాణికం కాదు.

'అస్య మహతోభూతస్య నిశ్వ సితమేతత్. యదృగ్వేదోయజుర్వేద స్సామవేదోథర్వాఙ్గిరసః' అని వాజసనేయ శ్రుతి, 'ఋగ్యజుస్సామాథర్వణాశ్చత్వారోవేదాః' అని నృసింహతాపనీయోపనిషత్తు అథర్వవేదాన్ని వేదంగా స్పష్టంగా చెప్పాయి.

'తత్రాపరా ఋగ్వేదో యజుర్వేద స్సామ వేదోథర్వవేదః శ్రేష్ఠోహివేద స్తపోధిజాతో బ్రహ్మజ్ఞానాం హృదయే సమ్బభూవ' అని దీనిని శ్రేష్ఠపదంగా కూడా చెప్పారు.

'యేథర్వాణస్తద్భేషజం, యద్భేషజం తదమృతం, యదమృతం తద్బ్రహ్మ అని గోపథ బ్రాహ్మణం అథర్వవేదాన్ని కీర్తించింది. ఇంత ఎందుకుచెప్పానంటే కొందరు అథర్వవేదాన్ని క్షుద్రవేదమని, యాతు అని. ఈ వేదం చదివిన వారిని శ్రాద్ధభోక్తగా పిలువకూడదని చెబుతున్నారు. ఇవేవీ ప్రామాణికాలు కావని పై శ్రుతివాక్యాల వలన స్పష్టం.

అథర్వవేదం భాష్యంతో చదివినవాడు, కల్పసూత్ర వినియోగం సరిగా గ్రహించినవాడు సమాజంలో కలిగే అనేక సమస్యలను పరిష్కరించగలడని పదిమందికి ఆశ్రయం కల్పించగలడని చెప్పవచ్చు.

దీనిలోని విశేషమేమిటి? డాక్టర్ వినాయక రామచంద్రకూట్ అనే పండితుడు 'అథర్వవేదే రాజనీతిః' అనే పెద్దపుస్తకం వ్రశారు.

అథర్వవేదంలో భూసూక్తంలో మాతృదేశం పట్ల భక్తిని కలిగిస్తూ భూమి మహత్త్వం ఉంది (12-1) దేశం శక్తి (4-30) సభ (5-26) స్త్రీల సభ (7-46) రాజ్యాంగాలు (6-72-3)రాజు ఎంపిక (3-4) రాజు స్థిరత్వం (6-87) రాజ్యానికి ఐశ్వర్యాభివృద్ధికోసం ప్రయత్నం (6-54) రాజ్యాభిషేకం (4-8) స్వరాజ్యంలో రాజును మరల స్థాపించడం (3-3) దుష్టనాశనం, దుష్ట దమనం, దుష్టనివారకాలు (2-7, 8) సేనను సమ్మోహింపచేయడం (3-1,2) సామం మొదలయిన ఉపాయాలు (2-28-3) పన్ను (2-29-1) నీతి నిపుణులను ఆదరించడం (6-77-2) శాసన వ్యవస్థ (3-4-2) మొదలయిన అనేక విషయాలున్నాయి ఈ వేదంలో.

అథర్వ చికిత్సా జ్ఞానం అనే గ్రంథాన్ని హీరాలాల్ విశ్వకర్మ ఎమ్.డి. వ్రాశారు. డాక్టర్ ఉపేన్ద్రనాథ్ ద్వివేది ఈ గ్రంథరచనలో భాగస్వామి. దీనిలో చిన్న అక్షరాలతో 607 పుటలున్నాయి. ఈ గ్రంథంలో శరీర రచనా విజ్ఞానం, భేషజ వర్గీకరణం, రోగోత్పత్తి, రోగ నిశ్చయం, చికిత్సాఖండం ఉన్నాయి. చికిత్సాఖండంలో సూర్యకిరణచికిత్స, వాయు చికిత్స, పావకోపచారం జలోపచారం మొదలయిన వాటితో పాటు, ఓదార్చుట, మంత్రచికిత్స, హవన చికిత్స కూడా ఉన్నాయి. ఇపుడు నర్సులు చేసే ఉపచారాలు కూడా అథర్వవేదంలో ఉన్నాయన్నమాట.

గదచికిత్స, మానసిక చికిత్స, క్రిమిరోగ చికిత్స, రసాయన వాజీకరణ చికిత్సలు, విషచికిత్సలు,

పశురోగ చికిత్సలు, యక్ష్మ చికిత్సలు, అథర్వవేదంలో ఉన్నాయి. అందుకే "ఇహాఖలు ఆయుర్వేదము పాంగమ అథర్వ వేదస్య" అని గొప్ప ఆయుర్వేద వైద్యుడైన సుశ్రుతుడు చెప్పాడు.

ద్విప్రకారావ్యాధయః ఆహార నిమిత్తం అశుభనిమిత్తాశ్చేతి. తత్రాహార సముత్థానాం వైషమ్య మాయుర్వైదశ్చకార, అధర్మసముత్థానాం శాస్త్రమిదముచ్యతే" అని కౌశిక సూత్రము చెప్పింది.

అథర్వవేదంలో శాంతిపుష్టికర్మల గురించి 160 పెద్దపుటలు పరిశోధన గ్రంథం ఉంది. దీనిని వారణసేతు సంస్కృత విశ్వవిదాయలయం ప్రకటించింది. ఈ గ్రంథాన్ని వ్రాసినవారు డాక్టర్ మాయామాలవీయ.

పుష్టిని కోరేవారు దేవతలను స్తుతించి ఉదంబరమణిని ధరించాలి (19-31) గృహజనులతో సహృదయం, సౌమనస్యం కలిగించడం కోసం మంత్రాలతో ప్రక్రియ ఉంది. కోపం తొలగడం కోసం సౌమనస్య కోసం మంత్రాలు ప్రక్రియ ఉన్నాయి (6-42). రోగాలు తొలగడానికి దీర్ఘాయుఃప్రాప్తికి మంత్రాలు, ప్రక్రియలు ఉన్నాయి. హృదయరోగం, పాండురోగం, చికిత్సలు, ఔషధులతో కుష్ఠవ్యాధి చికిత్స (1-23-24) నెరసిన జుట్టు నల్లబడడం కోసం ప్రార్థన (1-23-1-2) రోగి అన్ని అవయవాల నుండి రోగాలను తొలగించాలని ప్రార్థించే సూక్తం (2-33) క్షేత్రియ రోగాన్ని తొలగించే సూక్తం, యక్ష్మాన్ని తొలగించడం, ఆయుష్యం కలిగించడం కోసం సూక్తం (3-11) యక్ష్మ చికిత్స (4-13) కాస వ్యాధిని నివృత్తి కోసం ప్రక్రియ (6-105) కర్ణశూల, విలోహితం, దీర్ఘజ్వరం, యక్ష్మ బలాసాది రోగాల నివారణం (6-8) ఆయుష్యం, వర్చస్సు, వీర్యం వీటి కోసం ప్రక్రియ (1-35) సురక్షిత ప్రసవం కోసం ప్రక్రియ (1-11) వీరపుత్రుడు పుట్టటం కోసం ప్రక్రియ (3-23) భార్య ప్రేమకోసం ప్రక్రియ (3-25) గర్భదృంహణం అంటే తొమ్మిది నెలలు నిండకుండా ముందే శిశువు జన్మించే దోషనివృత్తికి ప్రక్రియ (6-17) భార్య భర్త ప్రేమ తన పైనే ఉండేలా చేసుకునే ప్రక్రియ (7-37,38) శాంతి కర్మలు, ఆపదలు తొలగడం కోసం, శుభప్రాప్తి కోసం, ప్రక్రియ భయాన్ని కలిగించే వన్య పశువుల పీడ, చోరపీడలకు ప్రతీకారం (4-3) సర్పాల నుండి రక్షణ కోసం ప్రక్రియ ఉన్నాయి (6-56).

సభలో సాఫల్య ప్రాప్తికి (7-12-13) ఉంది. ఖదిర వృక్షంపై మొలిచిన రావిచెట్టు సాహాయ్యంతో శత్రునివారణానికి చెందిన ప్రక్రియ ఉంది. (3-6)

గోపథ బ్రాహ్మణం అథర్వవేదానికి బ్రాహ్మణం. దానిలో సంతానం, పశువులు, సమృద్ధి, ఆయుష్యం, సర్వకామప్రాప్తి, అధికారం మొదలయిన వాటికి ప్రక్రియలున్నాయి. అధికారం కోసం చేసే ప్రక్రియను ఉద్యోగప్రాప్తికి వాడవచ్చు. వేద విధానాధ్యాయాలున్నాయి. వాటిలో యజ్ఞాలలో మాత్రమే కాకుండా విడిగా వేదమంత్రాలకు వినియోగాలున్నాయి. వాటిలో అథర్వవేద విధానమొకటి.

శాంతాతేయగణం కొన్ని మంత్రాల సమూహం. దీనిని అథర్వవేదభాష్యంలో పేర్కొన్నారు. ఆ మంత్రాలతో హోమం చేస్తే శాంతి కలుగుతుంది. భైషజ్యగణ మంత్రాలతో హోమం చేస్తే రోగాలను తొలగించగలుగుతారు. త్రిసప్తేయ గణమంత్రాలతో హోమం చేస్తే అన్ని పాపాలు పోతాయి. అభయగణమంత్ర హోమం చేస్తే ఎక్కడా భయముండదు. అపరాజిత గణమంత్రాలతో హోమం చేస్తే పరాజయముండదు.

**శ్లో. ఆయుష్యఇ్చ గణం హుత్వా అపమృత్యుంవ్యపోహతి**

**.....................................................**

**శ్రేయసాయోగమాప్నోతి శర్మవర్మ గణః తథా**

**వాస్తోష్పత్య గణం హుత్వా వాస్తుదోషాన్ వ్యపోహతి**

ఆయుష్య గణ మంత్రాలతో హోమం చేస్తే అపమృత్యువు తొలగుతుంది. స్వస్త్యయన గణమంత్రాలతో హోమం చేస్తే క్షేమం కలుగుతుంది. శర్మవర్మగణమంత్రాలతో హోమం చేస్తే శ్రేయస్సు కలుగుతుంది. వాస్తుదోషాలు పోవడానికి వాస్తోష్పత్యగణమంత్రాలతో హోమం చేయాలి.

గోవుల వృద్ధి కోసం, వాటిని పెద్దపులుల నుండి రక్షించడం కోసం ప్రక్రియ, కౌశిక సూత్రంలో ఉంది. (51-1) అపామార్గం (ఉత్తరేణి)తో చెడుకలల నివారణం, రాక్షసబాధానివారణం చేసే ప్రక్రియలున్నాయి. (4-17) సర్పాల నుండి రక్షణం కోసం ప్రక్రియ ఉంది. (6-56).

"చరక సంహితలో వైద్యునికి అథర్వవేదమందు విశేషభక్తి ఉండాలి" అని ఉంది. అథర్వవేదంలో ఓషధుల విజ్ఞానముంది. మధూకమనే ఓషధి భక్షణంచే మధుర వాక్కు కలుగుతుంది (అథర్వ 1-34). అయితే ఈ వేదంలో ప్రతి ఓషధి వినియోగంలో మంత్రం కూడా ఉంది. తంత్రరూపంలో ఓషధి వినియోగం మొదలయినవి ఉంటాయి. వాటిని సూత్ర గ్రంథాలు వివరించాయి.

గొడ్డలిని అగ్ని యందు కాల్చి దానిని నీటిలో ఉంచితే వెచ్చబడిన నీరు శీతజ్వర, సంతత జ్వర, వేలా జ్వరములు వచ్చువానికి స్నానానికి ఉపయోగిస్తే జ్వరశాంతి కలుగుతుంది.

శ్వేతకుష్ఠం తొలగించడానికి భృంగరాజము, హరిద్ర, ఇంద్రవారుణి, నీలిఓషధులు పిండిచేసి వ్యాధి ఉన్నచోట రుద్ది పూయాలి.

వజ్రకంటక కాండానికి రంధ్రం చేసి, దానికి హరిద్రనుంచి, దానిని వజ్రకంటక కాండలతో కప్పి ఏడురోజులతో ఆ హరిద్రను తీసి ఎండబెట్టి దానిని నీటిలో కలిపి, ఆ గంధం పూయడం చేత శ్వేత కుష్ఠవ్యాధి తగ్గుతుందని వస్తు గుణదీపికలో ఉంది. వజ్రకంటక పదానికి జెముడు, గొలిమిడి అనే అర్థాలున్నాయి. వీటిలో ఏది ఉపయోగించాలి అనే విషయం సంప్రదాయ వైద్యుల ద్వారా గ్రహించాలి.

మోదుగ ఆకులతో నిర్మించిన మణిని తేజస్సు, బలం, ఆయువు మొదలయిన వాటి వృద్ధి కోసం ధరించాలి (3-1-5) బ్రహ్మచారిని మోదుగ దండం ధరించమనడానికి దీనికి సంబంధం కలదేమో పరిశీలించాలి)

క్షేత్రియవ్యాధి నివృత్తి కోసం లేడి కొమ్ము మణిని చేతికి ధరించడం, ఆ కొమ్ముతో నీరు త్రాగడం, ఆశృఙ్గఛిద్రం ఉండే లేడిచర్మను అంటించి, దానిని నీటిలో పడవేసి ఆ నీటిని వ్యాధిగ్రస్తుని పై చల్లడం చేయాలి.

వరణ ఒక వృక్షం. అది కలిగినది వరణావతి. దాని యందలి నీరు విషహరం. ఆ జలంలో అమృతం ఉంది. ఆ నీరు కందమూలాదుల్లో ఉన్న విషాన్ని హరిస్తుంది. (అథర్వ 4-2-7-2)

త్రికకుత్ అనే పర్వతం ఉంది. దాని యందు గల ఆంజనం రోగరాహిత్యం, చిరకాల జీవనం కలిగిస్తుంది. ఆంజనం చేత మనుష్యులకు గోవులకు, గుర్రములకు రక్షణం కలుగుతుంది. ఈ ఆంజనంపాండు మొదలయిన రోగాల వలన వచ్చిన నలుపుదనం తగ్గిస్తుంది. (అథర్వ 4-2, 9-1,2,3)

ఈ ఆంజనం తక్మ అనే తీవ్రజ్వరాన్ని, సన్నిపాతాన్ని సర్వవిషవికారాలను తొలగిస్తుంది. ఈ త్రికకుత్పర్వతము హిమవత్పర్వతముపై ఉంది.

శంఖమణి రోగాన్ని తొలగిస్తుంది. (4-2-10-3) ఇది ఆయుర్దాయాన్ని వృద్ధి పొందిస్తుంది. (10-2-10-4) ఆయుధం వల్ల రక్తం కారుతూంటే ఉషఃకాలంలో కాచిన లాక్షోనకం ఆ గాయంపై చల్లాలి. ఘృతదుగ్ధం అతనిచే త్రాగించాలి. ఘృత దుగ్ధాన్ని గాయంపైన పూయాలి. (4-3-12-1) లాక్ష అనే ఓషధి, దెబ్బచే విడినడిన లోమాన్ని లోమంతోను, చర్మాన్ని చర్మంతోను, అవయవాల్ని అవయముతోను కలుపుతుంది. (4-3-12-2,5)

ఆకలిదప్పులు తగ్గడం, సంతానం లేకపోవడం అనేవి అపామార్గం తగ్గుతాయి. (4-4-17-6) సదం పుష్ప అనే ఓషధిమణిని ధరిస్తే, రాబోయే భయానికి కారణాన్ని తొలగించడం, ఇప్పుడున్న భయానికి కారణం తొలగించడం అతనికి తెలుస్తాయి. భయానికి కారణాలు తెలియడం వల్ల అతడు జాగరూకుడుగా ఉండడం వల్ల అతనిని భయహేతువులు చేరవు.

ఇతర ఓషధీలతల కంటె సోమలత ఉత్కృష్టం. వృక్షౌషధులలో పలాశం గొప్పది. (6-2-15-3)

జుట్టు వృద్ధి పొందాలని కోరేవాడు. విభీతకక్వాథంతో ఉషఃకాలంలో జుట్టును తడపాలి. విభీతకం అంటే తాడి క్వాథం అంటే బాగా కాచినది.

పుష్టిని కోరేవాడు పలాశమణిని ధరించాలి. ముంజుగడ్డి జ్వరం అతిసారం నివారిస్తుందని ఈ మంత్రం చెబుతోంది.

**మం. యథాద్యాఇ్చ పృథివీ ఇ్చాన్త స్తిష్ఠతే తేజసమ్**

**ఏతా రోగం చాస్రావం చాన్త స్తిష్ఠతు ముఇ్జ**

(పృథివీద్యులోకాల మధ్య తేజస్సు ఉన్నట్లు జ్వర ఆస్రావాది రోగాల ఉపశమనానికి ముఇ్చ ఉంది.)

ఈ ముంజ మొదలుతో కూడిన పాదుకషాయంచే మేహం తగ్గుతుంది. ఇది మూలరోగం నివారిస్తుంది. విసర్పి, రక్తదోషం, నేత్రరోగం తగ్గుతాయని వస్తుగుణధీపిక తెల్పింది.

**మం. శంనో దేవీ పృశ్ని పర్ణ్యశం నిర్‌ఋత్యాలకః**

**ఉగ్రాహి కణ్వ జమ్భనీతానుభక్షి సహస్వతీమ్ (2-25-1)**

ఈ మంత్రం నుండి ఐదు మంత్రాలలో పృశ్నిపర్ణి వాత పిత్త కఫదోషాలను తొలగిస్తుందని ఉంది. ఇది రోగమూలకారణాన్ని నిర్మూలిస్తుంది. శ్వాస, కాస, జ్వరాలను, జ్వరసంబంధమయిన దాహతాపాలను, మేహవాతం వలన కలిగే పీడలను, రక్తసంబంధమయిన వ్యాధులను, పృశ్ని పర్ణి నివారిస్తుందని వస్తు గుణదీపిక చెప్పింది.

మనుష్యునకు వీర్యవృద్ధికి వెలగ వేరు ఉపయోగిస్తుందని ఈ మంత్రం తెలుపుతోంది.

**మం. ఉచ్ఛుష్మౌషధీనాం సార ఋషభాణామ్**

**సంపుంసోమింద్ర వృష్ణ్య మస్మిన్ దేహి తనూవశిన్**

**అపాంరసః ప్రథమజోఽ థో నన్త స్వతీనామ్**

**ఉత సోమస్య భ్రాతా స్యుతార్మమసి నృష్ణ్యమ్. (4-4-5)**

ఓ కపిత్థమూలమా! వీర్యముతో కూడిన ఓషధులలో నీవు వీర్యరూపానివి. ఋషభ సారభూతమయిన ఓషధివి. వీర్యముతో కూడిన వానినిగా చేయుము). ఇలా అథర్వవేదం కపిత్థ మూలాన్ని చాలా ప్రశంసించింది. నాలుగవ కాండలో నాల్గవసూక్త మీ ప్రశంసను వెల్లడిస్తుంది.

పతనం, అతీసారం, హిక్క, గ్రహణి అనే రోగాలను వెలగ నివారిస్తుంది. శిరోవేదనను, మూత్రద్వారశూలను పోగొడుతుంది. జ్వరతాపాన్ని, విషాన్ని హరిస్తుంది. మూలవ్యాధిని నివారిస్తుంది. ఉదరబాధను హరిస్తుంది. స్త్రీలకు పాలను వృద్ధి చేస్తుంది అని వస్తుగుణదీపిక వివరించింది. అనుపాన భేదాన్ని బట్టి ఒక ఔషధాన్ని అనేక వ్యాధులకు వాడుట వస్తుగుణదీపికలో కనబడుతుంది. వేదపురుషుడు ఏ అనుపానాలను ఉద్దేశించాడో మనకు తెలియదు. ఈ విషయాలను బాగా పరిశోధించాలి.

**మం. క్షుధామారం తృష్ణామార మగోతా మనపత్యతామ్**

**అపామార్గత్వయా వయం సర్వం తదపన్మృజ్మహే**

ఆకలిచేత, దప్పికచేత కలిగే మరణాన్ని అపామార్గం తొలగిస్తుంది. సంతానరాహిత్యాన్ని దూరం చేస్తుంది. గోవులు లేకుండుటను పోగొడుతుంది. (4-17-6).

నేత్ర, ఉదర, చర్మ, జిహ్వా, కర్ణ, కఫ, రక్తమూల, శూల, కుష్ఠ, మూత్రపిండ, గుద సంబంధ రోగాలు మొదలయిన అనేక రోగాలను అపామార్గం నివారిస్తుందని వస్తుగుణదీపిక చెప్పింది.

ఇక్కడ ఓషధులు, వాటి గుణాలు కొంతవరకు చెప్పారు. వీటిని గుర్తించి పరిశోధన చేస్తే ఆయుర్వేదంలో అథర్వ చికిత్స అనే విభాగం బయలుదేరవచ్చు.

త్రివేది తంగిరాల బాలగంగాధరశాస్త్రి గారు కపిలేశ్వరం పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. వారికి నా అథర్వవేదానువాదం 17, 18, 20 కాండలు వినిపించాను. అపుడు తాము అథర్వవేద పద్ధతిలో చికిత్స చేస్తున్నామని చెప్పారు.

## కంచి శ్రీ మహాస్వామి చెప్పిన రామాయణము



**శ్రీ రామం రఘుకుల తిలకం ॥**
**శివధనుసాగృహత సీతా హస్తకరం ॥**

**అంగుళ్య ఆభారణ శోభితం ॥**
**చూడామణి దర్శనకరం ॥**

**ఆంజనేయ మాశ్రయం ॥**
**వైదేహీ మనోహరం ॥**
**వానర సైన్య సేవితం ।**
**సర్వమంగళ కారుణ్య అనుకూలం**
**సతతం శ్రీరామచంద్ర పాలయమామ్ ॥**
**శ్రీరామ జయరామ జయ శ్రీరామ ॥**



# నమామి ఆదిశంకరమ్

**డా.పాతూరి సుబ్రహ్మణ్యకవి**
**అధ్యాపకులు,** M.Sc., M.Phil
**తెనాలి – 522 201, చరవాణి : 8096017553**

అద్వైత వేదాంతమును బోధించిన శంకరాచార్యులు జగద్గురువయ్యారు. కేరళలోని కాలడిలో జన్మించిన శంకరాచార్యులు సాక్షాత్ మహాశివునవతారమని జనుల విశ్వాసము. 'బ్రహ్మసత్యం జగన్మిథ్య' అన్నదే అద్వైత సిద్ధాంతము. వైదిక ధర్మమును, అఖండ భారతావనిలో ఎల్లరకు విశదపరచి, భక్తిజ్ఞాన వైరాగ్యముల ద్వారా జీవన్ముక్తిని సాధించు మార్గమునుపదేశించారు. జగన్మిథ్య అనగా, జగత్తు లేదను అర్థమునగాక, పరమాత్మునిలో కలిసి వేరుగాకయున్నదను నర్థము గ్రహింపవలసి యున్నది. శక్తి, శివ, విష్ణుమూర్తుల భేదముగా నున్నవారు, ఉపాసన యందు భేదమొందినను, జ్ఞానచింత కల్గిన వారికి, అభేదరూపులై యున్నారు. బ్రహ్మయే సత్యము, జ్ఞానమనగా, సత్యము బ్రహ్మ, అది జ్ఞానము వలన గోచరమగునని అద్వైతభావము. శృంగేరీ జగద్గురువులు శ్రీ భారతీతీర్థమహాస్వాములవారు, శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతయు, వేదవ్యాసులవారి బ్రహ్మ సూత్రములను అద్వైత వేదాంతమునే తెలుపునని, దానిని ప్రజలకు సుగమం చేసినవారు ఆదిశంకరులని అనుగ్రహించియున్నారు.

'వేదస్యహి నిరపేక్షమ్ ప్రామాణ్యం రవేరివరూపశయే' వేదమే, అద్వైతమునకు ప్రామాణ్యము. పరమాత్ముని సరిపోలినవాడులేడని, పారమార్థిక, వ్యావహారిక, ప్రాతిభాసిక, సత్యములతో జగత్తు నిండి యున్నది. కనుక 'మిథ్య' అనగా శూన్యము, అబద్ధమని గాక, ఇది అని నిర్ధారించుట సాధ్యము కానిదగా తెలియనగును.

స్మార్త మనగా, స్మృతి సంబంధమైనది వేదము. జీవాత్మ పరమాత్మల ఏకత్వమే శంకరాచార్యుల వారి, అద్వైత సిద్ధాంత మూలము, వేదసారము.

'బ్రహ్మ సత్యం జగన్మిథ్య జీవోబ్రహ్మైవ నాపరః' అను ఆదిశంకరాచార్యుల ప్రబోధము, అర్థమగును. ఉన్నది ఒకటే, రెండవది లేదు, అదియే సత్యమగు బ్రహ్మ. ఇది అలౌకికమగునది, కాని లౌకికమగు మతము కాదు, సిద్ధాంతము. ప్రజలకు సరళముగా తెల్పిన శ్రీమద్రామానుజుల,

విశిష్టాద్వైతము, శ్రీమధ్వాచార్యుల ద్వైతము, శంకరుల అద్వైతము నుండి ఏర్పడినవి. ఆచార్యులవారి ప్రబోధములు. సత్క్రమ జీవనమునకు, ఆధ్యాత్మికత పెంపొనరించుటకు, సర్వమానవ శ్రేయస్సుకు లక్ష్యములు. పోతన, పరమాత్మను ఈశునిగా భావిస్తాడు. వెదుకంగానేల యీయాఎడనంటూ సర్వవ్యాపియైన భగవానుని స్మరిస్తాడు. ముముక్షువులకు నీనాభేదముండదు, తమలోని దైవాన్ని అందరిలో దర్శిస్తారు.

భగవద్భక్తులై తరించిన వారి అంతరార్థమిదియే. ఇది తెలిసికొన్నచో,ఘ విరపథబు, పదము సాక్షాత్కారమౌతాయన్నది నిస్సందేహము.

నమామి ఆదిశంకరమ్

సీ. బ్రహ్మసూత్రములకు భాష్యకారుండన
ప్రకరణంబులకుఁ బ్రభాకరుండు
విధి విద్యల గరపు వేల్పుగురుండను
బ్రహ్మవిష్ణు మహేశ్వర గుణయుతుండు
అజ్ఞాన తిమిరంబు నాదిత్యుఁడు కనక
ధారలఁ గురియించు ధార్మికుండు
సర్వజ్ఞ పీఠంబు శారదా దీధితిన్
అధిరోహణ మొనర్చు నాదిభవుడు

తే.గీ. బ్రహ్మసత్యం జగన్మిధ్య బ్రహ్మ యెయగు
జీవుడన్నట్టి యద్వైత చిత్స్వరూపు
డాది శంకరుండనఘుండు నాత్మ దర్శ
యిత్రునెపుడునే నమింతు మయికొని మదిని!



# శ్రీమద్భాగవతము - సప్తాహపారాయణ మాహాత్మ్యము

**శ్రీమతి కూనిసెట్టి (చలవాది) స్వరాజ్యలక్ష్మి**
చరవాణి : 9440766251

**నిగమ కల్పతరోః గళితం ఫలం**
**శుకముఖా దమృత ద్రవ సంయుతం ।**
**పిబత భాగవతం రసమాలయం**
**ముహురహో రసికా భువి భావుకాః ॥**

శ్రీమత్ భక్తియుక్తుడగు పరీక్షిన్మహారాజు శృంగి మహర్షి యొక్క శాపమునకు గురియై, మరణ మాసన్నమైనందున "ఏ విధివిధానముల నాచరించినచో జన్మ చరితార్థముకాగలదో సెలవీయుడని" మహర్షులను కోరెను. ఆ సమయమున భగవత్ప్రేరణవలన అచటకు శ్రీశుకమహర్షి వచ్చిరి. వచ్చిన ఆ మహర్షిని మహారాజు, **"యత్శ్రోతవ్యం అథోజప్యం, యత్కర్తవ్యం నృభిః ప్రభో । స్మర్తవ్యం భజనీయంవా బ్రూహి యద్వా విపర్యయం"** ఓ మహానుభావా ! ముముక్షువులైనవారు, మరణమాసన్నమైనవారు, ఎవరిని జపించవలెను? ఎవరిని స్మరింపవలెను? ఏమి చేయవలెనో? ఏమి చేయతగదో ?" తెలుపుమని ప్రార్థించెను. అప్పుడు శ్రీశుకమహర్షి శ్రీమత్భాగవతమును ఆ మహారాజునకు ఏడురోజులు వినిపించెను. నిర్మలహృదయముతో ఆకర్ణించిన మహారాజు పునరావృత్తిరహితమైన విష్ణుసన్నిధిని చేరెను. ఈ విషయమై భాగవతమాహాత్మ్యమును గూర్చి పద్మపురాణము నందు గల ఇతివృత్తమును తెలిసికొందుము.

**"స్వర్గే సత్యే చ కైలాసే వైకుంఠే నాస్త్యయం రసః ।**
**అతః పిబంతు సద్భాగ్యా మా మాముంచత కర్హిచిత్" ॥**

గొప్పదగు భక్తి రసామృతము స్వర్గలోకము నందుకాని, సత్యలోకమునందు కాని, కైలాసమునకాని, వైకుంఠమున కాని లభింపదు. కనుక భగవద్భకులైన భాగ్యవంతులైన మీరు ఎల్లప్పుడు ఈ రసమును విడువక పానము చేయుడు" – అని శ్రీ శుకుని వచనము. సప్తాహయజ్ఞము నందు తరించిన "దుంధుకారి" కథను తెలిసికొందుము.

పూర్వము తుంగభద్రానదీ తీరమున ఒక గొప్ప పట్టణము కలదు. అచట అన్ని వర్ణముల వారు తమతమ వర్ణాశ్రమ ధర్మములను చక్కగ నిర్వర్తించుచు జీవనము గడుపుచుండిరి. ఆ పట్టణమున శ్రౌత, స్మార్త కర్మలయందు నిష్ణాతుడైన ధర్మనిరతుడైన ఆత్మదేవుడను భూసురుడు నివసించు చుండెను. ఉత్తమ వంశ సంజాత, సౌందర్యవతి అగు ఆతని భార్య దుంధులి. ఎంత సౌందర్యవంతురాలో

అంతకు మించిన హఠస్వభావము, కలహస్వభావము, లోభితనము మొదలగు చెడు గుణములకు కూడ ఆమె నిలయము. సకల సంపదలు, భోగ భాగ్యములు ఉన్నను సంతతి లేని కారణమున వారు బాధపడుచుండెడివారు. సంతతి కొరకు ఎన్నియో దానధర్మములు చేసిరి. కాని సంతానము కలుగలేదు. ఆ కారణమున ఆత్మదేవుడు మిగుల దుఃఖించి, ఇల్లు వదలి వనమునకు వెళ్ళెను. మార్గాయాసముతో దప్పిక తీర్చుకొనుటకై చెరువు వద్దకు చేరి, తృప్తిగ నీరుత్రావి, అచటనే కొంచెము సేద తీరుటకై కూర్చుండెను. ఆ సమయమున ఒక సన్న్యాసిని అచట చూచి అతని వద్దకు వెళ్ళి, నమస్కరించి, దీర్ఘముగ నిట్టూర్చుచు, నిలచెను. సన్యాసి బ్రాహ్మణుని చూచి, అతని విచారమునకు కారణము చెప్పమని కోరెను.

అప్పుడా బ్రాహ్మణుడు తన వృత్తాంతమంతయు తెల్పి, "సంతానహీనుడను, దురదృష్ట వంతుడనైను నేను జీవించుట ఎందులకు"అని దీనముగ విలపించెను. దయాహృదయుడగు ఆ సన్న్యాసి, "ఓ బ్రాహ్మణా! నేనిపుడు నీ ప్రారబ్ధమును తిలకించితిని. కర్మగతి ప్రబలమైనది. వివేకముతో జీవించుము. సంసార వ్యామోహమును విడిచిపెట్టుము. నీకు ఏడు జన్మల వరకు సంతాన యోగ్యతలేదు" అని చెప్పెను. ఆ సన్న్యాసి మాటలు ఆలకించిన బ్రాహ్మణుడు "నాకెట్లైనను సంతతిని ప్రసాదింపుము. లేనిచో మీ ఎదుటనే ప్రాణత్యాగము చేసెద"నని ప్రార్థింపసాగెను. అతని స్థితికి జాలిపడి, "దైవమే మానవుని ప్రయత్నమును అణచి వేసినప్పుడు మనిషికి సుఖము చేకూరదు. చిత్రకేతువు అనురాజు విధివ్రాతను తుడిచి పెట్టుటకై ప్రయత్నించి, పెక్కు కష్టములను అనుభవించెను. నీకును సంతతి వలన సుఖము లేదు, నీ మొండితనమును వీడుటలేదు"అని పల్కి, ఆ బ్రాహ్మణుని పట్టుదలను చూచి, ఒక ఫలమును ప్రసాదించెను. ఆతనితో "దీనిని నీభార్యకు తినిపింపుము. ఆమెకు ఒక కుమారుడు కలుగును. కాని నీభార్య ఒక సంవత్సరము పాటు ఏకభుక్తముతో, సదాచారముతో, సద్గుణములతో ప్రవర్తింపవలెను. అట్లు నడచు కొన్నచో ఉత్తమస్వభావుడైన పుత్రుడు జన్మించును" అని చెప్పి వెడలిపోయెను. బ్రాహ్మణుడును సంతోషముతో ఇంటికి వచ్చి, భార్యకు విషయము, నియమములు చెప్పి, ఫలమును ఇచ్చెను.

కుటిల స్వభావురాలగు ఆ ధుంధులి ఫలము తినుటకు ఇష్టపడక, "ఫలము తిన్నచో గర్భము వచ్చును, దానివలన పొట్ట పెరుగును. దానివలన నేను తినలేక త్రాగలేక అసక్తురాలనగుదును. ప్రసవ సమయమున బాధలు కల్గును." ఇట్లు కలుగబోవు కష్టములను ఆలోచించి ఫలమును భుజింపలేదు. 'ఫలమును భుజించితివా' అని అడిగిన భర్తకు "భుజించితి'నని సమాదానమిచ్చెను.

ఇట్లుండగ ఒకనాడు ఆమె సోదరి అక్క యింటికి వచ్చినది. కృశించిన అక్కను చూచి కారణమడిగి, తెలిసికొని, ఒక ఉపాయము తెల్పినది. "నీవు ఈ పండు ఆవుకు తినిపింపు. నీవు గర్భవతిగ నటించుము. నాకు పుట్టిన బిడ్డను నీకు ఇత్తును. నా భర్తకు కొంత ధనము ఇమ్ము. నాకు

పుట్టిన బిడ్డడు మరణించెనని చెప్పెదము. ప్రతిరోజు మీ యింటికి వచ్చి బిడ్డ లాలన, పాలన చూచెదను. నీవు దిగులుపడకు" అని చెప్పి వెడలెను. కొంతకాలమునకు చెల్లికి పుట్టిన బిడ్డను మరది తెచ్చియిచ్చెను. ధుంధులి తనకు "బిడ్డ పుట్టెనని, సుఖప్రసవమైనదని" భర్తకు తెల్పెను. సంతోషముతో బ్రాహ్మణుడు బిడ్డకు జాతకకర్మ సంస్కారము జరిపి, **ధుందుకారి**' అని నామకరణము చేసి, పలువిధముల దానధర్మములను చేసెను. మూడు నెలలు గడిచిన పిదప వారి యింటనున్న ఆవునకు, సర్వాంగ సుందరుడు, ఆవుచెవులు వంటి చెవులు కల ఒక బాలుడు జన్మించెను. ఆత్మదేవుని ఆనందమునకు అవధి లేదు. ఊరివారందరు ఆశ్చర్యముతో ఆ బాలుని చూచి, ఆత్మదేవుని భాగ్యమును కొనియాడిరి. ఆత్మదేవుడు బాలునికి **"గోకర్ణ"**దని నామకరణము చేసి, తనబిడ్డగ పెంచసాగెను. కొంతకాలమునకు బాలకులు ఇరువురు యౌవన దశకు చేరిరి. గోకర్ణుడు జ్ఞానవంతుడు విద్వాంసుడు, సకల సద్గుణవంతుడు అయ్యెను. ధుంధుకారి సర్వ అవలక్షణశోభితుడై, తల్లిదండ్రులకు దుఃఖకారకుడు అయ్యెను. వేశ్యల యందు ఆసక్తుడై తండ్రి సంపదనంతయు నాశన మొనర్చ సాగెను. తల్లిదండ్రులను కొట్టి ఇంటిలోని సామగ్రినంతయు స్వయముగ అపహరించి వేశ్య వాటికకు చేరెను.

ఆత్మదేవుడు దుర్వర్తనుడైన పుత్రుని తలచుకొని వ్యథ చెంది, "వీడి తల్లి గొడ్రాలైనను సమంజసముగా నుండెడిది. ఇట్టి దుష్టుడైన కుమారుని వలన దుఃఖమే మిగిలిన"దని పలువిధముల వ్యధనొందెను. ఆ సమయమున జ్ఞానవంతుడైన గోకర్ణుడు తండ్రికి "సంసారము నందలి మోహమును వదులును. ప్రేమకు బద్ధుడైన వానికి సుఖము ఉండదు. వైరాగ్యవంతునకు, మునికి, ఏకాంత జీవికి మాత్రమే సుఖము లభించును. సమస్తమును త్యజించి వనములకు వెళ్ళి, ఆత్మ దర్శనమునకై యత్నింపుము"అని ఉపదేశించెను. పుత్రుని పల్కులు ఆలకించిన ఆత్మదేవుడు ఇంటిని విడిచి, వనముల చేరి, భగవత్ సేవతో జీవింపసాగెను. తండ్రి అడవులకు వెళ్ళిన పిదప ధుంధుకారి తల్లిని బెదిరించి, ధనమును తీసికొని పోసాగెను. కుమారుని హింసలకు తాళలేక తల్లి ఒక రాత్రి బావిలో పడి మరణించెను. గోకర్ణుడు జ్ఞానాశక్తుడై తీర్థయాత్రలకు వెళ్ళెను.

ధుంధుకారి ఐదుగురు వేశ్యలతో తన యింటనే నివసింప సాగెను. పిత్రార్జితము కరిగిపోయినది. వేశ్యలు ధుంధుకారిని ధనమునకై వేధింపసాగిరి. వారికోర్కెలు తీర్చుటకు ధుంధుకారి దొంగతనము చేయసాగెను. ఒకదినము పెక్కు ధనముతో యింటికి వచ్చిన ధుంధుకారిని చూచి, "ఇతడు ప్రతిదినము దొంగతనము చేయుచున్నాడు. ఏదో ఒకరోజు రాజభటులకు చిక్కినచో తప్పక మరణ దండన విధింతురు. ఈధనము రాజు స్వాధీనము చేసికొనును. కనుక మనము ఈతనిని చంపుదుము. సొమ్మును స్వాధీనము చేసికొని, మనము ఎచ్చటకైనను పోవుదము" అని ఆలోచించిరి. ఆతనిపై నిప్పులు పోసి తగులబెట్టి, శరీరమును పాతిపెట్టిరి. తమ ప్రియుడు, "ధనలోభముచే చాల దూరము వెళ్ళినాడు. ఒక సంవత్సరములో వచ్చునని" అడిగిన వారలకు చెప్పుచు, వారును ధనమును

తీసికొని వెడలి పోయిరి.

ధుంధుకారి చెడు పనులు చేయుటవలన ప్రేత రూపము పొందెను. "వాత రూపధరో నిత్యం ధావన్ దశదిశోంతరం" సుడిగాలి రూపముతో దశదిశలు తిరుగుచుండెను. ఆకలి దప్పులతో బాధ పడుచు, చలికి ఎండకు విలపించుచు, దైవమును స్మరించుచు మాటిమాటికి వ్యథ నొందుచుండెను. కొంతకాలము గడచెను. ధుంధుకారి మరణవార్త విన్న గోకర్ణుడు ఆతనికి గయయందు శ్రాద్ధకర్మలను ఆచరించెను. పుణ్యక్షేత్రములను దర్శించినపుడు ప్రతిక్షేత్రమున శ్రాద్ధకర్మలు చేసెను. ఈ విధముగ చేయుచు గోకర్ణుడు ఒకనాడు తన యింటికి చేరి, తన యింటిముంగిట నిద్రింపసాగెను.

నిద్రించుచున్న సోదరునకు ధుంధుకారి తన వికృతరూపములను చూపింపసాగెను. ఏనుగువలె, పోటేలువలె, దున్నపోతువలె, ఇంద్రునివలె, అగ్నివలె మారుచు చివరకు మానవాకారములో కనిపించెను. ఆ ప్రేతమును చూచిన గోకర్ణుడు, "నీవు ఎవ్వరవు. రాత్రులందు ఇట్టి భయంకరాకారములను ఎందులకు చూపుచుంటివి. నీవు పిశాచివా? రాక్షసుడవా? నాకు వాస్తవము తెల్పుము" అని పలికెను.

గోకర్ణుడు అట్లు ప్రశ్నింపగా ధుంధుకారి పల్కుటకు అశక్తుడై సైగలు చేయుచు బిగ్గరగా ఏడ్వసాగెను. అపుడు గోకర్ణుడు అభిమంత్రించిన నీటిని ధుంధుకారిపై చల్లెను. కొంత పాపము ఉపశమించి, అతడు ఇట్లు చెప్పెను "నేను నీ సోదరుడనైన ధుంధుకారిని. బ్రాహ్మణత్వము నశింపచేసి కొని, పెక్కు దుష్కార్యముల నొనరించితిని. వేశ్య వనితలు నన్ను అనేక విధముల హింసించి, పీడించి వధించిరి. ప్రేతత్వమును పొందిన నేను దుర్గతితో, వాయు భక్షణతో జీవించుచుంటిని. సోదరా! నీవు కరుణామయుడవు. నాకు ఈ ప్రేతత్వము నుండి త్వరగా ముక్తి ప్రసాదింపుము" అని వేడుకొనెను. అపుడు గోకర్ణుడు గయా శ్రాద్ధమువలన కూడ నీకు ముక్తి కలుగలేదు. వేరొక ఉపాయము లేదని నా అభిప్రాయము. నేనేమి చేయవలెనో నీవే విశదీకరింపుము" అని పల్కెను. ఆ మాటలకు ప్రేతము, "గయలో వందసార్లు శ్రాద్ధమొనర్చినను నాకు ముక్తి కల్గుట అసంభవము. ఇందుకు తగిన వేరొక ఉపాయమును నీవే ఆలోచింపవలెను" అని వేడుకొనెను. ఆ ప్రేతము పల్కులాకర్ణించిన గోకర్ణుడు, "నీకు ముక్తి లభించుట అసంభవమే. కానిమ్ము నీవు నిర్భయుడవై నీవుండి చోటునే ఉండుము. నీ ముక్తికై నేను ఆలోచింతు"నని పల్కెను. ధుంధుకారి సోదరుని మాటలను విని తన స్థానమునకు చేరుకొనెను. ఆరాత్రి అంతయు ఆలోచించినను గోకర్ణునకు ఏ ఉపాయము స్ఫురింపలేదు.

సూర్యోదయమైన పిమ్మట గోకర్ణుని రాక తెలిసి నగర ప్రజలు ప్రేమతో ఆతనిని కలియుటకు వచ్చిరి. వారందరికి గోకర్ణుడు రాత్రి జరిగిన వృత్తాంతమంతయు వివరించెను. వచ్చిన వారిలో పండితులు, వేదవేత్తలు, యోగనిష్ఠులు ఉండిరి. వారందరు శాస్త్రములను నిశితముగ పరిశీలించిరి.

కాని ప్రేతత్వముక్తికి ఉపాయమును ఏఒక్కరు చెప్పలేకపోయిరి. అందరు "సూర్యభగవానుడే ఈ విషయమై మార్గము తెల్పగలడు. కనుక సూర్యదేవుని ఆదేశము పాటింపు" మనిరి. వారి మాటలను ఆలకించిన గోకర్ణుడు తన తపోబలముచే సూర్యగమనము నిలిపివేసి **"తుభ్యం నమో జగత్ సాక్షిన్ బ్రూహిమే ముక్తి హేతుకం"** హే సర్వసాక్షి ! నాయందు దయ ఉంచి దుంధుకారికి ముక్తిని ప్రసాదింపగల సాధనమును తెల్పుడు" అని ప్రార్థించెను. గోకర్ణుని ప్రార్థనను ఆలకించిన విశ్వసాక్షి "శ్రీమద్భాగవతము వలన ముక్తి కలుగును. కనుక ఏడు దినములు దానిని చక్కని భక్తిశ్రద్ధలతో పారాయణ మొనరించుచు, ప్రవచనము చేయుము"అని పల్కెను. ఆ పల్కులను గోకర్ణునితో పాటుగ అచటనున్న అందరును స్పష్టముగా వినిరి. గోకర్ణుడు భాగవతకథను వినిపించుటకు సిద్ధపడెను.

ఈవిషయము తెలిసిన పెక్కురు పట్టణముల నుండి, పల్లెల నుండి తరలి వచ్చిరి. వారిలో కుంటి, గ్రుడ్డి, మందమతులు, వృద్ధులు మొదలగువారును ఉండిరి. గోకర్ణుడు వ్యాసపీఠమును అలంకరించి కథను చెప్పుట ప్రారంభించెను. ఆ సన్నివేశమును, వచ్చిన జనులను చూచి దేవతలుకూడ ఆశ్చర్యచకితులైరి. దుంధుకారుడు గాలి రూపముతో ఉన్నాడు కనుక ఏడు కణుపులు ఉన్న వెదురు కఱ్ఱ మొదటిలో చేరి కూర్చొండెను. గోకర్ణుడు ఒక విష్ణుభక్తుడగు బ్రాహ్మణుని ముఖ్యశ్రోతగా నియమించి ప్రథమ స్కంధము నుండి సుస్పష్టము మధురము ఐన కంఠధ్వనితో కథను విన్పింపసాగెను.

**"ది నాంతే రక్షితాగాథ తదా చిత్రం బభూవహా ।**

**వంశైక గ్రంథి భేదోభూత్ సశబ్దం పశ్యతాం సతాం"** ॥ సాయంకాలమునకు కథకు విశ్రాంతిని ఇచ్చెను. అప్పుడు సభాసదులందరు చూచుచుండగ ఒక అద్భుతము జరిగెను. ధుంధుకారి ఆశ్రయించి ఉన్న వెదురు కఱ్ఱ మొదటి కణుపు, శబ్దము చేయుచు పగిలిపోయెను. ఇదే విధముగా ప్రతిదినము కథకు విశ్రాంతినిచ్చినపుడు కణుపులు పగిలిపోయెను. పన్నెండు స్కంధములు వినుటచే ధుంధుకారి పవిత్రుడై ప్రేతత్వమునండి విముక్తుడయ్యెను. మేఘమువలె శ్యామవర్ణము కల శరీరముతో, పీతాంబరము ధరించి, మెడలో తులసిమాల, శిరముపై కిరీటము, చెవులకు రత్నకుండలములు కలిగిన దివ్యరూపముతో సభాసదులకందరకు కనుపించెను.

అతడు తన సోదరుడైన గోకర్ణునితో, "నీ దయవలన ప్రేతత్వ బాధ నుండి ముక్తుడనైతిని. ప్రేత పీడ నశింపచేయు శ్రీమద్భాగవతకథ పవిత్రమైనది. శ్రీకృష్ణధామమును చేర్చునట్టి ఈ సప్తాహ పారాయణము మిక్కిల ధన్యమైనది. సమస్త పాపములు, సప్తాహ పారాయణము ప్రారంభించినపుడు తమ అంతమును తలచుకొని వణికిపోయినవి. ఈ సప్తాహశ్రవణము మనోవాక్కాయకర్మల ద్వారా చేయబడిన పాపములనన్నిటిని భస్మీపటలమొనర్చును. అనిత్యమైన దేహముపై మోహము పెంచుకొని,శ్రీమద్భాగవత కథాశ్రవణము చేయక ఏమి చేసినను మానవ జన్మకు సార్థకతలేదు.

**"సప్తాహశ్రవణాల్లోకే ప్రాప్యతే నికటే హరిః**

**అతో దోష నివృత్యర్థం ఏతదేవహి సాధనం"** – సప్తాహశ్రవణము వలన లోకమున జనులకు భగవంతుడు శీఘ్రముగా లభించును. కనుక దోషములను పోగొట్టుకొనుటకు జనులకు ఇది ఒక్కటియే సాధనము. భాగవత కథారూపమగు తీర్థజలము సంసారమనెడు బురదను కడిగివేయుటలో సమర్థమైనది. మనిషి స్థిర చిత్తముతో శ్రవణము చేసినచో అతనికి ముక్తి లభించి తీరునని విద్వాంసులు పల్కుదురు" అనుచు మాటలాడుచుండగ వైకుంఠము నుండి విష్ణు పార్షదులతో కూడిన విమానము అతనికొఱకై వచ్చెను. ధుంధుకారి ఆవిమానమును అధిరోహించెను. ఆ విమానమునందున్న పార్షదులను చూచి గోకర్ణుడు, "ఓ పార్షదులారా! ఇచట నిర్మలచిత్తులైన శ్రోతలు ఎందరో ఉన్నారు. ఇచట అందరు సమానముగనే శ్రవణము చేసితిరికదా! వారందరకు విమానములు రాలేదు. కారణమేమి ? ఫలితము నందు ఈ భేదము ఎందులకు కలిగినది? నాకు దయతో తెలుపగలరు" అని ప్రార్థించెను.

ఆ మాటలకు పార్షదులు, "శ్రవణము నందుగల భేదము వలననే ఫలితమునందు భేదము ఏర్పడినది. శ్రోతలందరు సమముగనే విన్నను, వినిన దానిని మననము చేయలేదు. అందువలన వారికి లభించు ఫలము నందు భేదము కలిగినది. ఈ ప్రేతము ఏడు రోజులు ఉపవాసము చేసి, చక్కగా శ్రవణము చేసినది. వినిన కథాంశమును స్థిరచిత్తముతో పూర్తిగా మౌనముతో మననము చేసినది, జ్ఞానము దృఢము కాకపోయినచో అది వ్యర్థమగును. మనసు నందలి దోషముల మీద విజయము సాధించి, ఏకాగ్రతతో కథాశ్రవణము చేయవలెను. గురువు చెప్పిన మాటలయందు దృఢవిశ్వాసము, వినయభావము ఉండవలెను. ఇట్టి నియమములను పాటించినచో ఫలితము తప్పక సిద్ధించును. అందువలన మరల అందరు భాగవత సప్తాహ శ్రవణము చేసి ఫలితమును పొందుడు" అని చెప్పి వైకుంఠమునకు వెడలిరి. ఆ శ్రోతలందరు రెండవసారి చక్కని భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో శ్రవణము చేసి వైకుంఠము చేరిరి. గోకర్ణుని దయవలన సమస్త జీవులు, భగవంతుని ధామము చేరినవి. శ్రీకృష్ణభగవానుడు గోకర్ణుని తన గోలోకధామమునకు తీసికొని వెళ్ళెను.

**ఆఖ్యానమేతత్ పరమం పవిత్రం**

**శ్రుతం సకృద్వైవిదహేదఘౌఘమ్ ।**

**శ్రాద్ధే ప్రయుక్తం పితృతృప్తిమావహేత్**

**నిత్యం సుపాఠాదపునర్భవంచ ॥**

పరమ పవిత్రమైన ఈ కథ పాపరాశిని దహించివేయును. శ్రాద్ధ సమయములందు పఠించిన పితృదేవతలకు తృప్తి కలుగును. నిత్యము చక్కగ పఠించినచో ముక్తి తప్పక కలుగును.

**(గమనిక : వారమునకు ఏడు రోజులు వెనుక ప్రతిరోజూ పారణచేయుట మంచిదని అర్థము)**

కలౌభాగవతీ వార్తా భవరోగవినాశినీ– కలియుగమునందు సంసారరోగమును నాశనమొందింప కల్గినది భాగవత కథయే–కాగా ఈ భాగవత సప్తాహయజ్ఞమునకు కొన్ని నియమములు ఏర్పరచిరి. ఆ ప్రకారము భాగవత సప్తాహమొనర్చిన సకలపాపములును నశించి, ముక్తికి హేతువు అగును. ఈ సప్తాహమును వివాహ మొనరించునపుడు ఎట్టి ప్రయత్నము చేయుదురో, అట్లే ధన, వస్తు సంపత్తిని ఏర్పాటు చేసికొని, మంచి ముహూర్తములో ఆషాఢ, శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసములలో చేయుట శుభప్రదము. ఉత్సాహవంతులను సహాయకులుగా ఏర్పరచు కొని, **"భవిష్యతి కథాచాత్ర ఆగంతవ్యం కుటుంబిభిః"** – ఇచట భాగవత సప్తాహయజ్ఞము జరుగును. కనుక మీ మీ కుటుంబములతో అందరు విచ్చేయవలసినదని" – అందరకు తెలియ చేయవలయును. స్త్రీలు, శూద్రులు మున్నగువారు భగవత్కథలకు దూరముగా ఉన్నారు. కనుక, వారికి కూడ తెలియ చేయవలెను. అందరికి ఎట్లు ఆహ్వానము పంపవలెనో వ్రాయు విధానమును భాగవతమున పేర్కొనిరి. అందు, ఏడురోజులు రాలేని వారు ఏ ఒక్క రోజైనను సమయము కల్పించుకొని రావలసినద"ని అభ్యర్థనా పూర్వకముగా ఆహ్వానింపవలెనట.

ప్రాంగణమును చక్కగా అలంకరించి, ఆహుతులకు తగిన సౌకర్యములు చేయవలెను. ఉత్తర ముఖముగా వక్త యొక్క ముఖము, శ్రోతలు తూర్పుముఖముగా కూర్చుండునట్లు, అట్లు వీలుకాని యెడల వక్త తూర్పుముఖముగా, శ్రోతలు ఉత్తరాభిముఖులుగా ఉండవలయును. అట్లను కాని యెడల వక్త, శ్రోతలు అభిముఖముగా ఉండునట్లుండవలెనని, దేశకాలాదులను ఎఱింగిన పెద్దలు చెప్పుచున్నారు. వక్త వేదశాస్త్రార్థములను వివరించి చెప్పుటకు సమర్థుడై ఉండవలయును. సప్తాహము కనుక వక్తకు విశ్రాంతి అవసరమగునేమో కదా! అందువలన **"వక్తుః పార్శ్వే సహాయార్థం అన్యః స్థాప్యః తథావిధః"** వక్తవలె సమర్థత కల మరియొక వక్తను ఏర్పాటు చేసి కొనవలయును, అతడు ప్రతిదినమును సప్తాహమున పాల్గొనవలయునను అర్థము **"వక్తుః పార్శ్వే"** అను పదప్రయోగము వలన తెలియుచున్నది.

దీక్ష స్వీకరించుటకు ముందుగనే క్షురకర్మచేయించుకొని, దీక్ష స్వీకరింపవలెను. ఎట్టి విఘ్నములు కలుగకుండ ఉండుటకై యథావిధి విఘ్నేశుని పూజంపవలెను. పితృదేవతలకు తర్పణమిచ్చి, పూర్వపాపక్షయ శుద్ధికై ప్రాయశ్చిత్తమును చేసికొనవలయును. శ్రీకృష్ణుని ఉద్దేశించి మూల మంత్రముతో షోడశోపచార పూజ కావించి, స్వామిని, **"సంసార సాగరే మగ్నం దీనం మాం కరుణానిధే! కర్మమోహ గృహీతాంగం మా ముద్ధర భవార్ణవాత్॥"** ఓ కరుణానిధీ! నిండుగ

సంసారసాగరమున మునిగి యున్న నన్ను కర్మమోహములునెడి మొసలి గ్రసించుచున్నది. దీనుడను, అసక్తుడనగునన్ను ఈ సంసార జలధి నుండి ఉద్దరింపు"మని వేడుకొనవలయును. భాగవత గ్రంథమును కూడ పూజించి, "శ్రీకృష్ణపరమాత్మవైన నీవే భాగవత గ్రంథ రూపమున ఉన్నావు. నేను నీ దాసుడను. భవసాగరము నుండి ముక్తి పొందుటకై నీ శరణుజొచ్చితిని. కనుక నన్ను, మమ్ము ఉద్దరింపుమని" వేడికొని, కొబ్బరికాయను కొట్టవలయును. వక్తను వస్త్రమాల్యగంధాదులచే పూజించి, సాక్షాత్తు మీరు ఆ శుకస్వరూపులు సమస్త శాస్త్ర పారంగతులైన మీరు మాయందు దయతో వివరణాత్మకముగా భాగవత సప్తాహయజ్ఞమును ప్రారంభింపవలసిన"దని అభ్యర్థింపవలెను.

'కథాశ్రవణ సమయమున లౌకికవ్యవహారములను గూర్చి ఆలోచింపక కథా శ్రవణము నందే ఏకాగ్రచిత్తముతో ఉండవలయును. వక్త సూర్యోదయముతో కథ ప్రారంభించి, మూడున్నర జాములవరకు కథను చెప్పవలెను. మధ్యాహ్న సమయమున రెండు గడియల కాలము కథను నిలుపవలెను. శక్తియున్న వారు ఏడు దినములు నిరాహారులై కథాశ్రవణము చేయవలెను. లేనియెడల హవిష్యాన్నమునుగాని, ఏకభుక్తముగాని, లేక శరీర సౌఖ్యమును దృష్టిలో నుంచుకొని నియమమును ఏర్పాటు చేసికొనవలయును. ప్రతిదినము కథాపరిసమాప్త్యనంతరమే ఆహారము (ప్రసాదముగా) స్వీకరింప వలయును" అనుచు ఇట్లు పెక్కు నియమములను తెల్పిరి. ఈ మహా పురాణము గాయత్రీ స్వరూపము. కనుక దశమ స్కంథము నందలి ఒక్కొక్క శ్లోకమును పఠించుచు స్వాహాకారముతో, గాయత్రీ మంత్రముతో హోమము చేయవలెను. హోమాచరణకు అసక్తులైనచో విష్ణుసహస్రనామ పారాయణము దోషనివారణార్థము (విధినిర్వహణ సమయమున ఏర్పడిన హెచ్చు తగ్గుల దోషములు) చేయవలెను. భాగవతము పన్నెండు స్కంథములు కనుక, పన్నెండు మంది బ్రాహ్మణులను వస్త్రమాల్యాదులచే యథాశక్తి అర్చింపవలెను. ముఖ్యముగా భక్తి, శ్రద్ధ, వైరాగ్య చిత్తవృత్తితో కథాశ్రవణ మొనర్పవలెను. ఈ సప్తాహ యజ్ఞము నేడు స్త్రీలును నిర్వహించుచున్నారుకదా! మరి నియమమున (క్షుర కర్మాధికములు పేర్కొనుటచే) పురుషులే నిర్వర్తింప వలయునని తెలియుచున్నది కదా? అది యెట్లు ! అను సందేహము కలుగును. ఈ సందేహము స్కాందపురాణాంతర్గత శ్రీమత్ భాగవత మహాత్మ్యము గమనించినచో తీరును.

శ్రీహరి తన దివ్యయోగ మాయా ప్రభావమున రజోసత్త్వతమో గుణముల నుండి ప్రకటితమైన బ్రహ్మ, విష్ణు, రుద్రులకు ఉత్పత్తి, స్థితి, సంహారకార్యములను చేయు అధికారమునిచ్చెను. విష్ణు నాభికమల సంజాతుడైన బ్రహ్మ శ్రీహరి నుద్దేశించి "శ్రీమన్నారాయణా! నమస్సులు, సృష్టి కార్యక్రమ సమయమున రజోగుణ ప్రభావముచే నీ స్మృతి దూరమగునేమో! యని భయము కలుగుచున్నది. కనుక నాలో నీ స్మృతి శాశ్వతముగఉండు ఉపాయమును దయతో నాకెరిగింపవలయు"నని ప్రార్థించెను. అపుడు శ్రీహరి శ్రీమద్భాగవతమును ఉపదేశించి, "సేవస్వైనత్ స్వసిద్ధయే"- ఈ

భాగవతమును నీ మనోరథసిద్ధికై నిరంతరము సేవింపు" మని తెల్పెను. అపుడు బ్రహ్మదేవుడు సప్తాహయజ్ఞమొనర్చి సృష్టిని విస్తరింప చేసి, తరువాతను పలుపర్యాయములు సప్తాహ యజ్ఞమొనర్చుచుండెను. విష్ణుమూర్తియు తన ప్రజాపాలన కర్తవ్యమును చక్కగ నిర్వర్తించుటకు శ్రీహరిని ప్రార్థించెను. శ్రీహరియు విష్ణువునకు భాగవతమును ఉపదేశించి, "నీ మనోరథ సిద్ధికై శ్రీమద్భాగవతమును సర్వదా పఠింపుము" అని పల్కెను. అప్పటి నుండి విష్ణువు లక్ష్మితో కలసి ప్రతిమాసమునందును భాగవతము స్మరించుచు తన విధిని చక్కగ నిర్వర్తింపసాగెను. **"యదా విష్ణుః స్వయం వక్తా లక్ష్మీశ్చ శ్రవణే రతా, తదా భాగవతశ్రావో మాసే నైవ పునః పునః"** – విష్ణువు భాగవతమును ప్రవచించునపుడు లక్ష్మీదేవి శ్రద్ధతో శ్రోతగా నుండెడిది. అపుడు భాగవతము పూర్తియగుటకు ఒక మాసము కాలము పట్టెడిది. లక్ష్మీదేవి భాగవత ప్రవచనము చేయునపుడు విష్ణువు శ్రోతగా నుండిడి వాడు. లక్ష్మీదేవికి పాలనా భారము లేదు కనుక, నిశ్చింతగా రెండు మాసముల సమయములో భాగవత ప్రవచనము ముగించెడిది. ఇట్లే శివుడును తన సంహార కర్తవ్యమును నిర్వహించుటకు శ్రీహరిని ప్రార్థించెను. శ్రీహరి శంకరునకు భాగవతమును ఉపదేశించెను. అప్పుడు శంకరుడు ఆ భాగవతకథను ఒక సంవత్సర కాలమున పూర్తి చేసెనట. శివుడు లయ కారకుడు కనుక తాండవము చేయుచు పూర్తి చేసెనని (పార్వతి చదువు చుండగ) పెద్దలు పల్కుదురు.

కనుక పైన పేర్కొనిన సంఘటన వలన స్త్రీలకును భాగవత సప్తాహ యజ్ఞ అర్హత ఉన్నట్లు తెలియుచున్నది. మరినియమములు? అప్పటి కాలమునకును ఇప్పటికిని పెక్కు మార్పులు వచ్చినవి. ముఖ్యముగా భక్తి శ్రద్ధలతో పూర్తి చేయుట, శరీర ధర్మము ననుసరించి ఉపవాస విధులు పాటించుట ముఖ్యము. శ్రీ కృష్ణప్రాప్తి కదా ముఖ్యము.

**"కృష్ణ ప్రాప్తి కరం శశ్వత్ ప్రేమానంద ఫలప్రదమ్ ।**
**శ్రీమద్భాగవతం శాస్త్రం, కలౌ కీరేణ భాషితమ్" ॥**

**శుభం భూయాత్**



**సంసార సర్ప సందష్ట-నష్టచేష్టై క భేషజం !**
**కృష్ణేతి వైష్ణవమంత్రం శ్రుత్వా ముక్తోభవేన్నరః ॥**

సంసారమనే సర్పముచే కాటువేయబడి కదలలేని వారికి "కృష్ణ" నామమే దివ్యౌషధము. "కృష్ణ" అను దివ్య విష్ణుమంత్రం వినినంతనే నరుడు జీవన్ముక్తుడగును. మరి స్మరిస్తే .....

***కంవాదయాళుం శరణం ప్రజేమ***

*With Best Compliments From :*

# PILOT SERVICE STATION

**Dealers : Indian Oil MS, HSD & Lubes**
**#27-37-58, M.G.Road, VIJAYAWADA - 520 002**
**Ph : 6664495, 2577448, 2574495**

इंडियनऑयल

## Indian Oil

# PILOT SERVICE STATION

**SERVO STOCKIST - AUTO**
**Authorised Stockist for Krishna, Guntur, Prakasam District**
**#27-4-8, Teja Estates, Tadankivari Street, Governorpet,**
**VIJAYAWADA - 520 002, Phone - Sales : 0866 -6621261, 6614495**
**Sales - Accounts : 0866 -2574353**
**e-mail : pilot_@rediffmail.com**

इंडियनऑयल
IndianOil
SERVO®
100% PERFORMANCE, EVERYTIME

# పౌరాణిక సాహితీ సౌరభమ్

**ముష్టి కృష్ణమోహనశర్మ అవధాని,**
తి.తి.దే.వేదపారాయణదారు,
శివాలయం, ముత్యాలంపాడు,
విజయవాడ, కృష్ణాజిల్లా
చరవాణి : 93922 24951

ఇహ పరలోకాల్లో మానవులు ఉద్ధరింపబడి సత్కార్యాచరణ బద్ధులై ముక్తి మార్గాన పయనింప జేసేవి ఋషిప్రోక్తములైన వాఙ్మయములే. అవి వేదాలుగా, ఉపనిషత్తులుగా, పురాణాలుగా, కావ్యాలుగా మనకు సంక్రమించిన పెన్నిధులు.

మానవుని గ్రహణ సామర్థ్యాలకూ అవగాహన స్థాయికీ తగ్గట్లు ఆ మహనీయులు తమ గ్రంథాల ద్వారా అద్భుత విషయాలను మంత్రాల రూపంగా, ఇతిహాసాల రూపంగా అందజేశారు.

“హితేన సహితం సాహిత్యం” అని ఆర్యోక్తి. సమాజ హితమే వారి ఆశయం. మానవ కళ్యాణమే వారి ఆకాంక్ష.... రామాయణ భారత భాగవతాల్ని గమనిస్తే మానవుల్లోని దానవ గుణాల్ని తొలగించి, దైవ గుణాల్నీ, దివ్యగుణాల్ని ఇనుమడింపజేసే మహత్తర దివ్యగాథలే ఆ గ్రంథాల్లో ఉన్నాయి.

భాగవత కథలో దానవరాజు అయిన బలిచక్రవర్తితో శుక్రాచార్యుడు” రాజా! కొన్ని సందర్భాల్లో అసత్యమాడినా దోషం అంటదు.

**వారిజాక్షులందు వైవాహికము లందుఁ**
**బ్రాణ విత్త మాన భంగమందుఁ**
**జకిత గోకు లాగ్రజన్మ రక్షణ మందు**
**బొంకవచ్చు నఘము పొందఁ దధిప!**

అబద్ధమాడుమ”ని ఉద్బోధిస్తాడు... కానీ, రాక్షసరాజైన ఆ బలి చక్రవర్తి ససేమిరా అబద్ధం చెప్పనంటాడు... మరియు

**వ్యాప్తిం జెందక వగవక**
**ప్రాప్తంబగు లేశమైన పదివేలనుచున్**
**దృప్తింజెందని మనుజుఁడు**
**సప్తద్వీపములనైనఁ జక్కంబడునే.**

అని గొప్ప సందేశాన్ని అందించి,

సత్యనిష్ఠ యందే మనసును లగ్నం చేశాడు. .... ఉన్న దానితోతృప్తి చెందాలనీ, సత్యమార్గం తప్పకూడదని అంటాడు....

అలాగే దాన గుణానికి పరాకాష్ఠగా నిలిచిన రంతిదేవుడు కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నా, అన్నార్తులను ఆదరించాడు.

**"బలవంతంబగు నీరుపట్టున నిజప్రాణాంతమై యున్నచో**
**నలయం దేమియు; వీని హృజ్జ్వరము నాయాసంబు ఖేదంబు నా**
**జలదానంబున నేఁడు మాను" ననుచున్ సర్వేశ్వరాధీనుఁడై**
**జలముం బోసెను రంతిదేవుఁడు దయం జండాలపాత్రంబునన్.**

అలమటిస్తున్న అర్థికి జలదానం చేసి జగత్ ప్రసిద్ధ దాన గుణ సంపన్నుడయ్యాడు. చరితార్థుడయ్యాడు.

ఇక మహాభారతంలో అశ్వత్థామ వల్లనే తనకు పుత్రశోకం కలిగినా కూడా, చంపదగినవి అశ్వత్థామ తన భర్తలకే చిక్కినా వనితాశిరోమణి ద్రౌపది అశ్వత్థామను పుత్రునిగా భావించి, వాత్సల్యంతో వదలి వేయింపజేసిన ఆ తీరు ఎన్ని తరాలకైనా నిలిచి ఉండే అద్భుత మానవీయ గుణం.... మహనీయ గుణం కూడాను...

తమ వంశీయులకు ఏర్పడిన దుర్గతిని విని, భరించలేని భగీరథుడు అచంచల దీక్షాదక్షతలతో, తపోబలంతో తన వంశీయుల చితాభస్మాన్ని పునీతం చేయడానికి ఆకాశ గంగను పాతాళానికి దింపగలిగాడు.

జన్మనిచ్చిన తల్లిదండ్రులను అనాథాశ్రమాలకు సాగనంపే నేటి కాల దుశ్చింతనాపరులకు "భగీరథుని కథ" మానవీయ సద్గుణాన్ని చక్కగా పెంపొందింప జేస్తున్నది.

మానవతా మూల్యాలు మానవుల మనుగడకు, సమాజంలో సరైన ప్రవర్తనకు, సమాజం నీతిమార్గంలో సుఖశాంతులతో పరిఢవిల్లడానికి అత్యంతావసరం. ఒక వ్యక్తి సమాజంలో ఇతరులతో వ్యవహరించేటప్పుడు ఆ వ్యక్తినడతకు మార్గదర్శకాలుగా వున్నవే మానవతా మూల్యాలు. శాంతి సుహృద్భావాలతో నెలకొనటావికి ఇలాంటివి ముఖ్యాతిముఖ్యాలు.

ఇవి కలిగిన వ్యక్తి సమాజంలో రాణిస్తాడు.సమాజాభ్యుదయానికీ దోహదపడతాడు. అయితే ఇవి వ్యక్తి పుట్టుకతో రావు.పురాణ సాహిత్యం ద్వారానే గ్రహించాలి మనం.

మహాభారత, రామాయణ, భాగవత గ్రంథాలలోని కథల ద్వారా మనం అనేక మానవతా మూల్యాలు నేర్చుకుంటున్నాం. ఇంకా ఇంకా నేర్వాలి కూడా..

రామాయణభారత భాగవతాల్లోనూ మనుషులున్నారు. మానవ సంబంధాలున్నాయి. ఆ మానవుల్లోనూ బలహీనతలున్నాయి. అనేక బలాలున్నాయి. మానవ సంబంధాలున్నప్పుడు మానవ విలువలుంటాయి. ఇవి ఆయాకాలాలను బట్టి మారుతుంటాయి.

రామాయణంలో రాముని పాత్ర విశిష్టమైనది. భారతీయ సమాజం రాముని దేవునిగా కీర్తించింది. రాముడు తండ్రి మాట జవదాటడు. తన మాటకు కట్టుబడి ఉంటాడు. తనను ఆశ్రయించిన వారికి సహాయం చేస్తాడు. వాలి, సుగ్రీవులు అన్నదమ్ములు. సుగ్రీవుని భార్యను 'వాలి' బలవంతంగా తన దగ్గర బంధిస్తాడు. సుగ్రీవుడు రాముని సహాయం కోరతాడు.

రాముడు అతనికిచ్చిన మాట ప్రకారం సుగ్రీవునికి సాయం చేసి, వాలిని చంపుతాడు. తనకు సహాయం చేసిన రామునికి తన మాటకు కట్టుబడి రాముని భార్య సీతను వెదకటానికి, ఆమె జాడ కనుగొన్న తరువాత, రావణునిపై యుద్ధం చేయడానికి సుగ్రీవుడు తన సైన్యాన్ని రామునికిచ్చి రాముని తరపున యుద్ధం చేస్తాడు.

రాముడు ఇతరుల పట్ల ప్రేమను కలిగి వుంటాడు. గిరిజన వనిత శబరితో కలిసినప్పుడు ఆమె అతిథ్యాన్ని స్వీకరిస్తాడు. వానర గణం సహాయంతో సీత జాడకనుక్కోవడానికి హనుమంతుని సహాయాన్ని రాముడు తీసుకుంటాడు.అప్పుడు హనుమంతునిపట్ల రాముడు ప్రేమతో ఉంటాడు. వారిద్దరి మధ్య నమ్మకం, గౌరవం, అభిమానం పెరుగుతాయి.

హనుమంతుడు నేడు మనమనుకునే మానవతా మూల్యాలు సంపూర్ణంగా కలిగినవాడు. హనుమంతుడు రామునికి శిష్యునిలాగా, మిత్రునిలాగా, సేవకునిలాగా, ఆత్మీయునిలాగా వ్యవహరిస్తాడు.

రాముని పట్ల భక్తిభావంతో, ప్రేమభావంతోనే ఈ పనులన్నీ చేస్తాడు హనుమంతుడు. హనుమంతుడు రామునితో వ్యవహరించిన తీరులో నమ్మకం, ఇచ్చిన మాటపై నిలబడటం, త్యాగం, నిజాయితీ మొదలైన మానవతా మూల్యాలను మనం గుర్తించవచ్చు.

రామాయణంలో "శ్రావణకుమారుని కథ"లో శ్రావణ కుమారుడు తల్లిదండ్రులను కావడిలో మోస్తూ, వారిద్దరినీ సాకుతుంటాడు. ఈ ఉదంతం తల్లిదండ్రులపట్ల పిల్లలకుండాల్సిన ప్రేమాభిమానాలను మహత్తరంగా వ్యక్తం చేస్తున్నది.

ఇదేవిధంగా భారతంలో ధర్మవ్యాధుడనే కటిక వ్యాపారి ఉంటాడు. అతను ప్రతి రోజూ తల్లిదండ్రులను పూజిస్తూ, వారికి ఎలాంటి లోటు లేకుండా వారిని దైవంలాగా చూచుకుంటాడు.

దుర్వాసుడు అతని దగ్గరకు వచ్చి ఆగ్రహించినప్పటికీ, అతని రోజు వారి దినచర్యలు చూచి, ఆశ్చర్యపోతాడు. ఇందులో ధర్మవ్యాధుడు వ్యవహరించిన తీరు మహోన్నత సద్గుణం..

కౌరవులు, పాండవులు జూదమాడతారు. వారు చెప్పే అంకెలు, పాచికలు విసిరినప్పుడు ఖచ్చితంగా అవే పడితే వారు గెలిచినట్లు లేకపోతే ఓడినట్లు. ఇది వారి ఆనాట ఆట. దానికి పందాలు ఒడ్డేవారు. దాంట్లో వస్తువులతో పాటు తమ్ముళ్ళి కూడా పందెం కాస్తాడు ధర్మరాజు. ఒక క్రీడను ఉల్లాసానికి కాకుండా సంపదల కోసం ఎందుకు ఆడకూడదో భారతం తెలుపుతుంది. అలా చేస్తే మనుషులు ఎలా పతనమవుతారో చిత్రీకరిస్తుంది.

భీష్ముడు తను చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి ఉండటం అతని మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. తాను బ్రహ్మచారిగా ఉంటానని ప్రతినబూని, ఎన్నో సందర్భాలలో వివాహం చేసుకోవాల్సిన పరిస్థితులొచ్చినా, తన మాటకు కట్టుబడటం చూస్తాం.అది భీష్ముని జీవితచరిత్రకే వన్నెగూర్చిన ఘట్టం.

ఇలా మహాభారతం,రామాయణం, భాగవతాలలోని అనేక కథలు నైతికవిలువలను తెలియజేస్తాయి.

హరిః ఓమ్.

# శ్రీ శారదాగీతమ్

**శ్రీ జగద్గురు చంద్రశేఖర భారతీస్వామి నః**

**శారదే కరుణానిధే సకలానవామ్బ సదా జనాన్ ।**
**చారణాదిమ గీతవైభవ పూరితాఖిల దిక్తతే ॥**

**భర్మభూషణ భూషితే వరరత్న మౌలి విరాజితే ।**
**శర్మదాయిని కర్మమోచిని నిర్మలం కురుమానసమ్ ॥**

**హస్త సంధృత పుస్తకాక్షపటీ సుధాఘటముద్రికే !**
**కస్తవాస్తి హి వర్ణనే చతురో నరః ఖచరోఽథవా ॥**



# వేద సంరక్షణ

**ముళ్ళపూడి సత్యనారాయణశాస్త్రి,**
విశ్రాంతి సంస్కృతోపన్యాసకుడు,
కె.వి.కె.సంస్కృతకళాశాల,
గుంటూరు.
చరవాణి : 93473 03507

"విద = జ్ఞానే" – అను ధాతువు నుండి పుట్టినది – "వేద" – మనే శబ్దం – "వేద" మంటే తెలిపేది అని అర్థం. ఏమి తెలుపుతుంది? .. అంటే .. మనమందరం ఇహలోక పరలోకములలో సుఖంగా ఉండే మార్గాన్ని తెలిపేది అని అర్థం – ముందుగా ఈ లోకంలో మనమంతా సుఖంగా జీవించాలంటే .. ఏమి అవసరం? ఆహారం .. అన్నం .. ప్రాథమికావసరం – "అన్నాద్భవంతి భూతాని" – అది ఎట్లు వస్తుందంటే .. పంటలు పండాలి. అందుకు వృష్టి అవసరం. అది ఎలా వస్తుంది? మేఘం వర్షించాలి. ఆ పర్జన్యుడెలా వస్తాడు? ఇక్కడ మానవ బుద్ధి ఆగిపోయింది. భౌతిక శాస్త్రాలకూ, మానవబుద్ధికీ ఏది గోచరము కాదో .. అక్కడ తెలిపిడి చేసేదే వేదం – వాన పడకపోతే .. ముందుగా వ్యవసాయముండదు – క్రమంగా లోకంలోని సమస్త వృత్తులూ ఆగిపోతాయి – అక్కడ చెయ్యి పట్టుకు నడిపిస్తుంది వేదం – "యజ్ఞాత్ భవతి పర్జన్యః" – అని. యజ్ఞం వలన వాన కురుస్తుందని అలౌకికమైన సంబంధాన్ని వేదం చెప్పింది.

మరి "యజ్ఞ" మంటేనో .. వేద బోధితమైన కర్మ – "కర్మ బ్రహ్మోద్భవం విద్ధి" అంటే అది పరమాత్మ ముఖ నిర్గతమైనది – "అస్య నిశ్శ్వ సితం వేదాః" – అది (1) శబ్దం (2) అర్థం అనే రెండు రూపాలలో ఉంటుంది – ముందుగా శబ్దం – యథావిధిగా, స్వరయుక్తంగా ఉచ్చరించబడిన వేదవాక్కు అన్ని కోరికలనూ తీరుస్తుంది. "ధేనుర్వాగస్మాను పసుష్ఠు తైతు" అని కదా మంత్రం – నాగస్వరం నాగుబాముని లాక్కొని వచ్చినట్లుగా .. వేదమంత్రం దేవతనే లాక్కొస్తుంది – " మంత్రాధీనం తు దైవతమ్" కదా! ఆ శబ్ద శక్తి అటువంటిది. అట్టి వేదమును అధ్యయనము చేసి రక్షించువారే "బ్రాహ్మణులు"– అని పిలువ బడుచున్నారు – "బ్రహ్మ = వేదమును, అనయంతి = రక్షించుచున్నారు గనుక "బ్రాహ్మణాః"– అని వ్యుత్పత్తి – "అన = ప్రాణనే" – అని ధాతువు – వేదాధ్యయన శీలురని అర్థం –

ఇక (2) అర్థం – అది ముందుగా కర్మాచరణ విధానమును దెలుపు తుంది – అదే యజ్ఞ ప్రక్రియ – ఇది తార్కిక బుద్ధికీ హేతువాదానికీ అందనిది – అతీతమైనది – కానీ సక్రమంగా

ఆచరించిన పిమ్మట ఫలం అనుభవ సిద్ధం – ప్రాచీన కాలం నుండీ సత్యమని నిరూపించ బడినది.

పూర్వం రోమపాదుడనే రాజుండేవాడు. ఆయన రాజ్యంలో చాలాకాలం వానలు పడలేదు – చివరకు ఋష్యశృంగ మహర్షి ద్వారా వృష్టి గలిగింది. రాజ్యమంతా సుఖ శాంతులు బొందినట్లు ఐతిహ్యము గలదు – ఈ కాలంలోనూ ఎన్నో దృష్టాంతములు గలవు.

ఒక ఊరిలో ఒక రైతు దంపతులుండే వారు. పొలం దగ్గరగానే వారికి ఇల్లు ఉండేది. గానే వారికొక కుమారుడు – ఎంతో గారాబంగా చూచుకొనే వారు – ఇద్దరూ కుమారుని వెంట బెట్టు కొని పొలానికి వచ్చారు. పిల్లవాణ్ణి గట్టు మీద కూర్చో బెట్టింది తల్లి – నాయనా! నేను ఇంటికి వెళ్లి వంట చేసి తీసుకు వస్తాను – అప్పటి దాకా నువ్వు ఇక్కడే కూర్చుని మీ నాన్న ఏమి చేస్తున్నాడో జాగ్రత్తగా చూస్తూ ఉండు .. అని చెప్పి వెళ్లింది – ఇంటికి వెళ్లి వంట చేసి అన్నం తెచ్చింది – వెంటనే ఆ పిల్లవాడు తల్లితో.. అమ్మా! నేను ఇంట్లో ఏదైనా వస్తువు పారబోస్తే నన్ను కేక వేస్తావు గదా! నాన్న చూడు. ఆ గోతాములో సగం గింజలను పొలంలో పార బోశాదమ్మా! నాన్నను కేకవెయ్యి! అని కంప్లయింట్ చేశాడు – పిచ్చితండ్రీ! అది పారబోయ్యటం కాదురా! విత్తనం నాటటం అంటారు – ఆ తర్వాత ఒక్కొక్క గింజ ఒక్కొక్క బస్తాగా మళ్లీ మనకే తిరిగి వస్తుందిరా! అన్నది. అది ఎట్లాగో వివరంగా నాకు చెప్పు అని మారాం చేశాడు. నాయనా! అది నీకు ఇప్పుడే అర్థమయ్యేది కాదులే ... కొన్నాళ్ల తర్వాత తెలుస్తుందిలే .. ఊరుకో .. అన్నది. నీకు అర్థం అయ్యేదాకా నాట్లు వెయ్యకుండా ఉండాలంటే .. బ్రతకలేము గదా! కనుక చెప్పినట్లు విను – అన్నది – అట్లాగే రామాయణంలో శ్రీరాముడు భరతునికి రాజ్య పరిపాలనను గూర్చి బోధించుచు –

**శ్లో॥ ధర్మశాస్త్రేషు ముఖ్యేషు విద్యమానేషు దుర్బుధాః**
**బుద్ధి మాన్వీక్షకీం ప్రాప్య నిరర్థం ప్రవదంతి తే ॥**
**అనర్థకుశలాహ్యేతే బాలాః పండిత మానినః ॥ (రామా. అయోధ్య 100–39,40)**

మన పూర్వుల నుండీ ధర్మశాస్త్రం ప్రకారం ఆచరించబడిన కర్మ ఫల ప్రదమగుటను జూచి – అనుభవము ద్వారా గ్రహించియు ..... హేతువాదుల తార్కిక బుద్ధి ననుసరించి, ఆ బావిశుల సలహాలను విని ఆపదలు కొని తెచ్చుకోవద్దు .. అని భరతునికి హితోపదేశం చేస్తాడు –

ఆ శ్రీ రాముడే ఒక సందర్భంలో ... అరణ్యకాండలో దండకారణ్యమునులను రక్షించు దృఢ నిశ్చయముతో

**శ్లో॥ అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! సలక్ష్మణామ్**
**నతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః ॥ (అరణ్య 10–19)**

ఓ సీతా! రాజుకి కుటుంబం కన్న ప్రజలూ, వారి క్షేమమే ముఖ్యం – ఈ లోకమునంతా రక్షించేది "వేద" మయితే .. దానిని సంరక్షించువారు (అధ్యయనము ద్వారా) ఈ బ్రాహ్మణులు – అట్టి వారిని కాపాడు కొనుట పాలకునికి ప్రథమ కర్తవ్యము – కనుక నేను అవసరమైనచో .. నాజీవితమే విడనాడియైననూ .. నిన్ను, లక్ష్మణుని విడువవలసి వచ్చిననైననూ .. వెనుకాడక ముందుగా ఈ తపస్వులైన బ్రాహ్మణులనే రక్షించెదనని తన దృఢ నిశ్చయమును ప్రకటించినాడు.

ఆ తరువాత కాలంలో గూడా ఎందరో రాజులు వేదాలనూ, వేదబోధిత కర్మలనూ, వైదిక ధర్మాన్నీ సంరక్షించారు – ఇప్పుడు రాజులు లేరు – రాజ్యాలు లేవు – అంతా ప్రజాస్వామ్యం – ప్రజాప్రతినిధులదే పెత్తనం – వారికి దైవం పైన .. సనాతన వైదిక ధర్మంపైన నమ్మకం ఉండవచ్చు .. ఉండక పోవచ్చు – కానీ .. ఎంతో భక్తితో విశ్వాసంతో, దూరదృష్టితో, ఉదార స్వభావంతో, సమస్త లోక కల్యాణం కోరిన కొందరు భక్తులు దేవాలయాలకు దానంగా ఇచ్చిన భూములనూ, ఆస్తులనూ.. అందుకోసమే వినియోగించాలి – ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రథమ కర్తవ్యమేమంటే .. వారు ప్రత్యేకంగా ఏమీ ఇయ్యలేకున్నా .. దేవాదాయ శాఖకు భక్తులు ఇచ్చిన ఆస్తులను సక్రమంగా అందుకోసమే వినియోగిస్తే చాలు – ఆ శాఖ ఉపేక్షించబడితే .. ఆ ధర్మ విప్లవం ప్రభుత్వాలనే కదిలిస్తుంది.

– వేదోఽఖిలో ధర్మమూలమ్ –

– ధర్మో రక్షతి రక్షితః –

మనసు ఈశ్వరునికి స్థానం. కాని మనం దాన్ని చెత్తతో నింపేస్తున్నాం. దాన్ని మనమే శుభ్రపరచుకొని, ఈశ్వరుని ప్రతిష్ఠించుకొని, శాంతితో ఉండాలి. అందుకోసం మనం ప్రతిరోజు కనీసం ఐదు నిమిషాలు ధ్యానానికి కేటాయించి, ప్రళయం సంభవించినా దాన్ని చేయాలనే సంకల్పం కలిగి ఉండాలి.

**– కంచి పరమాచార్య**



# జయశబ్దార్థము - పురాణ సంగ్రహము

శ్రీ సోమాశి బాలగంగాధరశర్మ,
0863 – 2238143

**నారాయణం నమస్కృత్య । నరంచైవ నరోత్తమం ।**
**దేవీం సరస్వతీం వ్యాసం । తతోజయముదరయేత్ ।**

నారాయణునకు, నరోత్తముడగు నరునకు దేవియగు సరస్వతికి, వేదవ్యాసమహర్షికి నమస్కరించి జయమును ప్రారంభింపవలెను. (చెప్పవలెను). పై శ్లోకమునకు భావమిది. జయమంటే యేమిటి? అష్టాదశ మహాపురాణములు శ్రీ మద్రామాయణము, మహాభారతము. యీ జయశబ్ద వ్యవహారము గలవి. ఈ గ్రంథముల నారంభించే ముందు నారాయణునకు నమస్కరించిన నరోత్తముడగు నరునకు నమస్కరించి, సరస్వతీదేవికి నమస్కరించి, వ్యాసునకు నమస్కరించి ప్రారంభించాలి. అని యిది సంప్రదాయక ప్రార్థనా శ్లోకము.

వేదములు నాలుగు– ఋగ్వేదము – యజుర్వేదము – సామవేద – అధర్వణ వేదము. ఈ వేదములు రెండు భాగములు, సంహితా బ్రాహ్మణ అరణ్యకములనీ 2 ఉపనిషత్తులని, వీటి అర్థమును తెలుసుకోవాలంటే సహకరించేవి వేదాంగములు ఆరు. 1. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అని వేదార్థమును నిర్ణయించుకోవాలంటే ఈ ఆరింటి సహాయము అవసరము. వీటి సహకారము లేనిదే వేదమంత్రములను అర్థము నిర్ణయించుట సమంజసము కాదు. వెనుక వేదపాఠము షడంగవేదాధ్యయనము సంప్రదాయముగా వుండేది. అనంతరకాలములో సంహితారణ్యక బ్రాహ్మణ ఉపనిషదధ్యయన సంప్రదాయ యేర్పడినది. యిందు సంహితా బ్రాహ్మణారణ్యకము లందున్న మంత్రభాగము సంధ్యావందనాది కృత్యము లందు సమస్త క్రియా కలాపములందు వినియోగము కలది. ఉపనిషన్మంత్రభాగము వేద ప్రతిపాదిత బ్రహ్మవస్తువును నిర్ధారణము చేయునది. ఒక్క మాటలో చెప్పాలంటే క్రియలు చేయుటకుపకరించేవి. సంహితా బ్రాహ్మణారణ్యకములు, వేద ప్రతిపాదిత పరబ్రహ్మమును తెలియజేసేవి, ఉపనిషత్తులు చేసేవి తెలుసుకొనేవి అని రెండు భాగములు గలది వేదము.

**జయ శబ్దార్థ వివరణము**

మొదట చెప్పిన శ్లోకంలో "తతో జయముదీరయేత్।" అని "జయ" అన్న పదం వున్నది. ఇంతకీ ఈ జయమంటే యేమిటి? దేవతలు మహర్షులు కూడా పరోక్ష ప్రియులు. "జయ"

అన్నదానిని తిరగేస్తే "యజ" అని అవుతుంది. జయ ప్రత్యక్షము. "యజ" పరోక్షము. సంఖ్యాశాస్త్రము ప్రకారము జయ అంటే 81 యజ అంటే 18. యెలాగో చూద్దాము. అక్షరమాలలో "కటపయ" విధానము ఒకటివున్నది. క వర్గము, ట వర్గము, ప వర్గము, య వర్గము. అని హల్లులను నాలుగు వర్గముల విభజనమిది. క వర్గమంటే క ఖ గ ఘ చ ఛ జ ఝ. ట, ఠ, డ, ఢ, త, థ, ద, ధ – ఈ ఎనిమిది 'ట' వర్గము. ప ఫ బ భ ఈ నాలుగు అక్షరములు 'ప' వర్గము. య ర ల వ శ ష స హ ళ క్ష – ఈ పదకొండు అక్షరములు య వర్గము. క వర్గములోని ఎనిమిదవ అక్షరము 'జ', య వర్ణము లోని 'య' ఒకటవ అక్షరము. కలిపితే ఎనిమిది ఒకటి 81 ఇది ప్రత్యక్షము. య వర్గములోని ఒకటవ అక్షరము 'య'. క వర్గములోని 'జ' అక్షరము ఎనిమిదవ అక్షరము. కలిపితే 'యజ' 18. ఇది పరోక్షము. 1 + 8 = 9 యిది పూర్ణసంఖ్య. దీనినిబట్టి చూస్తే 81 అయినా 18 అయినా 9 పూర్ణసంఖ్య!

అందుకనే 'జయ' అన్నా 'యజ' సంఖ్యాశాస్త్రములోని పూర్ణసంఖ్య 9 అవుతుంది. యేయజామహే అస్తు శ్రౌషట్. యిదికూడా తొమ్మిదే. దీనిని బట్టి ప్రత్యక్ష పరోక్షములుగా చెప్పబడిన 'జయ' 'యజ' అను రెండు పదములు సమానార్థ బోధకములే. అందుకనే మహాభారతమునకు 18 పర్వములు. భగవద్గీతకు 18 అధ్యాయములు. కురుక్షేత్రమహాసంగ్రామములోని సేన 18 అక్షౌహిణులు. అలాగే 18 మహాపురాణములు. 18 ఉపపురాణములు.

**పురాణముల విశిష్టత**

**మ ద్వయం భ ద్వయంచైవ । బ్రత్రయం వచతుష్టయం ।**
**అనాపలింగకూస్కాని । పురాణాని పృథక్పృథక్ ।**

మ ద్వయం = మకారంతో ప్రారంభమయే పురాణములు రెండు – మత్స్య మహాపురాణము, మార్కండేయ మహాపురాణము. భ ద్వయం = భకారంతో ప్రారంభమయే పురాణములు రెండు – భవిష్య పరాణము, భాగవత పురాణము. బ్రత్రయం = బ్ర అనే అక్షరముతో ప్రారంభమయే పురాణములు మూడు – బ్రహ్మ పురాణము, బ్రహ్మాండ పురాణము, బ్రహ్మావైవర్త పురాణము. వ చతుష్టయం = వకారముతో ప్రారంభమయే పురాణములు నాలుగు – వరాహ పురాణము, వామన పురాణము, వాయు పురాణము, విష్ణు పురాణము.

అనాపలింగ కూస్కాని = అగ్ని పురాణము, నారద పురాణము, ప–పద్మపురాణము, లింగ పురాణము, గరుడ పురాణము, కూర్మ పురాణము, స్కాంద పురాణము. యిది దేవీ భాగవతమందు చూపబడిన మహా పురాణముల సంఖ్య 18.

1. మత్స్య పురాణము 2. మార్కండేయ పురాణము 3. భవిష్య పురాణము 4. భాగవత పురాణము 5. బ్రహ్మ పురాణము 6. బ్రహ్మాండ పురాణము 7. బ్రహ్మావైవర్త పురాణము 8.

వరాహపురాణము 9. వామన పురాణము 10. వాయు పురాణము 11. విష్ణు పురాణము 12. అగ్ని పురాణము 13. నారద పురాణము 14. పద్మ పురాణము 15. లింగ పురాణము 16. గరుడ పురాణము 17. కూర్మ పురాణము 18. స్కాంద పురాణము. యిది శ్రీ దేవీ భాగవత పురాణ సూచితము. యితర పురాణములందు చూపబడిన పురాణ నామములలో కొద్దిపాటి భేదమున్నా సమన్వయ దూరముమాత్రము కాదు.

భాగవతము - దేవీ భాగవతమా? శ్రీమద్భాగవతమా? అన్న వివాదము పండితలోకంలో వున్నా యివి రెండు పురాణములుగా భావించినపుడు మాత్రమే వివాదము. నారాయణీ తత్త్వమును నారాయణ తత్త్వమును ప్రతిపాదించు గ్రంథములుగా పరిగణించి ఏక గ్రంథముగా అంగీకరించినచో వివాదము లేదు. కర్మానుష్ఠాన పూర్వక బ్రహ్మ వస్తు ప్రతిపాదకము శ్రీ దేవీ భాగవతము. కర్మ నిరాసాపూర్వక ఏక బ్రహ్మ వస్తు ప్రతిపాదకము శ్రీమద్భాగవతము. అలాగే శివ పురాణ, వాయు పురాణ నామ వివాదము. వాయువును ఉద్దేశించి చెప్పబడిన శివతత్త్వ ప్రతిపాదకము వాయు పురాణము. శివ పురాణము అని నామ భేదమేర్పడినది. పురాణములలో కొద్దిపాటి విషయ భేదములున్నా వక్తృ భేదాన్ని బట్టి కల్పాంతర భేదాన్ని బట్టి, గ్రంథ తాత్పర్య ప్రకటనాన్ని బట్టి యేర్పడిన భేదములే గాని, భేదములుగా (అసత్యములుగా) పరిగణింపదగినవి కావు. జయ శబ్దార్థమును ప్రతిపాదించు ఈ వ్యాసమునందు పురాణ ప్రసక్తి యెందుకనిపించవచ్చు. కాని "ఇతిహాస పురాణాభ్యాం వేదంసముపబృం పాయేత్". ఇతిహాస పురాణముల ద్వారా వేదార్థమును ఉపబృంహ్మణము చేయవలెను అని చెప్పియున్నందున ఈ వ్యాసమునందు పురాణ ప్రసక్తి యేర్పడినది. వేదములందు అస్పష్టములుగా వున్నందున స్పష్టతకోసము, సర్వులకు వేదార్థము అవగాహనము కలగడంకోసం పురాణ వాఙ్మయమేర్పడింది. "వేదో నిత్య మధీయతాం" ఇది ఆచార్య శంకరభగవత్పాదుల మాట. "నిత్యం పురాణం శ్రావ్యంహి" అనేది పురాణ మర్మజ్ఞుల మాట. అర్హతకలిగినవారు వేదమధ్యయనముచేసి వేదప్రోదిత కర్మలనాచరించాలి. "స్త్రీ శూద్ర ద్విజ బంధూనాం" అని చెప్పడంవలన మోక్షమును కోరు ప్రతివారూ ప్రతి నిత్యమూ పురాణాలను శ్రవణంచేయాలి. శ్రవణము వల్లనే పరిక్షిన్మహారాజు తరించాడు. లౌకికాలౌకిక మోక్ష ధర్మాలెన్నో పురాణములందు ప్రతిపాదింపబడినాయి. వేదవిరుద్ధములు పురాణములు. వేద ధర్మములను సుబోధకముగా బోధించునవి పురాణము.

**నారాయణం నమస్కృత్య! నరంచైవ నరోత్తమం**
**దేవీం సరస్వతీం వ్యాసం । తతో జయముదీరయేత్**

ఇతి శమ్



# సీతారామాంజనేయ సంవాదము

డాక్టర్ కె.గిరిజాలక్ష్మి, నెల్లూరు
చరవాణి : 98854 12418

"సీతారామాంజనేయ సంవాదమ"నే ప్రబంధము తెలుగులో చంపువుగా (గద్యపద్యోభయంగా) వ్రాయబడిన వేదాంత గ్రంథము. దీన్ని రచించిన వారు 'పరశురామ పంతుల లింగమూర్తి' కవి. ఈయన నియోగి బ్రాహ్మణుడు. రామమూర్తికి, తిమ్మాంబకు పుత్రుడు. శ్రీరామ భక్తుడు, మహాదేవయోగికి శిష్యుడు. ఈ కవి నివాస స్థలం నిజాం రాష్ట్రంలోని వరంగల్లు దగ్గరున్న 'మట్టెవాడ' గ్రామం. చిన్నతనంలో విద్యాజ్ఞాన శూన్యుడై, తన గ్రామం దగ్గర తిరుగుతుండగా, అక్కడ సమీప శైలంలో నివసించే మహాదేవయోగి తనకు రామమంత్రాన్ని ఉపదేశించాడని, షట్చక్ర సీతారామ స్వరూపాన్ని కూడా ఇచ్చాడని, దాన్ని కవి తన గృహంలో ప్రతిష్ఠించినట్లుగా చెప్పుకున్నాడు. ఇప్పటికే లింగమూర్తి వంశీయులు దాన్ని పూజిస్తున్నారు, అంతేకాదు ఈ కవి ఆర్జించిన శ్రీరామమాడ, స్ఫటిక వినాయక విగ్రహము, మరకతలింగము, సాలగ్రామ లింగములను కూడా, ఈతని వంశీయులు శ్రద్ధాభక్తులతో అర్చిస్తున్నట్లు తెలుస్తున్నది. రామమంత్రోపదేశకుడై లింగమూర్తి కవి, నిజాం రాష్ట్రంలో, అన్ని వైపులా పల్లకినెక్కి తిరిగి, ఎంతోమంది శిష్యుల్ని గడించినందువల్ల, 'గురుమూర్తి' అనే బిరుదును పొందాడు.

ఈ కవి, తన గురువైన మహాదేవయోగిని 'దైవసముడు'గా భావించేవాడని సీతారామాంజనేయ కామా పీఠికను బట్టి అర్థమవుతుంది.

> **సగుణ నిర్గుణ రూపుడై నెగడుచుండు**
> **నమ్మహాదేవ గురువరు నఖినుతింప**
> **సకల నిగమాగమాంత శాస్త్రంబులోప**
> **వనగ మము బోంట్లకు నుతింపనలవియగునే? (32)**

లింగమూర్తి కవి కాలాన్ని గురించి తెలుసుకోవడానికి సీతారామాంజనేయ కావ్యంలో ఆధారాలు లేవు. దీనికి ముందు రచించిన 'రతిమన్మథవిలాస' కావ్యంలో కవి స్తుతిలో అయ్యలరాజు రామభద్రుని పేర్కొన్నారు. అంతేకాదు వసుచరిత, రామాభ్యుదయ ప్రబంధ పద్యాల కనుకరణాలు 'సీతారామాంజనేయం'లో కనబడుతుండడాన్ని బట్టి ఈ కవి 17వ శతాబ్దిలో జీవించి ఉంటాడని భావించవచ్చు. ఈ కావ్యాన్ని క్రీ.శ 1760 ప్రాంతంలో రచించి ఉండవచ్చు.

లింగమూర్తి కవి మొత్తం ఆరు గ్రంథాలు వ్రాశాడు. 1. రతిమన్మథ విలాసము 2. జీవన్ముక్తి

ప్రకరణము 3. బ్రహ్మ నారద సంవాదము 4. తారకయోగము 5. మానసశతకము 6. సీతారామాంజనేయ సంవాదము. వీటిలో రతి మన్మథ విలాసము, సీతారామాంజనేయమే పెద్దవి. మిగతావి శతకప్రాయాలు, రతి మన్మథ విలాసము మూడాశ్వాసాల ప్రబంధము. ఈ గ్రంథంలో గద్యలో "శ్రీమదాంజనేయ చరణ కమల సేవావిధ్రేయ శృంగార కవితా చమత్కార ధౌరేయ పరశు రామపంతుల లింగమూర్తి నామధేయ ప్రణీతంబైన రతిమన్మథ విలాసమను శృంగార ప్రబంధమందు" అని వ్రాసికొన్న దాన్ని బట్టి దీన్ని కవి తన యౌవనకాలంలో రచించినట్లు తెలుస్తుంది.

'సీతారామాంజనేయము' రచించేనాటికి కవి మనస్సు శృంగారము నుండి విముఖమై వేదాంతంలో స్థిరపడినట్లు అనిపిస్తుంది. కవిత కూడా నిగ్గుతేలింది. రతి మన్మథ విలాసంలో గురు ప్రశంసలేదు, స్వవిషయ ప్రసంగం కూడా లేదు, దీన్ని హనుమంతునికి అంకిత మిచ్చాడు. సీతారామాంజనేయాన్ని తన గురువైన మహా దేవ యోగికి అంకితమిచ్చాడు, వేదాంత పాండిత్యము, కవితాధార ఇందులోలు బాగా వ్యక్తమైనాయి.

లింగమూర్తి కవి, తానీ గ్రంథాన్ని బ్రహ్మాండపురాణాంతర్గమైన ఆధ్యాత్మ రామాయణంలోని శ్రీ రామహృదయాన్ని విస్తరించి వ్రాశానని, శ్రీరాముడు ప్రత్యక్షమై (స్వప్నంలో) కృతి రచించమన్నాడని వ్రాసుకున్నాడు. రజతగిరి మీద శంకరుడు పేరోలగము తీర్చియున్న సమయంలో, తనకు పరిచర్యలు చేస్తున్న పార్వతిని చూసి, శంకరుడు సంతోషించి, ఏదైనా వరం కోరుకొమ్మనగా, ఆమె పవిత్రమైన మంత్రరాజాన్ని ఉపదేశించమని అడిగింది. అప్పుడు శంకరులు, 'నీకు తగినది శ్రీరామమంత్రమ'ని చెప్పి దాన్ని ఉపదేశించాడు. అప్పుడు పార్వతి శ్రీరామ తత్త్వ స్వరూపమెలాంటిదని ప్రశ్నించింది. రామ పట్టాభిషేకానంతరం, శ్రీరాముని అనుమతితో సీత, హనుమంతునికి బోధించిన దాన్నే, శంకరుడు పార్వతికి చెప్పాడు. అందువల్ల ఇది 'సీతారామాంజనేయు సంవాదమ'నే పేరును సంతరించుకుంది. ఇది ఈ గ్రంథావతారిక.

ఈ పుస్తకం తారకయోగము, సాంఖ్యయోగము అమనస్కయోగము అనే మూడాశ్వాసాలుగా వింగడింపబడింది. ఇందులో మొత్తం 567 గద్య పద్యాలున్నాయి. లింగమూర్తి కవి యోగాభ్యాసపరుడవడం వల్ల, అద్వైతమతాన్ని వివరించాలనుకున్నా పాలలో చక్కెర కలిపినట్లు రాజయోగాన్ని అద్వైతంలో కలిపి సమన్వయించాడు.

సీతారామాంజనేయంలో మొదటి పద్యంలో ఇష్టదేవతా స్తుతి చేశాడీవిధంగా,

**శ్రీమద్దివ్య నిజాంఘ్రిపద్మములు సంసేవించుచున్ భక్తిచే**
**ధీమంతుం దగునాంజనేయుని నసద్దేహేంద్రియాతీత చి**
**ద్భూమానందుడు వీవ నేనని కృపన్బోధించు శ్రీ జానకీ**
**రామబ్రహ్మము నంతరంగమున నారాధింతు నశ్రాంతమున్ (1)**

"అనన్యభక్తితో, తన పాదాలనెప్పుడూ సేవిస్తూ, ఆ ప్రభావంవల్ల దృఢమైన వివేక వైరాగ్యాలు కలిగి, ఉత్తమాధికారియై యున్న హనుమంతునికి 'తత్త్వమసి' – ఆ బ్రహ్మమే నీవు అనే మహావాక్యార్థాన్ని, కరుణతో ఉపదేశించిన, ఆ సీతారామ బ్రహ్మమును సర్వకాలాలలోను ధ్యానిస్తాను". ఇట్లా తన ఇష్టదైవమైన శ్రీరాముణ్ణి పరబ్రహ్మస్వరూపంగా అభివర్ణించాడు. తర్వాత సీతాదేవిని మూలప్రకృతి రూపంగాను, బ్రహ్మ విష్ణు రుద్రులను, సత్యరజస్తమోగుణాలు ఉపాధులుగా కలిగి ఉన్న, పరమాత్మ ప్రతిబింబాలుగా వినుతించారు. పూర్వకవులను స్తుతిస్తూ, సంస్కృత కవులైన వాల్మీకి, వ్యాస, మయూర, బాణ, కాళిదాసాదులను, ఆంధ్ర కవులైన నన్నయ, తిక్కన, నాచనసోమన, హుళక్కి భాస్కర, పోతరాజాదులను అభినుతించాడు. సుకవిస్తుతి, కుకవినింద కావించాడు. కృతిపతియైన మహాదేవాచార్యుని ప్రశంసించాడు. గురుపరంపరాభివర్ణన, అజ్ఞాన భూమికా/వివరణము, మహాత్యాగి లక్షణము, జ్ఞానభూమికా/వివరణము చేశాడు.

ఇక ప్రథమాశ్వాసమైన– తారకయోగంలో, సీత హనుమంతునికి తారక యోగాన్ని బోధించడాన్ని ఆరంభించారు. ఇందులో అభ్యాసాది యోగలక్షణము, ఆహింస, సత్య, అస్తేయ, బ్రహ్మచర్య, అపరిగ్రహ, శౌచలక్షణాలను, స్వాధ్యాయ, ఈశ్వరప్రణిధాన లక్షణాలను, యోగాసనాల లక్షణాలను విపులీకరించారు. యోగాభ్యాసం వల్ల ప్రాణవాయువు స్వాధీనమవుతుందని, వాయువుకు మనస్సుకు సంబంధముండటంవల్ల వాయు జయంతోపాటు మనోజయం కూడా కలుగుతుందని, ఇంద్రియాల కన్నింటికి మనస్సే ప్రభువు కాబట్టి వెంటనే ఇంద్రియ జయం కూడా చేకూరుతుంది. ఇట్లా అన్ని జయింపబడితేనే సంసారానికి ముఖ్య కారణాలైన కామక్రోధాదులు నశించి, జీవుడికి బ్రహ్మానంద సుఖం కలుగుతుందంటూ సహేతుకంగా, సయుక్తికంగా యోగఫలాన్ని నిరూపించారు. ఆ తర్వాత యోగాభ్యాసం చేసేవారు అనుసరించాల్సిన ఆహారాది నియమాలను వివరించారు. అనంతరం యోగమత లక్షణం, పంచముద్రాలక్షణం, సూర్యచంద్ర మండల కళా నిర్ణయం, హంసతత్త్వోపదేశం మొదలైన వాటిని విపులంగా వర్ణించి, తారక యోగాన్ని ముగించారు.

**రాజయోగంబు ముక్తికి రాజపథము**
**రాజు గుహ్యంబు పరమంబు రాజవిద్య**
**యదియు మూడు విధంబుల నలరుచుండు**
**సాంఖ్యతారక సదమనస్కములనంగ (1–89)**

**తారకంబు మనశ్శుద్ధి కారకంబు**
**సాంఖ్యమాత్మ స్వరూప విచారకంబు**
**అనుభవ జ్ఞాన మమనస్క మట్లుగాన**
**నాద్యమెరిగింతు మొదల నీ వవధరింపు (1–90)**

రెండవ అధ్యాయంలో, సాంఖ్యయోగంలో పరబ్రహ్మ స్వరూపము, భావాభావ పదార్థ స్వరూపము, మాయా స్వరూపము, ప్రపంచకారణ స్వరూపము, సూక్ష్మశరీర సృష్టిప్రకారము, జీవ బ్రహ్మైక్య విచారము, ఓంకార స్వరూప నిరూపణము, పంచకోశ వివేచనము, దృక్ దృశ్యవివేకము, సద్రూప చిద్రూప లక్షణాలు, ప్రళయ వివరణం, ఆనంద అఖండ లక్షణాలు మొదలైన వాటిని సహేతుకంగా నిరూపించారు.

ఈ ఆశ్వాసంలో పరబ్రహ్మమును గూర్చి ఇట్లా చెప్తున్నారు కవి,

**ప్రస్థాన త్రయ వేద్యుడు**

**వస్థాత్రయ సాక్షి సర్వవస్తుస్తోమాం**

**తస్థుం దస్థిర విశ్వభ**

**వస్థిత్యంతాది మూర్తి వాయుకుమారా! (2-9)**

"ఉపనిషత్తులు, గీత, బ్రహ్మసూత్రాలు మొదలైన శాస్త్రగ్రంథాలన్నీ పరబ్రహ్మమును గూర్చే చెప్తున్నాయి. జాగ్రత్ స్వప్న సుషుప్తులనే మూడు అవస్థలను, ఆ పరబ్రహ్మము వల్లనే తెలిసికోలగలుగుతున్నాము. ప్రపంచంలోని సర్వపదార్థాలలోను ఏకరూపుడై ఉన్నవాడు ఆ మహాత్ముడే యదార్థంగా అస్థిరమైన ఈ ప్రపంచం పుట్టినట్లు, నిలిచినట్లు, నశించినట్లు తోచడానికి కారణం ఆ పరబ్రహ్మమే"!

ఇక మూడవ ఆశ్వాసంలో అమనస్క యోగలక్షణము తద్వర్తనము, వైరాగ్యబోధ, ఉపరతుల తారతమ్యము, వైరాగ్య శబ్దార్థ విమర్శనము, గురుశుశ్రూష ముఖ్యమని చెప్పడం, మహా వాక్యార్థ వివరణము, సుస్థితప్రజ్ఞుని లక్షణము, పంచదశ యోగాంగాల విభాగము, యోగిలక్షణము, జీవన్ముక్తుని లక్షణము మొదలైన వాటిని సాంగంగా సంభావించారు.

ఇందులో అమనస్క యోగ లక్షణాన్ని గూర్చి చెప్తూ లింగమూర్తి కవి ఇట్లా అంటున్నారు.

**తనుదాగానని మనుజుని**

**మనము నిరోధింప బడక మసలుచు దిరుగున్**

**దను దాగను సత్పురుషుని**

**మనమానందాబ్ధియందు మన్నతనొందున్ (3-56)**

"ఆత్మావలోకనము చేయలేని మనస్సు నిరోధింపబడక, అటునిటు తిరుగుతుంటుంది. ఆత్మావలోకనము గల మహాత్ముని మనస్సు బ్రహ్మానందానుభవమనే సాగరంలో మునిగి నిశ్చలమవుతుంది. కాబట్టి అమనస్క యోగానికి విజ్ఞానం కంటె ఇతర సాధన మేమీ లేదని భావం.

దురవగాహమైన వేదాంతాన్ని సులభశైలిలో క్లిష్టపద సందర్భం కలుగకుండా గద్యపద్యాలలో

ఇమిడ్చారు లింగమూర్తి కవి. ఈ గ్రంథంలో అక్కడక్కడ ఏకాక్షర, ద్వ్యక్షర, ముక్తాపదగ్రస్తాది శబ్ద చిత్రాలు గల పద్యాల నెన్నింటినో రచించి తన పాండిత్య ప్రకర్షను వెల్లడించారు. ఇంకా వర్ణనాంశాలలో నిరోష్ఠ్య పద్యాలు, సర్వతగ్రప్రాస పద్యాలు చతగ్రప్రాస పద్యాలు వ్రాసిన, తన విద్వత్తును ప్రకటించారు.

ఈ ప్రబంధంలో వివిధ విశేష ఛందస్సులనుపయోగించారు కవి. తృతీయాశ్వాస ఆరంభంలో ఆంజనేయుడు శ్రీరాముణ్ణి వినుతించిన ఘట్టంలో దండకం రచించారు. సీతారామాంజనేయంలో ప్రస్తావించ బడ్డ విశేష ఛందస్సులెన్నో. అవి సుగంధి, వనమయూరము, విభూతి, తోదకము, క్రౌంచపదము, సుందరీవృత్తము, విద్యున్మాతా, స్రగ్ధర, వనమయూరము, వసంతతిలకము, పంచచామరము, భుజంగప్రయాతము, ద్విరదగతి రగడ, కవిరాజవిరాజితము, ఉత్సాహము, ఇంద్రవజ్రము మానిని మొదలైనవి. వీటిని పరిశీలిస్తే ఈ కవిలోని ఛందో పరిజ్ఞానం వ్యక్తమవుతుంది.

సీతారామాంజనేయ సంవాద కావ్యానికి సర్వంకషంగా మొదట వ్యాఖ్యానం చేసినవారు పాలపర్తి నాగేశ్వరశాస్త్రి గారు. నేను చూసిన ఈ పుస్తనానికి సులభశైలిలో, అద్వైతవిషయాలనన్నింటినీ చక్కగా చర్చిస్తూ టీకా తాత్పర్యాలు వ్రాసిన వ్యాఖ్యాత వెన్నెలకంటి సుందరరామశాస్త్రి గారు.

మొత్తంమీద అందరికీ తేటతెల్లమయ్యే ఆంధ్రభాషలో వ్రాయబడిన సామాన్యులైన వేదాంత జిజ్ఞాసువులకు కూడా సులభంగా, సుబోధంగా సిద్ధాంత స్వరూపాన్ని సిద్ధం చేసిన సంజీవని వంటి రాజయోగ సమ్మిశ్రితమైన వేదాంత గ్రంథం సీతారామాంజనేయ సంవాదమనడంలో ఎలాంటి సందేహము లేదు.

# పూర్వజన్మ సుకృతాలు

**ఋణాను బంధ రూపేణ పశుపత్నీ సుతాలయః**
**ఋణక్షయే క్షయం యాంతి కాతత్రపరివేదనా.**

పశువులు, భార్యలు, కొడుకులు, ఇళ్ళు– ఇవన్నీ మన పూర్వజన్మ సుకృతాలను బట్టి కలుగుతారు. ఋణం తీరిపోగానే వారు లేక అవి దూరం అవుతాయి. కనుక మంచి గాని, చెడుగాని అంతా రుణానుబంధమే ఈ విషయాల్ని గ్రహిస్తే ఇక బాధ, దుఃఖం కలుగవు.

# సువర్ణ శుభాకాంక్షలు

**శ్రీ రామడుగు వేంకటేశ్వర శర్మ**
గుంటూరు, చరవాణి : 9866944287

1. తే.గీ॥ ధర్మ మూలంబు భువిని వేదంబుగాదె!
తతము విశ్వతత్త్వంబు వేదంబుగాదె!
స్తవ్యకర్తవ్యబోధ వేదంబుగాదె!
తరుణ నిత్యాక్షరంబు వేదంబుగాదె!

2. తే.గీ॥ వేదమే "శం– కరంబోయి! విశ్వమునకు
వేదము వివేక మానంద విపుల మోయి!
వేదమే చిన్మయానంద విశదమోయి!
వేదమునకేది సాటి? ఆవేదమెగద!"

3.తే.గీ॥ ఇలను వేద కీర్తిపతాకలెగురుటకును
వేద పరిషదుత్సవములే వేదియగును;
శుభదనవరాత్ర పర్వసత్ప్రభలలోన
వేద పరిషత్ సువర్ణ సద్వేళ – రాక
నిజము – ఆనంద "శోభకృత్" – నిజము – నిజము॥

4.తే.గీ॥ ఘన "దశిక రామరాయ" సంకల్పమిద్ది;
భద్ర కృషియొ "శాస్త్రీ" య "సింహాద్రి" మయమె;
స్ఫూర్తిమత్ "శ్రీనివాసై" "కమూర్తి" దీక్ష
వేదగురువర్యశిష్యాళివిశదతేజ
ములె – సువర్ణోత్సవాలకు మూలము గద!
నా శుభాకాంక్షలిడెద నానందమదర॥

5. సీ॥ కనిపించు నిక కదున్ – ఘనజటాక్రమకళా
చలదాగమ ప్రభాజయపతాక
వినిపించు నిక కదున్ – వేదకుమారుల
క్రమకల్యాణ మంగళరవంబు
వెలయుగా! నిక కదున్ విప్రాళిహితకార్య
ముల గౌరవాదరంబుల తళతళ
నెగడుగా! నిక కదున్ నిర్నిద్రనిత్యాగ్ని
హోత్ర ప్రభావమహోదయంబు
చెక్కుచెదరని, ఏనాడు మొక్కవోని
భరత సంస్కృతి కీర్తివైభవము గనుత !
"గుంటురు" "రవీంద్రనగరు" – వెన్నంటి యెపుడు
"వేదపరిషత్" సువర్ణమై విదితదీప్తి
అల్ల పరతత్త్వ కరుణామహత్త్వ గరిమ ॥

**శుభం భూయాత్**



మనిషి తన విచక్షణా శక్తిని ఉపయోగించి తనకు భగవంతుడు అనుగ్రహించిన సంపదను యోగ్యమైన పనుల కోసం వినియోగించాలి. అతను ఆ భగవద్గీత ప్రసాదాన్ని దానధర్మాలు చేయడంలో వ్యయం చేస్తూ ప్రతివారికీ ఉపయోగపడే శ్రేష్ఠమైన పనులను చేసినపుడు భగవంతుడు నిరాటంకంగా సంపదన ప్రసాదిస్తాడు. దాన్ని సక్రమంగా సద్వినియోగం చేస్తున్నంత కాలం మీకు ఆయురారోగ్యాలను అనుగ్రహిస్తూనే ఉంటారు.

**– జగద్గురు శ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామివారు**

# వేదపరిషత్ స్వర్ణోత్సవ శుభాకాంక్షలు

**అక్కిపెద్ది సూర్యనారాయణ, తణుకు**
చరవాణి : 92901 91161

1. విద్యలకు నెల్ల మూలమౌ వేదములను
అవనియందున సుస్థిరంబగుచు నిలువ
తనర  దశిక రామారావు ధార్మికుండు
వేదపరిషత్తు నేర్పాటు వెలయజేసె

2. వారి ప్రోత్సాహమెంతయు వరలుచుండ
ప్రథితమై యొప్పె నొక వేద పాఠశాల
దాత లెందరో దానికి నూత నిడగ
నేడు స్వర్ణోత్సవంబున నివ్వటిల్లె

3. సుప్రసిద్ధుడన్నేశ్వర సోమయాజి
ప్రధమ గురుడౌచు నాగమ పాఠములను
నేర్పె విద్యార్థులెందరో నేర్చినారు
వేదపరిషత్తు తన నభివృద్ధి గాంచె

